

ప్రతిభావంతుల ఎంపైర్

- ఛాలెంజింగ్ బాధ్యత క్రికెట్ అంపైరింగ్
- రోజంతా విధుల నిర్వహణ కత్తిమీద సాము
- ఒక పొరపాటు మ్యాచ్ గమనాన్నే మార్చవచ్చు
- సమర్థవంతుడనిపించుకున్న విశాఖ వాసి
- కుంచా పార్థసారథి ఘనత ఇది

-సెంటర్‌స్ప్రెడ్‌లో..

జర్నీ JOURNEY



దానంతో పునర్జన్మ

- ప్రాణాలు కాపాడే అవయవ దాతలు
- ఒకరి ద్వారా 18 మందికి ప్రాణదానం
- జిల్లాలోనే మూడు వేల మంది రోగులు
- చైతన్యం కరువై మట్టిలో కలిసిపోతున్న అవయవాలు
- బ్రెయిన్ డెడ్ కేసుల్లో అన్ని అంగాలతో ప్రయోజనం

నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

-సెంటర్‌స్ప్రెడ్‌లో..

ఆంధ్రజ్యోతి
విశాఖపట్నం

andhrajyothy.com

ఆదివారం 13 ఆగస్టు 2017 | 16 పేజీలు

అన్నదాత ఆనందం



మాడుగులలో భారీ వర్షం

జిల్లా అంతటా ముసురు

- పలు మండలాల్లో భారీ వర్షాలు
- బెట్ట నుంచి తేరుకున్న మెట్ట పంటలు
- వరినాట్లుకు ఎంతో దోహదం
- దమ్ములు చేయడానికి రైతులు సన్నద్ధం
- చెరకు తోటలకు ఎంతో మేలు
- చెరువుల్లోకి కొత్త నీరు
- నదుల్లో పెరిగిన వరద నీటి ప్రవాహం

11



మాకవరపాలెంలో పొలాల్లో చేరిన వర్షపు నీరు

కోస్తామీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో శనివారం జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత, ఉక్కపోత వాతావరణం నెలకొనగా, మధ్యాహ్నం పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. కారుమబ్బులు కుమ్ముకుని వర్షం మొదలైంది. పలు మండలాల్లో భారీగా వర్షం కురిసింది. మెట్ట భూముల్లో అపరాలు, చిరుధాన్యాలు, వేరుశనగ, మొక్కజొన్న, చెరకు పంటలకు ఎంతో దోహదం చేస్తుందని రైతులు చెబుతున్నారు. మాగాణుల్లో దమ్ము పనులు చేసి, వరినాట్లు వేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువుల్లోకి కొత్త నీరు చేరుతోంది. నదులు, గెడ్డల్లో నీటి ప్రవాహం పెరిగింది, దీనివల్ల లింకు చెరువులు, గ్రోయిన్ల ఆయకట్టుకు నీటి సదుపాయం మెరుగుపడుతుందని రైతులు అంటున్నారు.

ఎరువుల ధరలు కొద్దిగా తగ్గాయ్



50 కిలోల బస్తాపై కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.80 వరకు తగ్గుదల

పాత ఎరువులను కూడా కొత్త ధరలకే విక్రయించాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు

తగ్గించినా అమ్మని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

చోడవరం/రోలుగుంట, ఆగస్టు 12: ఎరువుల ధరల విషయంలో రైతులకు స్వల్ప ఊరట. జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత ఎరువుల ధరలు కొద్దిగా తగ్గాయి. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమల్లోకి ..మిగతా 6వ పేజీలో..

మొక్కుబడిగా..



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ భవాని

జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలకు అధికారుల డుమ్మా

దిగువస్థాయి సిబ్బంది రావడంతో చప్పగా సాగిన చర్చ

అధికారుల తీరుపై చైర్‌పర్సన్ అసహనం

వైద్య, ఆరోగ్య శాఖపై సభ్యుల అసంతృప్తి

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవానీ అధ్యక్షతన శనివారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు మొక్కుబడి తంతుగా సాగాయి. ఒక్క శాఖ నుంచి కూడా జిల్లాస్థాయి అధికారి హాజరుకాలేదు. కిందిస్థాయి ఉద్యోగులు హాజరు కావడంతో సభ్యులు ముఖ్యమైన అంశాలను ...మిగతా 7వ పేజీలో..

తపాలా ఉద్యోగుల సహకార సంఘంలో

నిధులు గోల్‌మాల్



తపాలా ఉద్యోగుల సహకార సంఘం భవనం

రూ. రెండు కోట్ల వరకు అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు

అధ్యక్షుడే అక్రమాలకు పాల్పడినట్టు సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు

విచారణ జరిపించాలని వినతి

అనకాపల్లి, ఆగస్టు 12: అనకాపల్లి డివిజన్ తపాలా ఉద్యోగుల సహకార సంఘంలో పెద్ద ఎత్తున నిధులు గోల్‌మాల్ అయ్యాయని, అనేక అవకతవకలు జరిగాయని పలువురు సంఘం సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు రెండు కోట్ల రూపాయల మేర జరిగిన అవకతవకలపై ఆంధ్రప్రదేశ్ సహకార చట్టాల సంఘం-1964 సెక్షన్ 51 ప్రకారం సంఘం లావాదేవీలపై సమగ్ర ...మిగతా 6వ పేజీలో..



బ్రహ్మజెముడు ముల్లుతో సూక్ష్మ తాజ్‌మహల్

-మెయిన్ ఎడిషన్‌లో...

టిప్పర్‌ని ఢీకొన్న ఆటో

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం
- క్షతగాత్రులంతా ఒకే గ్రామస్థులు

10

నేడు ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే..



చిరు ప్రాయంలో ఎడమ చేతితో తింటే తల్లిదండ్రులు ఒప్పుకోరు... స్కూల్‌లో ఎడమ చేతితో రాస్తే తోటివారి నుంచి ఎగతాళి... ఎడమ చేతితో పనులు చేస్తే సమాజం వింతగా చూస్తుంది. ఏంటీ.. ఎడమ చేతితో పనులు చేయడం వల్ల ఇన్ని సమస్యలున్నాయని అనుకుంటున్నారా..? అవును... ఇది మేమంటున్న మాట కాదండి... సమాజంలోని లెఫ్ట్ హ్యాండర్స్ వ్యక్తం చేస్తున్న ఆవేదన ఇది. వీటితోపాటు అనేక సమస్యలు లెఫ్ట్ హ్యాండర్స్‌ను వేధిస్తున్నాయన్న భావనతో పాటు, సమాజానికి లెఫ్ట్ హ్యాండర్స్‌పై ఉన్న భావనను తొలగించాలని కోరుతున్నారు. ఆదివారం ప్రపంచ లెఫ్ట్ హ్యాండర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



ఎడమ చేతివాటం.. ఎంతో ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ప్రపంచవ్యాప్తంగా ఎడమ చేతివాటం వారిపై ఉన్న కొన్నిరకాల అపార్థాలు, అపోహలను తొలగించాలన్న ఉద్దేశంతో 1976 ఆగస్టు మూడున మొదటిసారిగా 'లెఫ్ట్ హ్యాండర్స్ డే'ను నిర్వహించారు. ఆ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లెఫ్ట్ హ్యాండర్స్ ఒక దగ్గర చేరి తమ అనుభవాలను, ఎదుర్కొన్న ఇబ్బందులను తెలియజేయడంతోపాటు లెఫ్ట్ హ్యాండ్ అలవాటు వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలియజెప్పేందుకే ఈ 'డే'ను నిర్వహిస్తున్నారు.

ఎందుకోసం..?

సమాజంలో అధిక శాతం మంది కుడి చేతివాటం వాళ్లే కావడం వల్ల అందుకు అనుగుణంగానే కొన్ని రకాల సాంకేతిక పరికరాలను రూపొందించారు. దీంతో ఎడమచేతివాటం ఉన్నవారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు చిన్న వయసు నుంచే ఎడమ చేతివాటం వారిపై సమాజంలో ఒక రకమైన చిన్నచూపు ఉంది. కంప్యూటర్ ఆపరేటింగ్ చేసే సమయంలో, పరీక్ష టేబుల్స్‌తో పాటు పలు పరికరాలు, వస్తువులను రైట్ హ్యాండర్స్‌ను దృష్టిలో పెట్టుకునే రూపొందిస్తున్నారు. అటువంటి వాటితో లెఫ్ట్ హ్యాండర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఈ సమస్యలను ఎదుర్కొంటూనే కుడి చేతివాటం వారితో పోటీ పడుతూ ఎలా ఎదగాలో తెలియజేసేందుకు ఎడమ చేతివాటం క్లబ్‌ను ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఇవీ అనుకూలతలు

సాధారణంగా కుడి చేతివాటం వారితో పోల్చితే ఎడమ చేతివాటం వారిలో కొన్ని రకాల అనుకూలతలు ఉన్నట్టు పలు సర్వేల్లో వెల్లడైంది.

- డ్రైవింగ్ టెస్ట్‌లో కుడి చేతివాటం వారితో పోలిస్తే ఎడమ చేతివాటం వారు విశేషంగా రాణిస్తున్నట్టు వెల్లడైంది. కుడి, ఎడమ చేతివాటం గల బ్రదర్స్, సిస్టర్స్‌కు నిర్వహించిన డ్రైవింగ్ టెస్ట్‌లో 57 శాతం మంది ఎడమ చేతివాటంఉన్నవాళ్లు రాణించి డ్రైవింగ్ టెస్ట్ పూర్తి చేయగలిగారు.
- ఎడమ చేతివాటం వారితో పోలిస్తే కుడి చేతివాటం వారు అధికంగా సంపాదిస్తున్నట్టు పలు సర్వేల్లో వెల్లడైంది. యూఎస్ నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ రీ సెర్చ్ ప్రకారం ఎడమ చేతివాటం వాళ్లు కుడి చేతివాటం వారికంటే 15 శాతం అదనంగా ఆర్జించే పనులను చేస్తున్నట్టు వెల్లడైంది.
- రైట్ హ్యాండర్స్‌తో పోలిస్తే ఎడమ చేతివాటం వాళ్లు అత్యంత వేగంగా కంప్యూటర్ కీ బోర్డ్‌లో టైప్ చేస్తున్నారు. కుడి చేతివాటం వాళ్లు 450 వర్డ్స్ టైప్ చేస్తే లెఫ్ట్ హ్యాండర్స్ 3,400 వర్డ్స్‌ను వేగంగా టైప్ చేయగలరని ఒక సర్వేలో వెల్లడైంది.
- టెన్నిస్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో కుడిచేతివారితో పోలిస్తే ఎడమ చేతివాటం క్రీడాకారులు అద్భుతంగా రాణించేందుకు అవకాశం ఉంది. వారిలో రైట్, లెఫ్ట్ బ్రెయిన్ పనితీరు వల్ల ఇది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

వందలో పది మందికి 'లెఫ్ట్ హ్యాండ్' వినియోగం

బ్రెయిన్‌లో కుడి, ఎడమ భాగాల ప్రభావం వల్లే అలవాటు..

ఎడమ చేతివాటం వాళ్లకు కొన్ని అనుకూల, ప్రతికూల పరిస్థితులు

- విజువల్ ఆర్ట్స్ క్రియేషన్‌లో అద్భుతంగా రాణించగల సామర్థ్యం రైట్ హ్యాండర్స్ వారి కంటే ఎడమ చేతివాటం వారిలో అధికంగా ఉంటుంది.
- వేగంగా ఆలోచించడంలోనూ, సమస్యలను పరిష్కరించుకోవడంలో రైట్ హ్యాండర్స్ కంటే లెఫ్ట్ హ్యాండర్స్ స్పీడ్‌గా ఉంటారు.

ప్రతికూలతలు కూడా..

- కంప్యూటర్ వినియోగించే సమయంలో కీ బోర్డు, మౌస్ విషయంలో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.
- కత్తెర వినియోగంలో, పరీక్షలు రాసేందుకు అనువైన బెంచ్‌లు, టేబుళ్లు లేకపోవడం.
- బైక్ స్టాండ్ వేసే సమయంలో ఇబ్బంది పడతారు.
- దేవుడి ప్రసాదంతోపాటు మరేదైనా ఎడమ చేతితో తీసుకోవడం.
- సమాజంలో ఎడమ చేతితో పనులు చేస్తున్న వారిని అదోలా చూడడం.

ఎడమ చేతివాటంలో ప్రముఖులు

ఎడమ చేతివాటం కలిగిన వారిలో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖులున్నారు. అయినా చాలామందికి ఆ విషయమే తెలియదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ఒబామా, బిల్‌గేట్స్, అరిస్టాటిల్, అలెగ్జాండర్, మేడం క్యూరీ, జార్జిబుష్, బిల్‌క్లింటన్, రోనాల్డ్ రాగన్, క్రికెటర్లు అలెన్‌బోర్డర్, సౌరవ్ గంగూలీ, రతన్ టాటా, యువరాజ్‌సింగ్, కరన్ జోహార్, అమితాబ్ బచ్చన్ వంటి ఎంతోమంది ఈ జాబితాలో ఉన్నారు. వీరంతా ఏదో ఒక సందర్భంలో ఎడమ చేతివాటం వల్ల ఇబ్బందులు పడినవారే కావడం గమనార్హం.!

జన్యుపరమైన కారణాల వల్లే..



ప్రపంచవ్యాప్తంగా ఉన్న జనాభాలో 88 నుంచి 90 శాతం మంది ప్రజలు రైట్ హ్యాండర్స్ ఉండగా... ఏడు నుంచి తొమ్మిది శాతం మంది లెఫ్ట్ హ్యాండర్స్, ఒకటి నుంచి రెండు శాతం మంది రెండు చేతులను వినియోగించే వారున్నారని నిపుణులు చెబుతున్నారు. జన్యుపరమైన కారణాల వల్ల మాత్రమే ఎవరైనా రైట్ హ్యాండర్‌గా, లెఫ్ట్ హ్యాండర్‌గా అయ్యేందుకు అవకాశం ఉంది. అటువంటి కారణాలు వారికి తెలియకుండానే అలవాట్లుగా మారి ఆయా చేతులతో జరుగుతుంటాయి. రైట్ హ్యాండర్స్‌కు ఎడమ చేతివైపు ఉండే బ్రెయిన్ 90 శాతం వరకు ప్రభావవంతంగా ఉంటే, ఎడమ చేతివాటం వారికి 50 శాతం మాత్రమే కుడిచేతి వైపు ఉండే బ్రెయిన్ ప్రభావవంతంగా ఉంటుంది. మరో 50 శాతం కుడి, ఎడమ వైపుల ఉండే బ్రెయిన్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల ఎడమచేతి అలవాటు ఉన్న వారికి కొంతవరకు కొన్ని రకాల అవకాశాలు అదనంగా ఉంటాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. ఈ కారణం వల్ల మ్యూజిక్, మ్యాథ్స్, స్పోర్ట్స్ వంటి వాటిలో విశేషంగా రాణించేందుకు ఎడమ చేతివాటం వారికి అవకాశం ఉంటుంది.

ఆలోచన విభిన్నంగా ఉంటుంది



రైట్ హ్యాండర్స్‌తో పోలిస్తే లెఫ్ట్ హ్యాండర్స్ ఆలోచన విధానం కొంత విభిన్నంగా ఉంటుంది. ప్రధానంగా లెఫ్ట్ హ్యాండర్స్ నిజాయితీగా, నిక్కచ్చిగా ఉంటారని పలు పరిశోధనల్లో వెల్లడైంది. అదే సమయంలో ఏదైనా పనిని తలపెడితే దానిని పూర్తి చేసేంతవరకు వదిలిపెట్టని మనస్తత్వం వీరిలో ఉంటుంది. లెఫ్ట్ హ్యాండర్‌గా ఉండడం వల్ల ఇప్పటివరకు ఎటువంటి ఇబ్బంది అనిపించలేదు. అతి కొద్దిమందిలో మాత్రమే కనిపించే ఈ అలవాటు ఉండడం వల్ల మా పనితీరు, అలవాట్లను చాలా మంది గమనించేందుకు ఆసక్తిచూపిస్తుంటారు.

-ఏపీఎస్ సత్యనారాయణ, లెఫ్ట్ హ్యాండర్

పది శాతం మంది లెఫ్ట్ హ్యాండర్స్



సమాజంలో ప్రతి వంద మందిలో పది మంది లెఫ్ట్‌హ్యాండర్స్ ఉన్నారు. ప్రధానంగా మెదడులోని కుడి, ఎడమ భాగాల పనితీరు ప్రభావం వల్లే రైట్, లెఫ్ట్ హ్యాండర్స్ అలవాట్లు ఉంటాయి. రైట్ సైడ్ మెదడు అధిక ప్రభావవంతంగా ఉన్నవారిలో లెఫ్ట్ హ్యాండర్ అవుతుంటారు. ఫ్యామిలీ హిస్టరీ వంటి అంశాలేమీ దీనికి కారణం కాదు. అయితే లెఫ్ట్ హ్యాండర్ కావడం వల్ల కొన్ని ఇబ్బందులు, అనుకూలతలు కూడా ఉన్నాయి.

-డాక్టర్ ఎం.మధుసూదన్‌బాబు, ప్రముఖ వైద్యుడు

ఇగ్నో ఎంబీఏ ప్రవేశ పరీక్ష

దరఖాస్తుల గడువు పెంపు

విశాఖపట్నం: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఎంబీఏ కోర్సులో నిర్వహించే ప్రవేశపరీక్ష దరఖాస్తుల గడువు ఈనెల 21వ తేదీ వరకు పొడిగించినట్టు ఇగ్నో ప్రాంతీయకేంద్రం సంచాలకులు డాక్టర్ ఎస్.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 50శాతం మార్కులు సాధించనవారు అర్హులని తెలిపారు. రిజర్వేషన్ కేటగిరి అభ్యర్థులు 45 శాతం మార్కులు సాధించిన వారు ఈ ప్రవేశపరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. ఎంబీఏ కాలవ్యవధి రెండేళ్లలో పూర్తవుతుందని తెలిపారు. ప్రవేశపరీక్ష సెప్టెంబరు 24వ తేదీన జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 0891 2511200/300, 8499084428 నంబర్లను సంప్రతించాలని తెలిపారు.

పౌష్టికాహారంలో చిలక్కొట్టుడు

స్టాకు రాలేదంటూ నిర్వాహకులు చేతివాటం

డి.కొత్తూరు, కొత్తపాకల గ్రామాల్లో

గర్భిణులు, బాలింతల అసహనం

చర్యలు తీసుకోవాలని డిమాండ్

సీలేరు: మాతాశిశు మరణాల రేటు తగ్గించేందుకు ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. ఇందులో భాగంగా వారిలో రక్తహీనత.. తద్వారా బలహీనత నివారణకు పౌష్టికాహారం అందిస్తున్నది. ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగా ఉండే గిరిపుత్రులకు ఇది ఎంతగానో దోహద పడుతుంది. అయితే, కంచే చేను మేసిన చందంగా, ఇందులోనూ చిలక్కొట్టుడు ఎక్కువ కావడం గర్భిణులు, బాలింతలను ఆందోళనకు గురి చేస్తున్నది. ధారకొండ, దుప్పులవాడ పంచాయతీల్లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా ఉందని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ పంచాయతీ పరిధిలో డి.కొత్తూరు, దుప్పులవాడ పంచాయతీలోని కొత్త పాకల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామాల్లోని నాలుగు వీధుల్లో సుమారు 50 మందికి పైగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారని, వీరికి నెలకు కేవలం పది గుడ్లు మాత్రమే ఇస్తున్నారని, పాలు కొన్ని నెలలుగా ఇవ్వడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో నెలలో అవి కూడా ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన శెట్టి ధారలక్ష్మి తెలిపింది. దుప్పులవాడ పంచాయతీ కొత్తపాకలు గ్రామంలో కమ్మరితోట అంగనవాడీ కార్యకర్తల పౌష్టికాహారాన్ని అందించే బాధ్యతలు చేపడుతున్నారని, దీనివల్ల పూర్తి స్థాయిలో పౌష్టికాహారం అందడం లేదని, ఈ బాధ్యతలను స్థానికులకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. అలాగే పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాడేరు-విశాఖ బస్సుల్లో కండక్టర్ల పునరుద్ధరణ

- ప్రయాణికుల సౌకర్యానికి పెద్దపీట
- విశాఖ ఆర్టీసీ డీఎం రాజశేఖర్
- విశాఖ-సాలూరు మధ్య త్రీ స్టాప్‌లు

పాడేరు: పాడేరు-విశాఖ మధ్య తిరిగే ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రయాణికులకు అసౌకర్యం కలగకూడదనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని విశాఖ డిపో డీఎం రాజశేఖర్ అన్నారు. శనివారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విఫలప్రయత్నం' అనే శీర్షికతో ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఆయన స్పందించారు. విశాఖ-పాడేరు ఆర్టీసీ బస్‌ల్లో కండక్టర్ రహిత సర్వీసులు నడపడం వల్ల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అనేక ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. బస్సుల్లో కండక్టర్లు లేకపోవడం వల్ల మార్గ మధ్యలో ప్రయాణికులను ఎక్కించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.



మాట్లాడుతున్న డీఎం వేణుగోపాల్

దీంతో తమకు ఆర్టీసీ సేవలు దూరమవుతున్నామని ప్రయాణికులు, పలువురు ప్రజాప్రతినిధులు సైతం వినతులు సమర్పించారన్నారు. అందరి అభ్యర్థన మేరకు వాస్తవ పరిస్థితులను గమనించి, శనివారం నుంచి పాడేరు-విశాఖ బస్సుల్లో కండక్టర్లను ఏర్పాటు చేశామన్నారు. అయితే ప్రస్తుతం ప్రతి రెండు బస్సుల్లో ఒక బస్సులో మాత్రమే కండక్టర్ ఉంటారన్నారు. అలాగే ప్రయాణి కులు రద్దీ ఉండే సమయాల్లో, ఆయా స్టాపుల్లో ప్రయాణికులు ఉంటారనే సమయాల్లో నడిచే బస్సుల్లో విధిగా కండక్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉద్యోగుల రాకపోకలకు అనువుగా విశాఖ-పాడేరుకు త్రీస్టాప్ సర్వీసులు నడుపుతున్నామన్నారు. దీంతో ఆయా సర్వీసుల వల్ల ఉద్యోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఏజెన్సీలో ప్రయాణికులు ప్రైవేటు వాహనాల ఆశ్రయించి ప్రమాదాలకు గురికావద్దని కోరారు. ఆర్టీసీ సేవలు ప్రయాణికులు సద్వినియోగం చేసుకుంటే, మరిన్ని ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట స్థానిక ఆర్టీసీ డీఎం రమేశ్ ఉన్నారు.

ఖరీఫ్ రైతుకు కష్టాలు

- నెల రోజులుగా పడని వర్షాలు
- తాండవ నదిలో తగ్గిన నీరు
- ఇంజన్లతో పొలాలకు నీరు
- ఎకరాకు రూ.4500 అదనపు భారం
- నారు ముదిరిపోతుందని రైతుల ఆందోళన



వరి నాట్లకు చెరువునీటిని బోర్లతో పెట్టుకుంటున్న దృశ్యం



నీరు తగ్గిన పాల్తేరు కనుమల చెరువు



భూమి ఆనకట్ట వద్ద తగ్గిన నీరు

పాయకరావుపేట : పాయకరావుపేటలో సుమారు ఆరు వారాలుగా వర్షాలు పడలేదు. ఒకవైపు వర్షాలు పడకపోవడంతో, మరో వైపు తాండవ నదిలో నీరు తగ్గిపోవడంతో రైతులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో నెల రోజులుగా వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ రైతాంగం నీటి కష్టాలను ఎదర్కొంటుంది. పాయకరావుపేట మండలంలో ఏటా ఖరీఫ్‌లో సుమారు పది వేల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. తాండవ ఆయకట్టు ఏడు వేల ఎకరాలు కాగా, మిగిలిన మూడు వేల ఎకరాలు వర్షాధార భూములు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో భారీ వర్షాలు పడడంతో సాగునీటి చెరువులు, పాయకరావుపేట వద్ద భూమి, ముఠా ఆనకట్టల వద్దకు అధికంగా నీరు చేరింది. దీంతో పలు గ్రామాల్లో రైతులు నారు మడులు సిద్ధం చేసుకున్నారు. జూలై, ఆగస్టుల్లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఎండలు మండిపోతుండడంతో చెరువులు, కాలువల్లో నీరు ఇంకిపోతుంది. పాల్తేరు, కందిపూడి, ఎస్.నర్సాపురం తదితర గ్రామాల్లో సాగునీటి చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని పైపుల ద్వారా పొలాలకు సరఫరా చేసుకుని దమ్ములు చేసుకుంటున్నారు. తాండవ నదిలో నీరు తగ్గిపోవడంతో పంట కాలువలకు ఆనుకుని ఉన్న భూముల్లో మాత్రమే నాట్లు పడుతున్నాయి. తాండవ రిజర్వాయర్ నీరు విడిచి పెట్టిన తర్వాత నాట్లు వేసుకుందామని ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభంలో పడిన వర్షాలు ఆ తరువాత పడనందున బోర్లతో నీటిని తోడుకుని నాట్లు వేసుకోవాల్సి వచ్చిందంటున్నారు. రెండు సార్లు నారు తడుపునకు రూ.వెయ్యి, ఎకరం భూమిలో నాట్లు వేసుకునేందుకు సరిపడ నీరు నింపడానికి మోటారుకు గంటకు వంద రూపాయల అద్దె చొప్పున 25 గంటలకు రూ.2,500లు, రూ.600లు ఆయిల్ ఖర్చుఅయ్యిందన్నారు. అపుడే చెరువుల్లో ఉన్ననీరు తగ్గిపోతున్నందున రానున్న రోజుల్లో వర్షాలు పడకుంటే పంటను ఎలా కాపాడుకోవాలో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీనిపై మండల వ్యవసాయాధికారి డి.సౌజన్య మాట్లాడుతూ జూలైలో వర్షాలు లేనందున నీరులేని మండలంలో ఇప్పటి వరకు 500 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి అధిక వర్షాలు పడే అవకాశముందని వ్యవసాయశాఖ చెబుతుండడంతోపాటు 15వ తేదీ నుంచి తాండవ నీటిని విడుదల చేసే అవకాశమున్నందున ఇక నుంచి నాట్లు ముమ్మరంగా వేయనున్నారని తెలిపారు.

పెరిగి పోతున్న పెట్టుబడులు



నాట్లు కోసం చెరువు నుంచి బోర్లతో నీటిని తోడుకోవడం వల్ల రూ.4 వేలు అదనరగా ఖర్చు చేయాల్సి ఉంది. దీంతో పెట్టుబడులు పెరిగాయి. వర్షాలు పడకపోతే రానున్న రోజుల్లో కూడా మదుపులు పెరిగే అవకాశం ఉందన్నారు.

- దేవవరపు అర్జున్, రైతు, పాల్తేరు

తాండవ నీటిని విడుదల చేయాలి



తాండవ రిజర్వాయర్ నుంచి నీటిని వెంటనే విడుదల చేస్తే రైతులకు ఉపయోగకరం. నీరు విడిచిపెడితేనే మండలంలో తాండవ ఆయకట్టు శివారు భూముల్లో నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది. లేకుంటే నారు ముదిరిపోయి నష్ట పోవాల్సి వస్తుంది.

-నీలాపు వెంకటరెడ్డి, కౌలు రైతు, కుమారపురం

విశాఖ సెంట్రల్ జైలుకు రిటైర్డ్ తహసీల్దార్ రామారావు

నాలుగు రోజులు విచారించిన సిట్

విశాఖపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ భూకుంభకోణం ఆరోపణలపై మూడు రోజులుగసిట్ విచారణలో ఉన్న భీమిలి మండల మాజీ తహసీల్దారు బీటీవీ రామారావును తిరిగి జైలుకు తరలించారు. భీమిలి మండల తహసీల్దారుగా పని చేసిన కాలంలో రామారావు నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, మాన్‌సస్ భూముల తారుమారు చేశారంటూ ఫిర్యాదులు అందడంతో ఈ రిటైర్డ్ తహ సీల్దార్‌పై భీమిలి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. అతడిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన భీమిలి పోలీసులు విశాఖ సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. రామారావుపై అందిన ఫిర్యాదులు, అభియోగాలపై విచారణకు న్యాయస్థానాన్ని సిట్ అనుమతి కోరింది. ఈ మేరకు అనుమతి లభించడంతో ఈ నెల 8 నుంచి రామారావును సిట్ అధికారులు ఏలేరు అతిథిగృహంలో విచారించారు. శనివారంతో నాలుగు రోజుల గడువు ముగియడంతో రామారావును తిరిగి విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. నాలుగు రోజుల పాటు విచారణలో ఆయన నుంచి సిట్ అధికారులు అనేక కీలక విషయాలను రాబట్టినట్టు తెలిసింది. ఆయన నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా భీమిలి మండలంలో సిట్ బృందాలు సోమవారం నుంచి క్షేత్ర పరిశీలన నిర్వహించి, తదుపరి చర్యలకు కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నారు.


అద్దె భవనంలో కళాశాల బాలికల వసతి గృహం


వసతి గృహంలో విద్యార్థినులు


రన్నింగ్‌వాటర్ లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

జూనియర్ కళాశాల విద్యార్థినులకు వసతి సమస్య

- వంట షెడ్డు లేక అవస్థలు పడుతున్న నిర్వాహకులు
- బోరు లేక స్నానాలకు గెడ్డలను ఆశ్రయిస్తున్న విద్యార్థినులు
- మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేక ఇక్కట్లు
- వర్షాలకు కారిపోతున్న శ్లాబ్
- అధికారులు పర్యవేక్షించాలని విద్యార్థినుల తల్లిదండ్రుల డిమాండ్

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు సరైన వసతి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరికి పోలీసు స్టేషన్ భవనాన్ని కళాశాల బాలికలు వసతిగృహంగా వినియోగిస్తున్నారు. ఇక్కడ పూర్తిస్థాయి సౌకర్యాలు లేక సమస్యలతో సతమతమవుతున్నారు. వసతి గృహంలో సుమారు 120 మంది బాలికలు నివాసం ఉంటున్నారు. వీరికి వంటలు చేసేందుకు కనీసం వంటషెడ్డు కూడా లేదు. దీంతో విద్యార్థినులకు వంట చేసి భోజనాలు అందివ్వడం కష్టతరంగా మారిందని నిర్వహకులు అంటున్నారు. బాలుర వసతి గృహంలో వంటకాలు చేపట్టి ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి సంబంధించి మూడు పూటల పెడుతున్నారు. వసతి ఒక చోట, భోజనాలు మరో చోట పెడుతుండడంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తాగునీటి సౌకర్యం లేదు. ఇతర అవసరాలు ఉపయోగించేందుకు నీటి సౌకర్యం లేక స్నానాలు చేసేందుకు విద్యార్థినులు గెడ్డలను ఆశ్రయిస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నా రన్నింగ్‌వాటర్ సౌకర్యం లేక ఇబ్బందులు తప్పడం లేదని బాలికలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఈ భవనం రెండంతస్థులు ఉండగా మొదటి అంతస్థులో కిటికీ, తలుపులు పూర్తిగా పాడైపోయి వర్షపుజల్లుకు శ్లాబ్ కారిపోతోంది. రెండో అంతస్థులో కిటికీలు, తలుపులతో పాటు శ్లాబ్‌పై ఎక్కేందుకు ఏర్పాటు చేసి ఉన్న మెట్లు గుండా వర్షపునీరు గదిలోపలకి ప్రవేశిస్తోంది. దీంతో విద్యార్థులు కనీసం పడుకోలేని దుస్థితి నెలకొంది. వర్షంతో కూడిన చలిగాలులు వీస్తుండడంతో విద్యార్థులను వణికిస్తోంది. దీంతో విద్యార్థులు గోని సంచులు, పేపర్ అట్టలు కిటికీలకు కట్టి చలి బారి నుంచి కాపాడుకుంటున్నారు. ఈ ఇబ్బందులను పడలేని కొద్దిమంది విద్యార్థులు గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొంతమంది మాత్రమే ఉంటున్నారు. వసతిగృహం సమీపంలో ఉన్న బోరు పాడైపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోడంలో అవస్థలు పడుతూ సమీప గెడ్డను ఆశ్రయిస్తున్నారు. ఎంతో ఆశతో వసతి గృహంలో ఉండి చదువులు కొనసాగిస్తామనుకున్న బాలికలు ఇక్కడ పరిస్థితిని చూసి తీవ్ర ఆందోళన గురవుతున్నారు.

ప్రస్తుతం దోమల బెడద అధికంగా వుందని, దోమతెరలు పంపిణీ చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ కనీస సౌకర్యాలు కరువైందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కనీసం సౌకర్యాలు కల్పించాలి

టి.మల్లేశ్వరి ద్వితియ సంవత్సరం ఇంటర్



వసతి గృహంలో కనీసం సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సమీప గెడ్డలకు ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నా అధికారులు స్పందించడం లేదు. సమీపంలోని ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి కుళాయి ద్వారా నీరు సౌకర్యం అందిస్తున్నారు. అక్కడి నుంచి నీరు సక్రమంగా వసతిగృహంలో చేరడం లేదు.

దోమల బెడత తప్పడం లేదు

బాలమ్మ, ద్వితీయ సంవత్సరం, డుంబ్రిగుడ



వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు, బురద పేరుకుపోవడంతో దోమల బెడద తప్పడం లేదు. దీనికి తోడు వసతిగృహాంలో కిటికీలు లేకపోవడంతో దోమలు అధికంగా ఇబ్బంది పెడుతున్నాయి. దోమతెరలు అందించి కిటికీలు బాగు చేయాలి. వర్షం కురిస్తే వర్షపునీరు లోపల వస్తోంది. దీంతో రాత్రిపూట పడుకోవడం చాలా ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించి మాగోడు విని మాకు సౌకర్యాలు కల్పించాలి.

పశువుల మృతిపై నష్టపరిహారం ఇవ్వాలి


వ్యాధితో వున్న పశువులను చూస్తున్న రాజారావు

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి, కిముడుపల్లి పంచాయతీల్లో వారం రోజుల వ్యవధిలో వ్యాధులతో 300 పశువులు మృతిచెందాయని, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి.రాజారావు అన్నారు. పెదకోడాపల్లి పంచాయతీ మెట్టవీధి గ్రామంలో రాముర్తిదొరకు చెందిన 14 మేకలు ఒక్కరోజులో మృత్యువాత పడగా చిమలమామిడి, అడ్రితర గ్రామాల్లోను, కిముడుపల్లి పంచాయతీ మిచ్చుపల్లి, ఎర్రగుప్ప, చవడిమామిడి, పులగొంది, గ్రామాల్లో వివిధ వ్యాధులతో వారం రోజుల్లో సుమారు 300 పశువులు, మేకలు మృతి చెందడంతో బాధితులు నష్టపోయారని, వారికి తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లో పశువైద్యశిబిరం ఏర్పాటు చేయాలని అధికారులు చూడాలని కోరారు.

నకిలీ కుల ధ్రువపత్రాలపై చర్యలు

తహసీల్దార్ అంబేద్కర్

సీలేరు: సీలేరు ప్రాంతంలో నకిలీ కుల ధ్రువపత్రాలు ఎక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటామని గూడెంకొత్తవీధి తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు.

సీలేరు ప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు అధికంగా ఉన్నారన్నారు. వీరు దొంగ సర్టిఫికెట్లను సృష్టించి కింది స్థాయి సిబ్బందిని మభ్యపెట్టి నకిలీ కుల ధ్రువపత్రాలను పొందినట్టు తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. తాను ఇటీవలే ఇక్కడ బాధ్యతలను చేపట్టడంతో పూర్తిగా అవగాహన లేదని, దీనిపై పరిశీలన చేస్తానని చెప్పారు.

అలాగే సీలేరు పరిసర ప్రాంతాల నుంచి కుల ధ్రువపత్రాలకు చేసుకున్న దరఖాస్తులపై విచారణ చేయించి, అన్నీ సక్రమంగా ఉంటేనే జారీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

గ్రామాలకు సదుపాయాలు కల్పించాలి

డీసీసీ అధ్యక్షుడు బాలరాజు

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాలకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు డిమాండ్ చేశారు. ఆర్‌వీ నగర్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతీ గ్రామానికి బడి, గుడి ,ండాలన్నారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా ఆజనేయస్వామి ఆలయం నిర్మాణానికి ముందుకురావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న వారికి మంచినీరు, విద్య, వైద్యం, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభం

చింతపల్లి: ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శనివారం పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం చింతపల్లిలో ఇండోర్ స్టేడియం కోసం రూ.80 లక్షలు మంజూరు చేసింది. దీని నిర్మాణ పనుల బాధ్యతలను గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. స్టేడియం నిర్మాణానికి రెవెన్యూ శాఖ ఎకరం స్థలం కేటాయించింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. నిర్మాణ పనులను సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించాడు.

గ్రంథాలయాలతో జ్ఞాన సమపార్జన

సీనియర్ లైబ్రేరియన్ త్రిమూర్తులు

చింతపల్లి: విజ్ఞాన అభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని సీనియర్ లైబ్రేరియన్ త్రిమూర్తులు అన్నారు. శనివారం గ్రంథాలయ దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరంత్రిమూర్తులు మాట్లాడుతూ, గ్రంతాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. ఈ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు రాజుబాబు, కన్నబాబు, లక్ష్మణరావు, సూర్యనారాయణరావు, జిల్లా కోఫోకాన్ ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు పాల్గొన్నారు.

ముసురుతో గిరిజనుల ఆనందం


అరకులోయలో వర్షం కురుస్తున్న దృశ్యం


అనంతగిరిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అరకురూరల్: అరకులోయలో శనివారం ఉదయం నుంచి వర్షం కురుస్తూనే వుంది. రోజంతా చిరుజల్లులతో ఏకధాటిగా కురుస్తూనే వుంది. దీంతో రోజువారీ కూలి పనులకు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది. పర్యాటకులు అరకు అందాలను వీక్షించడానికి ముసురు ఆటంకంగా మారింది. అయినప్పటికీ పర్యాటకులు ముసురుతోనే సందర్శిత ప్రాంతాలైన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ వంటివి తిలకించారు. ప్రతికూల వాతావరణం వుండడంతో వ్యాపారాలు అంతంతమాత్రంగా వున్నాయని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తంచేశారు.ప్రధానంగా కూరగాయల దుకాణదారులు, ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసే చిరు వ్యాపారులు ముసురుతో ఇబ్బందులు పాలయ్యారు.

స్తంభించిన జనజీవనం

అనంతగిరిరూరల్: మండలంలో ఖరీఫ్ రైతులకు వరుణుడు కరుణించాడు. రెండు రోజుల నుంచి మండలంలో వర్షం కురుస్తుండడంతో పొలం పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే వరి నారు కొన్ని చోట్ల ముదిరిపోవడంతో నాట్లు పనుల్లో రైతులు మునిగిపోయారు.శనివారం మండల కేంద్రంలో వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించి పోయింది. మండలంలోని కొండిబ, డముకు, వాలాసి, నిమ్మలపాడు తదితర గ్రామాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి.

రైతుల హర్షం

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ బాగోలేక పోవడంతో వరదనీరు రహదారిపై ప్రవహించింది. ఈ వర్షం కారణంగా గిరిజన గ్రామాల్లోని రైతులకు పుష్కలంగా నీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పొలాలన్నీ నీటితో కళకళలాడుతున్నాయి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తలారిసింగి ఆశ్రమంలో కలిసిన 1989-94 బ్యాచ్

పాడేరు: తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం శనివారం జరిగింది. 1989 నుంచి 1994 వరకు పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. అప్పట్లో ఇక్కడ చదివి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్న వారంతా కలిశారు. ఈ సందర్భంగా అందరూ పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. అలాగే తమ కుటుంబ వివరాలను, గత స్మృతులను నెమరు వేసుకున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రాజారావు, డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న అప్పలస్వామి, ఆశ్రమ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయు లుగా పని చేస్తున్న అప్పలనాయుడు, బాలరాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. తమ ఆత్మీయ కలయికకు గుర్తుగా ఒకరికొకరు జ్ఞాపికలను అందించుకున్నారు. నిర్వాహకులు కె.మత్స్య లింగం, ఒ.జ్ఞానప్రకాశ్, 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


పాఠశాలలో కలుసుకున్న 1989-94 బ్యాచ్ విద్యార్థులు

గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు

800 లీటర్ల పులుపు ధ్వంసం

40 లీటర్ల సారా, సామగ్రి స్వాధీనం

కొయ్యూరు: మండలంలో పలు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా దాడులు నిర్వహించింది. సురేంద్రపాలెం, చీడిపాలెం, రాజేంద్రపాలెం, కొత్తవీధి, దొడ్డవరం, రేవళ్లు గ్రామాల్లో ఎస్ఐ చక్రవర్తి బృందం ఈ దాడులు చేసింది. 800 లీటర్ల పులుపు ధ్వంసం చేయడంతో పాటు 40 లీటర్ల నాటుసారాను, సారా తయారీకి వినియోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, నాటుసారా నివారణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారని చెప్పారు. వారి ఆదేశాల మేరకుప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామన్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. గతంలో నిర్వహించిన నవోదయం కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఇటీవల తిరిగి పాత పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ నాటుసారా తయారీ, రవాణాను పూర్తి స్థాయిలో నివారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వైఎన్ఎస్.విజయ్ కుమార్, సిబ్బంది రాజశేఖర్, పూర్ణ చంద్రరావుతో పాటు అధిక సంఖ్యలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన సామగ్రిని జీపులో తరలిస్తున్న దృశ్యం

బొర్రాలో అక్రమ కట్టడాలు

అటవీశాఖ వసతిగృహం పక్కనే నిర్మాణం

పట్టించుకోని అధికారులు


అటవీశాఖ క్వార్టర్ పక్కనే నిర్మిస్తున్న గృహం

అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు సమీపంలో అటవీశాఖ వసతి గృహం పక్కనే ఓ ప్రైవేట్ కట్టడం నిర్మిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. అసలే పర్యాటక కేంద్రాల్లో ముఖ్యమైనది కావడంతో ఈప్రాంతంలో స్థలాలపై స్థానికులకు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు అక్రమ కట్టడాలకు సిద్ధ మవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహాపై కేసులు పెట్టాలి

గిరిజన సంఘం డిమాండ్

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో పింఛను సొమ్ము రూ.20.64 లక్షలు స్వాహా చేసిన వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులను, ఉపాధి హామీ పథకం నిధులు కోత విధించిన పోస్టల్ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.సన్నిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 2016-2017 సంవత్సరంలో సామజిక తనిఖీ బృందం తనిఖీ చేయగా వృద్ధులు, వితంతు పింఛన్లు, మృతిచెందిన వారి పేరిట తీసుకున్న సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. పోస్టల్ సిబ్బంది, వీఆర్‌వోలు, కార్యదర్శులు కాజేసిన సొమ్ము వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.శరభన్న, బి.గంగధరం తదితరులు ఉన్నారు.

కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

జి.మాడుగుల: ఏజెన్సీలో జీవనం సాగిస్తున్న కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్పించాలని సంఘం అధ్యక్షుడు జగ్గందొర జీన బంధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం కొండకుమ్మర్ల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండకుమ్మర్లు ఏజెన్సీలోని ఎస్టీలతో కలిసి ఉంటూ, వారిలాగే కట్టుబాట్లు, సంప్రదాయాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. అయినప్పటికీ తమకు ఎస్టీ జాబితాలో చేర్చకపోవడం అన్యాయమని వాపోయారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.









ఎరువుల ధరలు కొద్దిగా తగ్గాయ్

(మొదటి పేజీ తరువాయి)



వచ్చిన తరువాత చాలా రకాల వస్తువుల ధరలు పెరిగిన విషయం తెలిసిందే. ఎరువులు ధరలు కూడా పెరుగుతాయని వార్తలు వచ్చాయి. అయితే జీఎస్టీ అమలుకు ముందున్న ధరలతో పోల్చితే, జూలై ఒకటి తరువాత ఎరువుల ధరలు స్వల్పంగా తగ్గాయి. కానీ ఈ విషయం రైతులకు తెలియకపోవడంతో ఎరువుల వ్యాపారులు జూలై ఒకటికి ముందు ఉత్పత్తి అయిన ఎరువులను, ఇప్పుడు అవే ధరలకు అమ్ముతున్నారు. ఈ విషయం వ్యవసాయ, జీఎస్టీ అధికారుల దృష్టికి రావడంతో, ఎరువులను తగ్గిన ధరల ప్రకారం విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. పాత ధరలకు అమ్ముతున్నట్టు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. జీఎస్టీ అమలైతే ఎరువులపై ఐదు శాతం పన్ను వుంటుందని ప్రభుత్వం చెప్పడంతో ఎరువుల ధరలు పెరుగుతాయని రైతులు భావించారు. కానీ జీఎస్టీ అమలు తరువాత ధరలను పరిశీలిస్తే కొంచెం తగ్గాయి. ఎరువుల రకాలను, కంపెనీలనుబట్టి కనిష్ఠంగా రూ.3, గరిష్ఠంగా రూ.80 వరకు తగ్గుదల కనిపించింది. ఎక్కువగా వినియోగించే యూరియా, డీఏపీ, పొటాష్ ధరలు కొద్దిమేర తగ్గాయి. యూనియా 50 కిలోల బస్తా రూ.298 వుండేది. ప్రస్తుతం రూ.295లకు తగ్గింది. కోరమండల్ డీఏపీ బస్తా రూ.1092 నుంచి రూ.1081లకు, నాగార్జున డీఏపీ ధర రూ.1,118 నుంచి రూ.1,105లకు, క్రిబ్‌కో డీఏపీ రూ.1,086 నుంచి రూ.1,076లకు తగ్గాయి. జింక్ సల్ఫేట్ రూ.1,122 నుంచి రూ.1,107, మ్యూరేటాఫ్ పొటాష్(ఎంఓపీ) రూ.577 నుంచి రూ.575లకు తగ్గాయి. గ్రోమోర్ 28:28:28 కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.1,181 నుంచి రూ.1,122లకు తగ్గింది. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్(ఎస్ఎస్‌పీ) ధరలో ఎటువంటి మార్పు లేదు. ఎస్ ఎస్‌పీ పౌడర్ రూ.390, గుళికలు బస్తా రూ.420 ఉంది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత ధరల ప్రకారం ఎరువులు విక్రయించాలని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు. డీలర్ల వద్ద పాత ఎరువుల స్టాకు వుంటే, వాటిపై తగ్గిన ధరలను ముద్రించాలని చెప్పారు.

ధరలను గమనించి కొనుగోలు చేయాలి



ఎరువులను కొనుగోలు చేసేటప్పుడు రైతులు ధరలను గమనించాలి. దుకాణాల్లో ఎరువుల పట్టికల్లో ధరల వివరాలు ఉండేలా చూసుకోవాలి. కొనుగోలు చేసిన ఎరువులకు బిల్లును పొందాలి. కొత్త, పాత ధరలను సరిచూసుకోవాలి. అయితే ఎరువుల ధరలు కంపెనీలను బట్టి వేర్వేరుగా ఉంటాయి. అదే విధంగా డీలర్లు కచ్చితంగా కొత్త ధరలకే ఎరువులను విక్రయించాలి. పాత ధరలకు, అధిక ధరలకు ఎరువులను విక్రయించినట్టు ఫిర్యాదులు వస్తే దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తాం.

పి.విజేత, వ్యవసాయాధికారి, రోలుగుంట

నిధులు గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

విచారణ జరిపించాలని వారు కోరారు. 1999-2000 నుంచి ఇప్పటి వరకు సహకార సంఘంలో జరిగిన అక్రమాలను వినతిపత్రంలో వివరంగా పొందుపరిచారు. దీనిలోని సమాచారం ప్రకారం... 650 మంది సభ్యులున్న ఈ సొసైటీకి అధ్యక్షుడిగా వున్న 15 ఏళ్ల నుంచి సంఘాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. షేర్ క్యాపిటల్‌లో 42 లక్షల రూపాయల లోటు కనిపిస్తున్నదని, ఇందుకు సంబంధించి పద్దులు సరిగా లేవని పేర్కొన్నారు. 2015-16 ఫైనల్ ఆడిట్ నివేదికలో ఈ విషయాన్ని ప్రస్తావించారని చెప్పారు. కంటింజెన్సీ ఛార్జీల రూపంలో నాగేశ్వరరావు నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. 2005వ సంవత్సరంలో రూ.1,50,500, 2006లో రూ.1,96,000, 2007లో రూ.2,10,000, 2008లో రూ.2,82 ,000, 2009లో రూ.2,76,000, 2010లో రూ.3,13,000 2011లో రూ.6,13,000, 2012లో రూ.6,53, 000, 2013లో రూ.7,85,000, 2014లో రూ.7,35,000, 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.7,36,000... వెరశి మొత్తం 50,49,500 రూపాయలను కంటింజెన్సీ ఖర్చు లుగా చూపించారని నాగేశ్వర రావు చూపించారన్నారు. కంటింజెన్సీ ఛార్జీలను భారీగా చూపించి, లాభాలను తగ్గించేసి తద్వారా వ్యక్తిగతంగా లబ్ధిపొందారని ఆరోపించారు. ఇలా చేయడం వల్ల సభ్యులకు, సంఘానికి నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.తపాలా ఉద్యోగుల సహకార సంఘం పాలకవర్గ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలు సరిగా నిర్వహించడంలేదని వారు చెప్పారు. లక్షలాది రూపాయల ఎఫ్‌జీ బాండ్ల లావాదేవీల్లో దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. సభ్యులకు గత 15 ఏళ్లుగా డివిడెండ్లను చెల్లించడంలేదని, నిబంధనల ప్రకారం ఆదాయంలో ఆరు శాతాన్ని డివిడెండ్ రూపంలో పంపిణీ చేయాలని సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు డిమాండ్ చేస్తున్నప్పటికీ అధ్యక్షుడు పట్టించుకోవడం ఆరోపించారు. సొసైటీ నగదు లావాదేవీలను బ్యాంకు ఖాతా ద్వారా నిర్వహించాలని, కానీ నగదును అధ్యక్షుడు తనవద్దే ఉంచుకొని వ్యక్తిగతంగా ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. సభ్యులు కాని వారి నుంచి డిపాజిట్లను సేకరించారన్నారు.తప్పులు, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు సొసైటీని ఏపీ మేక్స్ 1995 చట్టం కిందికి తీసుకురావాలని అధ్యక్షుడు ప్రయత్నిస్తున్నారని, గత సర్వసభ్య సమావేశంలో దీనిని చాలా మంది వ్యతిరేకించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సభ్యులకు రుణాలు మంజూరు చేసేటప్పుడు ఒక్కొక్కరి నుంచి రెండు వేల రూపాయల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. తక్షణమే విచారణ జరిపి తపాలా ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 87 మంది సంతకాలు చేసిన ఫిర్యాదును కలెక్టర్‌కు అందజేశారు. అనకాపల్లి తపాలా ఉద్యోగుల సహకార సంఘం సభ్యులు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై సంఘ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావును వివరణ కోరగా, సహకార సంఘంలో అవకతవకలు జరగలేదన్నారు.



అధికారులు చేసిన తప్పిదం వల్ల ఒక ఉన్నతమైన ఆశయం మరుగునపడింది. పది మంది పొట్ట కొట్టింది. ఆర్థికంగా బలోపేతం కావాల్సిన వారి జీవితాలను అంధకారంలోకి నెట్టింది. కష్టానికి తగ్గ ప్రతిఫలం పొందాలనుకున్న వారి ఆశలు నిరాశ చేసింది. ఇదీ.. క్లుప్తంగా రావణపల్లి వద్ద ఏర్పాటు చేసిన జీడిమామిడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్ కథ. ఎంతో ఉన్నత ఆశయంతో అప్పటి ఐటీడీఏ పీఓ హరినారాయణన్ రూ. 40 లక్షలతో ఈ సెంటర్ ఏర్పాటు చేశారు. పది మందికి ఉపాధి కల్పించాలని భావించారు. అంతా అనుకున్నట్టే జరిపించారు. కానీ ఏమైందో తెలియదు అర్థాంతరంగా ఫ్యాక్టరీ మూత పడింది. దానిపై ఆధారపడిన వారికి జీవితాలు రోడ్డున పడ్డాయి. ఎందుకని స్థానికంగా ఉన్న యంత్రాంగాన్ని ప్రశ్నిస్తే.. తెలియదు అంటూ సమాధానం చెబుతున్నారు. మరి ఈ విషయం ఆ దేవుడికే తెలియాలి...!

- రావణాపల్లిలో జీడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్ మూసివేత
- కారణాలు తెలియవంటున్న అధికారులు
- అక్కరకు రాని రూ.40 లక్షల ప్రజా ధనం
- నిరుపయోగంగా యంత్రాలు
- పెట్టుబడి నిధి పక్కదారి పట్టినట్టు ఆరోపణలు
- లాభాల్లో నడుస్తున్న ప్రైవేటు ఫ్యాక్టరీలు


రావణాపల్లిలో నిర్మించిన జీడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్

ఆ రహస్యం దేవుడికే ఎరుక!

కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి గ్రామంలో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన జీడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్ నిరుపయోగంగా ఉంది. 2015 మే 2వ తేదీన తేదీన అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి రావెల కిషోర్‌బాబు చేతులమీదుగా దీన్ని ప్రారంభించారు. అధికారుల నిర్లక్ష్యమో...ప్రైవేటు యజమానులతో వారు మిలాఖత్ కావడమో తెలియదు గాని ప్రారంభించిన కొద్ది రోజులకే ఇది మూలకు చేరింది. పాడేరు ఐటీడీఏ పీఓగా పని చేసిన హరినారాయణన్ రావణాపల్లి పరిసర పంచాయతీల్లో సుమారు రెండు వేల ఎకరాలు జీడి మామిడి తోటలు ఉండడాన్ని గుర్తించి, ఇక్కడ జీడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్ ఏర్పాటుకు చొరవ చూశారు. ఈ మేరకు అప్పటి వెలుగు ఏపీడీ డి. రత్నాకర్, హార్టీకల్చర్ పీఓ చిట్టిబాబును రావణాపల్లి పంపించి దీని ఏర్పాటు ద్వారా పొందే లబ్ధి గురించి స్థానికులకు వివరించారు. అంతేకాదు నర్సీపట్నం పరిసరాల్లో అప్పటికే ఏర్పాటు చేసిన పలు జీడి పిక్కల ప్రోసెసింగ్ సెంటర్లను పీఓ స్వయంగా పరిశీలించి వాటి నిర్వాహణ వల్ల చేకూరుతున్న లాభాలను ఆయా యాజమాన్యాలతో చర్చించి, రావణాపల్లిలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా పాత రావణాపల్లి గ్రామాన్ని ఆనుకుని ఉన్న గ్రామ కంఠంలో రెండు ఎకరాల స్థలం కేటాయించి, ఫ్యాక్టరీ నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు.

రూ. 35 లక్షలు కేటాయింపు

ఫ్యాక్టరీ నిర్మాణానికి జాతీయ ఉద్యాన సమీకృత నిధులతో పాటు ఐటీడీఏకి చెందిన వడ్డీ నిధులు రూ.35 లక్షలు వెచ్చించారు.ఇందులో రూ.15.45 లక్షలతో ఫ్యాక్టరీ నిర్వహణకు భవ నం, జీడి మామిడి పిక్కలు ఎండ బోసేందుకు కల్లం తదితర సదుపాయాలు కల్పించారు. అలాగే ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైయ్యే స్టీమ్ బాయిలర్, సెపరేటర్ ఫీలర్, గ్రేడర్‌తో పాటు చేతి పనికి వీలుగా ఎనిమిది టేబుల్స్, కట్టర్లను హైదరాబాద్‌కు చెందిన బెస్టు ఇంజనీరింగ్ టెక్నాలజీ నుంచి రప్పించారు. 200 టన్నుల ప్రోసెసింగ్ జరిపేలా సుమారు టన్ను కెపాసిటీ కలిగిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రూపొందించిన మిషన రీ కూడా ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీకి విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రెండు లక్షలు వెచ్చించారు. స్థానికంగా ఉన్న గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ నిర్వహణకు నిర్ణయించి ముందుగా జీడిమామిడి పిక్కలు కొనుగోలుకు పెట్టుబడికి స్థానిక వెలుగు కార్యాలయం ద్వారా రూ. 3 లక్షలు కార్పరస్ ఫండ్‌ను గ్రామైఖ్య సంఘానికి సమకూర్చారు. అలాగే జీడిపిక్కల ప్రోసెసింగ్ సెంటర్ నిర్వహణపై తర్ఫీదు పొందేందుకు వీలుగా వెలుగు ఆధ్వర్యంలో మహిళలను శ్రీకాకుళంతో పాటు జిల్లాలోని పలు ఫ్యాక్టరీలకు తీసుకువెళ్లారు. మార్కెటింగ్ సదుపాయం కోసం ఒడిశాకు చెందిన ఓలం కంపెనీతో ఒప్పందం కూడా జరిపారు.


జీడి పిక్కలు కట్ చేసేందుకు ఏర్పాటు చేసిన యంత్రాలు

ఉపయోగం ఇదీ..

ప్రారంభంలో 20 కిలోల జీడి మామిడి పిక్కలను బాయిల్ చేశారు. వాటిని ఆరపెట్టిన తరువాత కటింగ్, శీతల గదిలో నిల్వ పొరలు తొలగింపు చేయగా నాలుగున్నర కిలోల జీడి పప్పు లభించింది.దీంతో గుగ్రం పప్పును కిలో రూ.700 నుంచి 800, రెండో రకం రూ.400 నుంచి 600 లకు, మూడో రకం రూ. 300 లోపు అమ్మకాలు జరపాలని నిర్ణయించారు. అలాగే ఫ్యాక్టరీలో పని చేసే డ్వాక్రా సంఘాల సభ్యులకు కనీస వేతన చట్టం ద్వారా రోజు కూలీ ఇచ్చేందుకు నిర్ణయించారు.

డ్వాక్రా మహిళలకు శిక్షణ

రావణాపల్లి గ్రామైఖ్య సంఘం పరిధిలో 20 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో 365 మంది సభ్యులు ఉన్నారు. వారిలో ప్రస్తుతం 20 మందికి ఈ ప్రోసెసింగ్ సెంటరు ద్వారా ఆర్థిక వృద్ధి చేకూరడంతో మరికొంత మంది సభ్యులను ఈ కేంద్రం నిర్వహణతో దినసరి వేతనంతో ఉపాధి పొందేందుకు శిక్షణ ఇప్పించారు. జీడిపిక్కలు లభ్యమయ్యే సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా పని జరిగేలా జీడి పిక్కలు కొనుగోలుకు కార్పరస్ ఫండ్ గా రూ. 3 లక్షలు మంజూరు చేశారు. అయితే ఇప్పటివరు ఆ నిధులతో జీడి పిక్కలు కొన్న దాఖలాలు లేవు. కనీసం ప్రోసెసింగ్ సెంటర్ తెరిచిన పరిస్థితి కూడా లేదు. లక్షలు వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీని ఎందుకు మూలకు చేర్చారో ఎవరికీ అంతుపట్టడం లేదు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు తరువాత సమీప కృష్ణాదేవిపేటలో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసి లాభాలు పొందుతున్నారు. తాజాగా మండలంలోని పిట్టచలంలో మరో వ్యక్తి ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నారు. కానీ దీన్ని అర్థాంతరంగా ఎందుకు వదిలేశారో ఎవరికీ అంతుపట్టడం లేదు.

మహిళల ఆర్థికాభ్యిద్ధికి దోహదం



పంచాయతీలో మహిళలకు ఉపాధి కల్పించడానికి దీన్ని ఏర్పాటు చేశారు. దీన్ని వల్ల స్థానికంగా ఉపాధితో పాటు పంచాయతీ అభివృద్ధి చెందుతుందని ఊహించాం. కానీ పాలకులు, అధికారులు మా ఆశలు నీరుగార్చారు.

- సర్పంచ్, ఎస్. కాంతం, రావణాపల్లి

నిరాశ పరిచారు



జీడిపిక్కల ప్రోసెసింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల జీడిమామిడి రైతుకు దళారీల బాధ తప్పి గిట్టుబాటు ధర కలుగుతుందని సంతోషించాం. కానీ ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యాలతో అధి కారులు కుమ్మకై లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ మూత పడేలా చేశారు.

పొడుగు చంద్రరావు,
జీడి మామిడి రైతు,తోటలూరు

త్వరలోనే పునఃప్రారంభం

ప్రోసెసింగ్ సెంటర్ నిర్వహణకు వీలుగా ఇచ్చిన పెట్టుబడి నిధులపై విచారణ జరిపి దుర్వినియోగమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాను. ఇప్పటివరకు దీని నిర్వహణ నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకుని త్వరలో పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటాను.

జె. ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం

(మొదటి పేజీ తరువాయి)

మొక్కుబడిగా...

ప్రస్తావించడం వ్యర్థమని భావించారు. అధికారుల తీరుపై ఛైర్‌పర్సన్ అసంహనం వ్యక్తం చేశారు. అంశాల వారీగా ఏడు సమావేశాలను నిర్వహించాల్సి వుండగా, ఆరో స్థాయి సంఘం మినహా మిగిలిన వాటిని నిర్వహించారు.

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అమలు తీరుపై స్థాయీ సంఘ సమావేశాల్లో అంశాల వారీగా సభ్యులు హాజరై చర్చించారు. ఏడు సంఘాల సమావేశాలు మొక్కుబడిగా కానిచ్చేశారు. వాస్తవానికి పలువురు జడ్పీటీసీ సభ్యులు సమావేశానికి హాజరై అనేక సమస్యలను అధికారుల ముందుంచాలని భావించారు. కానీ పలు శాఖలకు చెందిన ముఖ్య అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంతో నిరాశకు గురయ్యారు. ఆయా శాఖలకు చెందిన దిగువస్థాయి సిబ్బందిని పంపడంతో సభ్యులు ప్రశ్నలు అడగడం వ్యర్థమని భావించారు. ముఖ్యంగా కేజీహెచ్, ఆరోగ్యశ్రీ, 108 విభాగాలకు చెందిన ముఖ్య అధికారులు సమావేశానికి రాలేదు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అన్ని మండలాల్లో శతశాతం అందుతున్నా, భీమిలి మండలంలో ఎందుకు అందడం లేదో కారణాలు చెప్పాలని భీమిలి జడ్పీటీసీ సభ్యుడు అప్పారావు, వెలుగు ఏపీడీని ప్రశ్నించారు. ప్రతినెలా 25వ తేదీలోగా అందిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపుతున్నామని, ఈ నెలలో వారికి పింఛన్ మంజూరవుతుందని సమాధానమిచ్చారు. దివీస్ ల్యాబ్స్‌లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. వైద్య, ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో 108 వాహనాలకు చెందిన సిబ్బంది, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సిబ్బంది హాజరు కాకపోవడాన్ని మునగపాక జడ్పీటీసీ సభ్యుడు దాడి లక్ష్మినారాయణ ప్రస్తావించారు. ఈఎన్‌టీ ఆస్పత్రిలో ప్రతి చోటా డబ్బు అడుగుతున్నారని, దీనిపై దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఛైర్‌పర్సన్ లాలం భవానీ... జడ్పీ స్థాయీ సంఘ సమావేశానికి ముఖ్య అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశాలకు కూడా అధికారులు హాజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశానికి హాజరుకాని ఆయా శాఖల అధికారుల నుంచి వివరణ కోరాలని సీఈవోను ఆదేశించారు. ఇలాయితే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారమవుతాయన్నారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా తగదంటూ హెచ్చరించారు. తక్షణమే వారి నుంచి వివరణ తీసుకోవాలని సూచించారు.

దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి మాటాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలకు వేధింపులు ఎక్కువ అవుతున్నాయని, కేంద్రాలకు చిన్న గుడ్లు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశానికి జడ్పీ సీఈవో జయప్రకాష్ నారాయణన్, డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి, డీఈవో జి.నాగమణి, ఐసీడీఎస్ పీడీ చిన్మయి దేవి, వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్, పాడేరు జడ్పీటీసీ సభ్యురాలు పి.నూకరత్నం, చింతపల్లి జడ్పీటీసీ ఎం.పద్మ కుమారి, ఆయా కమిటీలకు చెందిన శాఖల అధికారులు హాజరయ్యారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ ఛైర్‌పర్సన్ భవానీ, సీఈఓ జయప్రకాష్ నారాయణన్, ఇతర అధికారులు

దానంతో పునర్జన్మ



'కళ్లు లేవని నీవు కలత పడవద్దు...నా కళ్లు నీవిగా చేసుకుని చూడు'...అన్నాడో సినీకవి. అవయవ దానం చేసిన వ్యక్తి చేసే ఉపకారం ఇదే. ఓ వ్యక్తి కళ్లు ఇద్దరికి చూపు నివ్వగలవు. ఇద్దరు కిడ్నీ రోగుల ప్రాణాలను నిలపగలవు. ఓ వ్యక్తి లబ్‌డబ్‌ను పునరుజ్జీవనం చేయగలదు. ఇంతటి ఉపయుక్తమైన అవయవాలు వృథాగా మట్టిలో కలిసిపోతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అవయవ దానంపై అవగాహన లేక ఎదురవుతున్న సమస్య ఇది.

- ప్రాణాలు కాపాడే అవయవ దాతలు
- ఒకరి ద్వారా 18 మందికి ప్రాణదానం
- డోనర్స్ కోసం లక్షలాది మంది ఎదురు చూపు
- జిల్లాలోనే మూడు వేల మంది రోగులు
- చైతన్యం కరువై మట్టిలో కలిసిపోతున్న అవయవాలు
- సకాలంలో సేకరిస్తేనే అవయవాలూ ఉపయుక్తం
- బ్రెయిన్ డెడ్ కేసుల్లో అన్ని అవయవాలతో ప్రయోజనం
- ప్రజా చైతన్యంతోనే సమస్యకు పరిష్కారం

నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

'పుట్టిన వానికి మరణం తప్పదు...మరణించిన వానికి జననం తప్పదు...అనివార్యమగు దీనిపై శోఖింప తగదు'...భగవద్గీతలోనిది ఈ జీవిత సత్యం. జీవితం క్షణభంగురం. మృత్యువు ఎప్పుడు ఏ రూపంలో కబళిస్తుందో చెప్పలేం. చనిపోయినా పది మంది జీవితాల్లో వెలుగునిచ్చే అవకాశం ఉన్న మహోన్నత కార్యక్రమం 'అవయవ దానం'. చనిపోయినా మన కళ్లతో లోకాన్ని చూడొచ్చు. శ్వాసకోశాలతో ఊపిరి పీల్చవచ్చు. కిడ్నీలు, లివర్, గుండె...ఇలా మన శరీరంలోని ప్రతి అవయవం విలువైనదే. ప్రాణాన్ని నిలిపేవే. ఈ విషయంపై అవగాహన లేకే చాలామంది అవయవాలు చనిపోగానే మట్టిలో కలిసిపోతున్నాయి. మరోవైపు కొన్ని లక్షల మంది అవయవ దాతల కోసం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కావాల్సింది ప్రజల్లో 'చైతన్యం' అంటున్నారు నిపుణులు. నేడు అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

చీకటిలో వెలుగు దివ్వె

మరణం అనివార్యం. అంతమాత్రాన చూస్తూ చూస్తూ ఏ మనిషి చనిపోయేందుకు అంగీకరించ లేం. ఆ ప్రాణం విలువ వారి కోసం ఎదురు చూస్తున్న వారికే తెలుస్తుంది కొన్ని ప్రాణాలు కాపాడగలిగితే ఎన్నో కుటుంబాల్లో వెలుగు నింపేవాళ్లం కావచ్చు. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదం చనిపోతున్నారు. వీరిలో కొందరైనా అవయవ దానానికి అంగీకరిస్తే ఏటా కొన్ని లక్షల ప్రాణాలు కాపాడవచ్చంటున్నారు వైద్య నిపుణులు. రోగం, ప్రమాదం వల్ల కొందరి శరీరంలోని కొన్ని అవయవాలు దెబ్బతింటాయి. ఇటువంటి వారికి మృతుల శరీరంలో జీవం ఉన్న అంగాలను అమర్చితే వారిని బతికించుకోవచ్చు. విశాఖ జిల్లాలోనే మూడు వేల మంది వివిధ రకాల అవయవాల కోసం ఎదురు చూస్తున్నారు. వీరంతా 'జీవన్‌దాన్'లో తమ పేర్లు నమోదు చేసుకుని దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

దేశ్యాప్తంగా ఒకే పరిస్థితి

అవయవాల కోసం ఎదురు చూసే వారి సంఖ్య దేశవ్యాప్తంగా ఒకేలా ఉంది. దేశంలో దాదాపు ఐదు లక్షల మంది కిడ్నీ సంబంధిత సమస్యల తోను, 80 వేల మంది లివర్, 50 వేల మంది గుండె, లక్ష మంది కార్నియా సంబంధిత సమస్యలతో బాధపడు తున్నారు. మన రాష్ట్రంలో అన్ని జిల్లా ల్లోనూ వేల సంఖ్యలో రోగులు న్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా మన దేశంలో 0.5 శాతం మంది మాత్రమే అవయవ దానానికి ముందుకు వస్తున్నారు. కేవలం రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వస్తే లక్షలాది మంది ప్రాణాలు కాపాడవచ్చు.



అవయవ దానం చేయాలంటే...

అవయవ దానం చేయాల నుకునే వ్యక్తులు తమ సమ్మతిని తెలియజేస్తూ మెడికల కళాశాలకు విల్లు రాయాల్సి ఉంటుంది. దీనిని ఇద్దరు వారసులు, మరో ఇద్దరు సాక్షులతో సబ్ రిజిస్ట్రార్ ఎదుట సంతకం చేయించాలి. దాన్ని తరువాత రిజిస్టర్ చేయించి మెడికల్ కళాశాలకు అందించాలి. అనంతరం వైద్యకళాశాల సదరు వ్యక్తిని దాతగా గుర్తించి ఓ గుర్తింపు కార్డును జారీ చేస్తుంది. జీవన్‌దాన్ వెబ్‌సైట్ లోగానీ, ఏదైనా ఎన్‌జీవో సంస్థ ద్వారాగానీ అవయవదాతగా నమోదు చేసుకునే అవకాశముంది. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు, పేర్లు నమోదు, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు అందజేత వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అవయవదానం ఎవరైనా చేయవచ్చు.



ఆస్పత్రులకు అనుమతి

అవయవాల మార్పిడి చేయాలంటే ఆసుపత్రుల వైద్యులు తమ పేర్లను జీవన్‌దాన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది ఆసుపత్రులకు జీవన్‌దాన్ నుంచి అనుమతులున్నాయి. ఉత్తరాంధ్ర వైద్యదాయని కేజీహెచ్‌తోపాటు ప్రైవేటు ఆసుపత్రులు అపోలో, మణిపాల్, సెవెన్‌హిల్స్, ఎన్ఆర్ఐ, పినాకిల్, శ్రద్ధ, ఓమ్ని, ఆర్కే ఆసుపత్రులకు జీవన్‌దాన్ అనుమతులు మంజూరు చేసింది. వీటిలో కొన్ని ఆసుపత్రులకు కిడ్నీ, హార్ట్, లివర్ మార్పిడికి అనుమతి ఉండగా, మరికొన్ని ఆసుపత్రులకు ఇతర అవయవాల మార్పిడికి అనుమతులున్నాయి. హార్వెస్ట్ చేసే అనుమతి (అవయవాలు సేకరించే) మాత్రం అన్ని ఆసుపత్రులకు ఉంది.

ఒకరు... 18 మంది ప్రాణాలు కాపాడవచ్చు

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను సేకరించి 18 మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి గుండెతోపాటు రెండు జతల కవాటాలు, రెండు కిడ్నీలు, రెండు కళ్లు, కాలేయం, ఊపిరితిత్తులు, క్లోమం, ప్రాంకియాసిస్, కర్ణభేరి, గాల్‌బ్లేడర్, యూరినరీ బ్లేడర్, చర్మం, ఎముకలు, కండరాలు, ఎముకల్లోని మజ్జ వంటివి సేకరించవచ్చు. బతికున్న వ్యక్తుల శరీరం నుంచి కొన్ని అవయవాలు సేకరించవచ్చు. ముఖ్యంగా, రక్తం, ఒక కిడ్నీ, కాలేయం (మూడోవంతు భాగం) దానం చేయొచ్చు. కిడ్నీ, కాలేయ దానంపై ప్రభుత్వం కొన్ని ఆంక్షలను విధించింది. దీని ప్రకారం రక్త సంబంధీకుల నుంచి తప్ప ఇతరుల నుంచి వీటిని సేకరించకూడదు.

గంటల వ్యవధిలో...

అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు పక్కదోవ పట్టకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం 1994లో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం అవయవాల అమ్మకం నిషేధం. బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించిన వ్యక్తి నుంచి అతని కుటుంబ సభ్యుల అనుమతితో మాత్రమే అవయవాలు సేకరించాలి. సేకరించిన అవయవాలను నిర్దేశిత సమయంలో అమర్చాలి. కాలేయాన్ని 12 నుంచి 15 గంటలు, గుండె 4 నుంచి 6 గంటలు, ఊపిరితిత్తులు 4 నుంచి 8 గంటలు, కిడ్నీలు 24 నుంచి 48 గంటల్లోగా అమర్చాలి.

అపోహలతోనే దూరం

అవయవదానం పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, కొన్ని రకాల అపోహలు ఉండడం వల్ల చాలామంది వీటికి దూరంగా ఉంటున్నారు. పదేళ్ల క్రితం వరకు అవయవ దానం చేయాలన్న విషయం చాలామందికి తెలియదు. మనిషి చనిపోతే అంతిమ సంస్కారం సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని, లేదంటే అతని ఆత్మ మనచుట్టూనే తిరుగుతుందని నమ్మేవారు. ఈ కారణంగానే అవయవ దానాన్ని పాపంగా భావించే వారూ ఉన్నారు.

బ్రెయిన్ డెడ్‌ను ఎలా గుర్తించాలి

ప్రమాదం, నివారణ సాధ్యంకాని వ్యాధుల వల్ల కొందరు కోమాలోకి వెళ్లిపోతారు. మళ్లీ తిరిగి స్పృహలోకి రాని పరిస్థితులు ఉంటే వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారిస్తారు. ఇటువంటి పరిస్థితుల్లో వీరి మెదడు నుంచి ఇతర అంగాలకు సంకేతాలు అందవు. వైద్యులు దీన్ని గుర్తించి వెంటిలేటర్ సహాయంతో ఎక్కువ ఒత్తిడితో శరీరంలోకి ఆక్సిజన్‌ను పంపిస్తారు. దీనివల్ల కణాలకు శక్తి అంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీర అవయవాలు కొన్ని గంటలపాటు పనిచేస్తాయి. ఈ సమయంలో అతని నుంచి సాధ్యమైనంత వేగంగా అవయవాలు సేకరించి అదే బ్లడ్ గ్రూప్, ఇతర అంశాలు సరిపోలిన వ్యక్తికి అమర్చగలిగితే స్వీకరణ వ్యక్తి బతికేందుకు అవకాశం ఉంటుంది.

ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చాలి



అవయదానం పట్ల ప్రజల్లో అవగాహన లేదు. వందలాది మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. కొద్దిమంది ముందుకు వచ్చినా వేల మందికి ప్రాణదానం చేయొచ్చు. ప్రభుత్వాలు కూడా ఈ దిశగా ప్రోత్సహించాలి. తెలంగాణ మాదిరిగా మన రాష్ట్రంలో అవయవ దానాన్ని ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలి. దీనివల్ల నిరుపేదలకు మేలు జరుగుతుంది. జిల్లాలో దాతల కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. సావిత్రిబాయి పూలే ట్రస్ట్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టి కొంతమేర సఫల మవుతున్నాం.

- గూడూరు సీతామహాలక్ష్మి, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్

ప్రజల్లో మార్పు వస్తేనే...



ప్రజల్లో మార్పు వస్తేనే అవయవదాన కార్యక్రమం విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కుటుంబ సభ్యుల్లో అవయవ దానం పట్ల సదభిప్రాయం లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది కలుగుతోంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి గతంలో అవయవ దానానికి అంగీకార పత్రాన్ని ఇచ్చినా చనిపోయిన తరువాత కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదు. ఇదే ప్రధాన సమస్య. దీనివల్ల ప్రాణాలు కాపాడే అవయవాలు వృథాగా పోతున్నాయి. జిల్లాలో మూడు వేల మంది రోగులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమందైనా కార్యక్రమంలో పాల్గొనేందుకు ముందుకు వస్తే ఎన్నో జీవితాల్లో వెలుగు నింపవచ్చు.

- సిహెచ్.ఇందిర, జిల్లా ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్

ప్రతిభావంతుల ఎంపైర్

కళ్లు మూసి తెరిచేలోగా బాల్ బ్యాట్స్‌మన్ వైపు దూసుకు వెళ్తుంది... క్షణాల్లో పదకొండు గొంతులు 'హౌజాట్' అంటూ శబ్దం చేస్తాయి. వెంటనే అంపైర్ 'అవుట్ ఆర్ నాట్ అవుట్' అన్న విషయం వెల్లడించాలి. క్రికెట్‌లో అంపైర్‌కి బాల్‌బాల్‌కి ఎదురయ్యే అనుభవం ఇది. కేవలం ఐదు నుంచి పది సెకన్ల వ్యవధిలో కీలక నిర్ణయం తీసుకునే శక్తి సామర్థ్యాలు ఉన్న వారే అంపైరింంగ్‌లో రాణించగలరు. తన 'ఎంపైర్'ను సృష్టించుకోగలరు. అంతర్జాతీయ క్రికెట్ అంపైర్‌గా తనదైన స్థానం పదిలం చేసుకున్న తొట్టతొలి విశాఖ వాసి కుంచా పార్థసారథి. 12 వన్డేలు, రెండు టెస్ట్ మ్యాచ్‌లకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ఆయన ఇదో గురుతరమైన బాధ్యత అంటారు. 'అంపైరింగ్ అంటే కత్తిమీద సాములాంటిది. ఇప్పటిలాంటి సాంకేతిక పరిజ్ఞానం అప్పట్లో లేదు. కళ్లు, చెవులునే నమ్ముకుని అంపైరింగ్ చేసేవాడిని' అంటున్న పార్థసారథి జీవితంలోని కొన్ని సంఘటనల సమాహారమే ఈ వారం 'జర్నీ'.



- ఛాలెంజింగ్ కెరీర్ క్రికెట్ అంపైరింగ్
- రోజంతా విధుల నిర్వహణ కత్తిమీద సాము

- ప్రతిభావంతులే ఈ సామ్రాజ్యాన్ని ఏలగలరు
- ప్రతి బంతిపై నిర్ణయం కీలకమే
- నిర్ణయం తప్పయితే నవ్వులపాలే
- అటువంటి విధుల్లో సమర్థవంతుడనిపించుకున్న విశాఖ వాసి
- **కుంచా పార్థసారథి ఘనత ఇది**
- అంపైర్ కళ్లు, చెవులనే నమ్ముకోవాలి
- మా రోజుల్లో ఇప్పటి సదుపాయాలు లేవు
- సమర్థత చాటుకున్నందుకు ఇప్పటికీ గర్వపడుతుంటా

ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం

బాల్యం నుంచి క్రీడాసక్తి ఉన్న ఆ యువకుడికి ఉదయం లేచింది మొదలు ఆటలపైనే ధ్యాస. తొలిరోజుల్లో ఫుట్‌బాల్‌పై ఉన్న మోజు సోదరులను చూశాక మనసు క్రికెట్ వైపు మళ్లింది. పాఠశాల నుంచి రాగానే ఇంట్లో పుస్తకాలు పడేసి మూడు కర్రలు, బ్యాట్, బాల్‌తో మైదానానికి వెళ్లడమే పని. చీకటి పడేవరకు ఆట, ఆ తర్వాతే ఇల్లు...ఇదే జీవితం. అంతగా క్రికెట్‌పై మక్కువ పెంచుకున్న ఆ బాలుడు ఓ సందర్భంలో భిన్నంగా ఆలోచించాడు. అండర్-25లో ఆడిన తర్వాత అంపైర్‌గా వెళితే ఎలా ఉంటుందని ఆలోచించాడు. అప్పటికే ఇంట్లో అన్న అండర్-25 క్రీడాకారుడు, తమ్ముడు, సమీప బంధువు ఒకరు రంజీ ప్లేయర్లు. ఈ పరిస్థితుల్లో అంపైర్‌గా రాణించడమే మంచిదని మెలకువలపై దృష్టి సారించాడు. స్వయంకృషితో అంతర్జాతీయ స్థాయిలో అంపైర్‌గా తన 'ఎంపైర్' సృష్టించుకున్నారు. 27 ఏళ్లుగా విశాఖ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా సేవలందిస్తున్న కుంచా పార్థసారథి ఘనత ఇది. అంపైరింగ్ అనగానే...అబ్బో అదో సవాల్ అనే ఆయన తనను పలకరించిన 'ఆంధ్రజ్యోతి' వద్ద అంతరంగాన్ని ఆవిష్కరించారు.



విశాఖ వాసినే

పూర్వీకుల నుంచి వైజాగ్ మా సొంతూరు. నీలమ్మవేపచెట్టు సమీపంలో మా ఇల్లు. నాన్న కె.ఎ.నరసింహమూర్తి బ్యాంకు అధికారి. అమ్మ విమల గృహిణి. నాకు ముగ్గురు సోదరులు, నలుగురు అక్కచెల్లెళ్లు. సెయింట్ ఆంథోనీ పాఠశాలలో హైస్కూల్ విద్య, ఏవీఎన్‌లో పీయూసీ, బీకాం స్పెషల్ కోర్సు పూర్తి చేశాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంకాం చదివాను.

స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం

చదువు పూర్తయ్యాక 1968లో స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. ఆటలపై నాకు ఉన్న మక్కువను గుర్తించి బ్యాంకు యాజమాన్యం ప్రోత్సహించింది. విశాఖ పరిసరాల్లోనే పనిచేసే అవకాశం కల్పించింది. 2001 వరకు బ్యాంకు అధికారిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశాను.

ఫుట్‌బాల్ ఆట అంటే మక్కువ

అప్పట్లో విశాఖ ఫుట్‌బాల్‌కు స్వర్ణ యుగం. నాన్న కూడా ఫుట్ బాల్ ఆడేవారు. వైజాగ్‌లో 20 నుంచి 30 క్లబ్‌లు ఉండేవి. 1960 దశకంలో ఎక్కడ పడితే అక్కడ ఖాళీ స్థలాలు ఉండడంతో విద్యార్థుల నుంచి యువత వరకు ఫుట్‌బాల్ ఆడేవారు. నాకు కూడా చాలా ఇష్టం. జిల్లా స్థాయిలో గ్రిగ్స్ పోటీల్లో ఫుట్‌బాల్, బేస్‌బాల్, వాలీబాల్ ఉండేవి. తీవ్ర పోటీ ఉండేది. పాఠశాలల్లో ప్రతిష్ఠాత్మకంగా పోరాడే వాళ్లం. క్రికెట్ ఉండేది కాదు. చదువు ఎంత ఇష్టమో, ఆటలంటే అంత ఇష్టం. ఇంటిలో ప్రోత్సాహం వల్ల జీవితం ఆటల్లో గడిచిపోయింది.

ఏయూ తరపున క్రికెట్ ఆడా

ఫుట్‌బాల్ ఆడుతుండగా కొందరు మిత్రులు ప్రోత్సాహంతో క్రికెట్‌పై మక్కువ ఏర్పడింది. ఖాళీ దొరికితే మూడు కర్రలు పాతేసి క్రికెట్ ఆడేవాళ్లం. 1959లో అన్నయ్య మురళీధర్, మరికొందరు కలిసి మెట్రోక్రికెట్ క్లబ్ ప్రారంభించారు. ఇప్పటికీ ఈ క్లబ్ కొనసాగుతోంది. 1961లో ఈ క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నా. ప్రస్తుతం దీనికి మా కజిన్ శ్యామ్ అధ్యక్షుడిగా, నేను కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాం. డిగ్రీకి చేరాక 1964 నుంచి అంతర్ వర్సిటీ పోటీల్లో ఐదేళ్లు ఏయూకు ప్రాతినిధ్యం వహించాను. అప్పటి ఏయూ క్రీడాధికారి సుదర్శనరావు హయాంలో క్రీడలకు గట్టి పునాది పడింది. విశాఖలో ప్రతి ఆటలో ఏయూ, ఆంధ్రా మెడికల్ కళాశాలల విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉండేది.

అంపైరింగ్ కత్తిమీద సాము

క్రికెట్‌లో అంపైరింగ్ కత్తిమీద సాములాంటిది. మ్యాచ్ ప్రారంభమయ్యాక తొలి బంతి నుంచి చివరి బంతి వరకు అప్రమత్తంగా ఉండాలి. అంపైర్ అనేవాడు కళ్లు, చెవులనే నమ్ముకోవాలి. నిస్పక్షపాతంగా, న్యాయపరంగా నిర్ణయాలు వెల్లడించాలి. 1999లో ముంబయిలో జరిగిన మ్యాచ్‌కి చేసిన అంపైరింగ్ ఎంతో సంతృప్తినిచ్చింది. రిఫరీ కూడా అభినందించారు. నేను అంపైర్‌గా పనిచేసిన అన్ని మ్యాచ్‌ల్లోనూ నిష్పక్షపాతంగా వ్యవహరించాను. ఇప్పుడు థర్డ్ అంపైర్ ఉన్నారు. మ్యాచ్ మొత్తం లైవ్‌లో చూపిస్తున్నారు. మైదానంలో ఏ జట్టు అభ్యంతరం చెప్పినా వెంటనే రీప్లే అవుతుంది. వాస్తవం వెల్లడవుతుంది. మా కాలంలో రీప్లే అన్నది లేదు. లైవ్‌లో కూడా ఇప్పుడున్నంత సాంకేతిక పరిజ్ఞానం లేదు. దీంతో అంపైర్ నిర్ణయమే కీలకం. అందువల్ల చాలా అప్రమత్తంగా వ్యవహరించేవాళ్లం. అప్పట్లో క్రీడాకారులు కూడా మైదానంలో హుందగా, మర్యాదగా వ్యవహరించే వారు. ఇప్పుడు మైదానంలోనే తిట్టుకుంటున్నారు. అస్ట్రేలియా ఆటగాళ్లు ప్రారంభించిన సంప్రదాయం ఇది. మా రోజుల్లో క్రీడాకారులు దేశ ప్రతిష్ఠ కోసం సర్వశక్తులూ ఒడ్డేవారు. ఇప్పుడంతటి చిత్తశుద్ధి కనిపించదు. క్రీడాకారులకు పుష్కలంగా డబ్బులు వస్తున్నాయి. అద్భుతమైన సదుపాయాలు సమకూర్చుతున్నారు. అప్పట్లో ఇవేవీ అంతగా లేవు.

కుటుంబంలో నలుగురు క్రికెటర్లు

మా ఇంట్లో అన్న మురళీధర్, నేను అండర్-25కు ఆంధ్రా తరపున ఆడాం. తమ్ముడు శంకరరావు, కజిన్ శ్యామ్‌లు రంజీకి ప్రాతినిధ్యం వహించారు.

కుటుంబం

భార్య మహాలక్ష్మి. ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ చేసి పదవీ విరమణ చేసింది. కూతుర్లు హరిత, సౌమ్యలు ఇద్దరూ అమెరికాలో ఉంటున్నారు.

పీఎంపాలెం స్టేడియం నిర్మాణంలో భాగస్వామ్యం



నగరంలోని ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణంలో భాగస్వామినయినందుకు గర్వపడుతుంటాను. విశాఖ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా 1989 నుంచి పనిచేస్తున్నాను. విశాఖలో 1963లో క్రికెట్ అసోసియేషన్ ప్రారంభించారు. తొలిరోజుల్లో అర్బన్ జిల్లా ఎస్పీ షెల్డన్ ఈ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించే వారు. చాలాకాలం ఐపీఎస్‌లు సంఘానికి నాయకత్వం వహించగా తరువాత కలెక్టర్లు అధ్యక్షులుగా ఉన్నారు. మధ్యలో ఒకసారి కలెక్టర్ కాకుండా డి.వి.సుబ్బారావు అధ్యక్షుడిగా పనిచేశారు. క్రికెట్ అసోసియేషన్‌లో ఉండగానే మున్సిపల్ స్టేడియంలో అనేక అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగాయి. పోతినమల్లయ్య పాలెం స్టేడియంకు 1998లో పునాది పడింది. స్టేడియం పూర్తికి నాలుగేళ్లు పట్టింది. బీసీసీఐకి సంబంధించి నంత వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి అంతర్జాతీయ స్టేడియం ఇదే. తరువాత ఉప్పల్ స్టేడియం వచ్చింది. పీఎంపాలెం స్టేడియం నిర్మాణం తరువాత 2003లో బోర్డు ప్రెసిడెంట్ ఎలెవన్, న్యూజిలాండ్ మధ్య తొలిమ్యాచ్ జరిగింది. ఈ స్టేడియంతో నాకు ఎంతో అనుబంధం ఉంది.

మిగతా ఆటలను మింగేసిన క్రికెట్

క్రికెట్ పాపులర్ అయ్యాక మిగిలిన క్రీడలను మింగేసింది. ఇప్పుడు క్రికెట్‌కు విపరీతమైన క్రేజ్. నగరంలో 70 వరకు క్రికెట్ క్లబ్‌లున్నాయి. ఇంకా డివిజన్లు, శిక్షణ సంస్థలున్నాయి. మ్యాచ్‌కి అనేక సదుపాయాలున్నాయి. వీడీసీఏ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో శిక్షణ ఇస్తున్నాం. వీరంతా పీఎంపాలెం బి-మైదానంలోను, వన్‌టౌన్ మున్సిపల్ స్టేడియం, ఉక్కు, జింక్, కోరమాండల్ మైదానాల్లో సాధన చేస్తుంటారు.

విశాఖలో పది కార్లే ఉండేవి

మాతోపాటే విశాఖ కూడా పెద్దదయింది. నీలమ్మ వేపచెట్టు దగ్గర నుంచి సెయింట్ ఆంథోని పాఠశాలకు వరకు నడిచి వెళ్లేవాళ్లం. ఏయూలో చదువుకున్నప్పుడు బస్ కోసం చూసి రాకపోతే నడిచి వెళ్లేవాళ్లం. అప్పట్లో విశాఖలో పది మంది వద్దే కార్లు ఉండేవి. నంబర్ బట్టి అది ఎవరి కారో చెప్పేసేవాళ్లం. ఎక్కడ చూసినా ఖాళీ స్థలాలే. ఆంధ్రవిశ్వవిద్యాలయం మైదానాలు పిల్లలతో కళకళలాడుతుండేవి. అటువంటి ఏయూలో ఇప్పుడు ఆటలాడే వారు చాలా తక్కువ మంది కనిపిస్తారు.

2 టెస్ట్‌లు...12 వన్‌డేలు

అండర్-25 ఆడిన తర్వాత అంపైరింగ్ వైపు వెళ్లాను. అవసరమైన మెలకువలు నాకునేనుగానే తెలుసుకున్నాను. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరపున రంజీ మ్యాచ్‌లు జరగడానికి ముందు ఐదు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. 1978లో కేరళ రాష్ట్రం పాల్గాట్‌లో జరిగిన రంజీ మ్యాచ్‌కు తొలిసారి అంపైరింగ్ బాధ్యతలు నిర్వహించాను. ఆ తర్వాత ఫస్ట్‌క్లాస్, అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశా. 12 వన్డేలకు అంపైరింగ్ చేశాను. రెండు అనధికార టెస్ట్‌లకు అంపైరింగ్‌గా పనిచేశాక 2004లో రిటైర్ అయ్యాను. తొలి టెస్ట్‌మ్యాచ్ 1994లో బెంగళూరులో ఇండియా-శ్రీలంక మధ్య, రెండోది 1997లో కోల్‌కతాలో ఇండియా-ఆస్ట్రేలియా మధ్య జరిగింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ విజయం సాధించింది. 1993లో పూనేలో ఇండియా-జింబాబ్వే మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌కి



ముంబయికి చెందిన సురేష్‌శాస్త్రితో కలిసి అంపైరింగ్ చేశాను. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మా ఇద్దరికీ తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఇది. అజరుద్దీన్ సారథ్యంలో ఎక్కువ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశాను. తర్వాత ద్రావిడ్, సచిన్, సౌరవ్ గంగూలీ కెప్టెన్సీలో ఆడే మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశాను. మనదేశం 1996లో ప్రపంచ కప్‌ను నిర్వహించినప్పుడు పాకిస్థాన్‌లో జరిగిన ఐదు మ్యాచ్‌లకు థర్డ్ అంపైర్‌గా వెళ్లాను. ప్రపంచ ప్రఖ్యాతి అంపైర్ స్టీవ్‌బక్నర్‌తో పనిచేసే అవకాశం ఈ సమయంలోనే దక్కింది. తటస్థ అంపైరింగ్ విధానం అమల్లోకి వచ్చిన తరువాత కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌కి పనిచేశా. ప్రస్తుతం విశాఖ నుంచి రవికాంత్‌రెడ్డి, ఎం.రవికుమార్‌లు బీసీసీఐ అంపైర్లు పనిచేస్తున్నారు. ఇంకా మరో ఇద్దరు స్కోరర్లు ఉన్నారు. కోచ్‌లు తయారయ్యారు. నగరానికి చెందిన వేణుగోపాల్ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ ఆడాడు. సీనియర్, ఇతర ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లకు మొత్తం 13 మందిని తయారు చేశాం.

పిచ్చికుక్క దాడి స్వైరవిహారం

ఐదుగురికి తీవ్ర గాయాలు

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట గ్రామంలో శనివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేయడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బుదిరెడ్ల రమేష్, శానాపతి రోహిణి, మగా చినబాబు, ఎస్. అప్పారావు, నాగేశ్వరరావును కుక్క కాళ్లు, చేతులపై గాయపరిచింది. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందారు.

రావికమతంలో చోరీ

రావికమతం : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు వినాయకుడి గుడి వద్ద ఉన్న డీటీఎస్ సౌండ్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇక్కడ చోరీ జరగడం ఇది మూడోసారి. గ్రామానికి చెందిన లావేటి తాతారావు మైక్ అండ్ లైటింగ్, స్టేజి ప్రోగ్రామ్‌లు చేస్తుంటారు. ఆయన వినాయకుని గుడిని ఆనుకొని ఉన్న కమ్యూనిటీ హాలులో తన మైక్‌సెట్, లైలింగ్ సామగ్రి భద్రపరుస్తుంటారు. శుక్రవారం ఎప్పుడు మాదిరిగానే ఉదయం సామగ్రిని కమ్యూనిటీ హాలులో భద్రపరచి తలుపులకు తాళం వేశాడు.శుక్రవారం రాత్రి దొంగలు తలుపు గొండెం కోసి లోపలికి ప్రవేశించారు. రెండు యాంప్లిఫ్లేయర్లు అపహరించుకుపోయారు. మైక్ సెట్ యజమాని శనివారం ఉదయం వచ్చి చూసుకునేసరికి తలుపులు తీసి ఉండడంతో దంగలు పడ్డారని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం



పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

చోడవరం : వివిధ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయిస్తామని పలువురు నుంచి వేలాది రూపాయలు వసూలు చేసిన రావాడ గోవింద్‌పై స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బాధితులు కెఎస్ ప్రకాష్, నందిపల్లి సన్నిబాబు, పండూరు రమణ, అగిరెడ్డి గంగరాజు, ఎస్.అప్పారావు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గోవింద్ పలువురికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెబుతూ వేలాది రూపాయలు వసూలు చేశారు. ఇలా బుచ్చెయ్యపేట, దేవరాపల్లి, చీడికాడ, చోడవరం మండలాలకు చెందిన వారి నుంచి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు తీసుకున్నారు. ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు అడిగితే తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో బాధితులు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పైడిపాలలో బాల్య వివాహం నిలిపివేత



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

మాకవరపాలెం : పైడిపాల గ్రామంలో జరగాల్సిన బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన జవ్వారి రమణ, జ్యోతి దంపతుల 14 ఏళ్ల కుమార్తెకి కోటవురట్లలో ఉన్న ఒక వ్యక్తితో వివాహం చేయడానికి నిర్ణయించారు.ఈ మేరకు శనివారం వివాహానికి బాలికను కోటవురట్ల తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు సిద్ధ పడ్డారు. ఈ విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో వారు గ్రామానికి పెళ్లి బాలిక తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, చేస్తే చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యవతి, ఎస్ఐ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌వో జగన్నాథం, సర్పంచ్ రుత్తల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆటో

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- ఐదుగురి పరిస్థితి విషమం
- కేజీహెచ్‌కి తరలింపు
- కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో



తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్, నాగభూషణం, మంగరాజు

ఎలమంచిలి : పట్టణ సమీపంలోని పెంజెరువు దుర్గామాత ఆలయం సమీపంలో శనివారం ఉదయం ఆటో, టిప్పర్ ఢీకొనడంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. ఎస్.రాయవరం మండలం సైతారుపేట, వేమగిరి గ్రామాలకు చెందిన ఎనిమిది మంది అచ్యుతాపురంలోని ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో కొందరు, ఇతర ప్రాంతాల్లో తాపీ పనికోసం మరికొందరు ఆటోలో బయలుదేరారు.ఆటో ఎస్.రాయవరం మండలం సైతారుపేట నుంచి ఎలమంచిలి వైపు వస్తుండగా ముందు వెళ్తున్న టిప్పర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న దిగుబోయిన నాగభూషణం, నరవ లక్ష్మణ్, కె. మంగరాజు, ముత్తా అర్జున, సత్తిబాబు, వి.పెదతాతబ్బాయి, నాగరాజు, రామారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఎలమంచిలి ఆస్పత్రికి క్షతగాత్రుల బంధువులు తరలివచ్చారు. దీంతో ఆస్పత్రి ఆవరణంతా వారి రోదనలతో నిండిపోయింది. సైతారుపేట గ్రామానికి చెందిన నాయకులు వీసం గోవింద్, రావి రమణబాబు దగ్గరుండి బాధితులకు వైద్య పరీక్షలు చేయించారు. బాధితుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. మిగిలిన ముగ్గురు ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీల నియంత్రణకు యాప్

అనకాపల్లి సీఐ విద్యాసాగర్

అనకాపల్లిటౌన్: జిల్లాలో నేర నియంత్రణకు పోలీస్ శాఖ వినూత్న చర్యలు చేపడుతోంది. ఇప్పటికే టెక్నాలజీతో పలు యాప్‌లు రూపొందించిన ఆశాఖ ఇప్పుడు చోరీల నియంత్రణకు కూడా ఓ యాప్ రూపొందించింది. ఎవరైనా ఇల్లు విడిచి వెళ్లాలనుకునే వారు ముందుగా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ద్వారా పోలీస్ మానటరింగ్ సెంటర్‌కు మెసెజ్ పంపాల్సి ఉంది. అందుకు ముందుగానే గృహ యజమానులు ఎల్‌హెచ్ఎంఎస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో వారి ఇంటి అడ్రస్, సెల్ నంబరుతో సహ పక్కాగా పొందుపర్చాలి. అలా పొందుపరచిన వివరాలు జిల్లా మానటరింగ్ సెంటర్‌లో చేర్చబడతాయి.ఎవరైనా దూర ప్రాంతాలకు ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ముందుగా ఆయజమాని పోలీస్ యాప్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంది. అలా ఇచ్చిన తరువాత జిల్లా మానటరింగ్ సెల్ నుంచి మెసెజ్ పంపిన ప్రాంత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందుతుంది. వెంటనే ఆ స్టేషన్ అధికారులు అక్కడ సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తారు. కాగా ఈ విషయమై శనివారం పట్టణ సీఐ సంపతిరావు విద్యాసాగర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా చోరీ జరిగిన చోట అగంతకుడి వివరాలు రికార్డు కావడంతో పాటు ఇంటి యజమానికి కూడా వెంటనే సమాచారం తెలుస్తుందన్నారు. విషయం జిల్లా మానటరింగ్ సెంటర్‌కు కూడా చేరుతుందన్నారు.వారినుంచి తమకు సమాచారం వచ్చిన వెంటనే నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి నేరస్తులను పట్టుకోవచ్చునని చెప్పారు. ఈ యాప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఇళ్లలో ఏర్పాటు చేయడానికి స్టేషన్‌కు వచ్చిన కెమెరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

భీమునిపట్నం : భీమిలి-విశాఖ బీచ్ రోడ్డులో తిమ్మాపురం వద్ద శనివారం రాత్రి స్కూటర్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో నగరంలోని బుల్లయ్య కళాశాల డిగ్రీ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలోని 104 ప్రాంతానికి చెందిన ఆదిత్య సింగ్ (21),సిద్ధాంత్ భట్ స్నేహితులు. వీరిలో ఆదిత్య సింగ్ బుల్లయ్య కళాశాలలో డిగ్రీ చదువుతుండగా, సిద్ధాంత్ భట్ సీతమ్మధార లోని ప్రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం రాత్రి స్కూటర్‌పై భీమిలి వైపు నుంచి నగరంలోకి వస్తుండగా, తిమ్మాపురం వైన్‌షాపు సమీపంలో వీరి వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆదిత్య సింగ్ అక్కడికక్కడే మృతి చెందగా, సిద్ధాంత్ భట్ తీవ్ర గాయాల పాలయ్యాడు.క్షతగాత్రుడు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అటవీ సంపదను కాపాడుతాం

- చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- కలప తరలిపోకుండా ప్రత్యేక చర్యలు
- పీసీసీఎఫ్ కె. సారంగి
- కొయ్యూరులోని టేకు ప్లాంటేషన్ పరిశీలన



నల్లగొండ గ్రామస్థులతో మాట్లాడుతున్న సారంగి

కొయ్యూరు : మన్యంలోని అటవీ సంపదను కాపాడడంతో పాటు డిపోల్లో కలప వెదురు లోడ్ల పరిరక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రిన్సిపల్ చీఫ్ కన్స ర్వర్ ఆఫ్ ఫారెస్టర్ కె.సారంగి తెలిపారు. శనివారం ఆయన సీసీఎఫ్ రాహుల్‌పాండే, నర్సీపట్నం డీఎఫ్ఓ గెడ్డం శేఖర్ బాబుతో కలిసి నల్లగొండ టేకు ప్లాంటేషన్, గుజ్జుమానుపా కలులోని అటవీ శాఖ నర్సరీని పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన నల్లగొండ వీఎస్ఎస్ సభ్యులతో సమావేశ మయ్యారు. టేకు ప్లాంటేషన్ ద్వారా వచ్చేఆదాయంలో వీఎస్ఎస్‌కు వాటా ఇవ్వాలని సభ్యులు కోరగా గతంలో ప్లాంటేషన్ వేసే సమయంలో సభ్యులతో ఆ విధమైన ఒప్పందం లేదని చెప్పారు.అయినా ఆ విషయమై ఆలోచన చేస్తామన్నారు. అనంతరం నర్సీపట్నం డివిజన్‌లో గతంలో వేసిన టేకు ప్లాంటేషన్లు ఎన్ని... ప్రస్తుతం నరుకుతున్న ప్లాంటేషన్లు, వాటి ద్వారా వచ్చిన ఆదాయం, ఇంకా నరకడానికి సిద్ధంగా ఉన్న ప్లాంటేషన్లు, వాటి వల్ల ఎంత ఆదాయం వస్తుందన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే 60 ఏళ్ల క్రితం వేసిన మర్రి పాకలు టేకు ప్లాంటేషన్ నరకడానికి ఉన్న అవాంతరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటవీ శాఖ ద్వారా వచ్చే ఆదాయ వనరులపై కసరత్తు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా పక్వానికి వచ్చిన వెదురు వనాలును మొదలు కుని అటవీ శాఖ డిపోల ద్వారా టేకు కలప వేలం తదితర మార్గాల గతంలో కంటే మెరుగైన ఆదాయం తీసుకురావాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. అందులో భాగంగానే అటవీ ప్రాంతాల్లో ఏయే వనాలు ఏ స్థాయిలో ఉన్నాయో సర్వే చేస్తున్నామని చెప్పారు. వనం-మనం కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆయనతో పాటు కృష్ణాదేవిపేట రేంజ్ అధికారి మహమ్మద్ షఫీ ఉన్నారు.

అన్నదాత ఆనందం

విస్తారంగా వర్షాలు


ఎలమంచిలిలో కుండపోత వాన


మాకవరపాలెంలో వర్షం

నర్సీపట్నం టౌన్/ రూరల్ : నర్సీపట్నం పరిసర మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం వరకు వాతావరణం బాగానే ఉన్నా 11.30 గంటల నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వెనుకభాగం ఆవరణ చెరువును తలపించగా, పాల్‌మాన్ జంక్షన్, పెదబొడ్డేపల్లిలలో ఎటుచూసినా నీరే కనిపించింది. మాకవరపాలెం, నాతవరం, రోలుగుంట మండలాల్లో భారీ వర్షం కురిసింది. గొలుగొండ, కృష్ణాదేవిపేట ప్రాంతాల్లో అడపాదడపా చిరుజల్లులు కురిశాయి.

ఈ వర్షం మెట్ట భూముల్లో అపరాలు, చిరుధాన్యాలు, వేరుశనగ, మొక్కజొన్న, చెరకు పంటలకు ఎంతో దోహదం చేస్తుందని రైతులు చెబుతున్నారు. మాగాణుల్లో దమ్ము పనులు చేసి, వరినాట్లు వేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువుల్లోకి కొత్త నీరు చేరుతోంది. నదులు, గెడ్డల్లో నీటి ప్రవాహం పెరిగింది, దీనివల్ల లింకు చెరువులు, గ్రోయిన్ల ఆయకట్టుకు నీటి సదుపాయం మెరుగుపడుతుందని రైతులు అంటున్నారు.

చోడవరంలో చిరు జల్లులు

చోడవరం : అల్పపీడనం ప్రభావంతో శనివారం ఉదయం నుంచి గ్రామీణ ప్రాంత మండలాల్లో జల్లులు పడుతున్నాయి. ఉదయం వాతావరణం మబ్బు పట్టి ఉండగా, మధ్యాహ్నం నుంచి జల్లులు మొదలయ్యాయి. దీంతో చోడవరం, రావికమతం, చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు మండలాలు చిత్తడిగా మారాయి.


వడ్డాదిలోని పెద్దేరులో భారీగా చేరిన నీరు

ముసురు వాతావరణంతో చిత్తడి


అనకాపల్లి నెహ్రూచౌక్ జంక్షన్‌లో వర్షం

అనకాపల్లి : విశాఖ గ్రామీణ జిల్లాలో శనివారం ముసురుపట్టింది. కొన్ని మండలాల్లో భారీ వర్షం కురవగా, మరికొన్ని మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. గత రెండు రోజుల్లో పలు ప్రాంతాల్లో భారీగా వర్షపాతం నమోదైంది. అనకాపల్లిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనకాపల్లిలో అండర్ బ్రిడ్జి, పార్కు సెంటర్, మళ్లవీధి తదితర ప్రాంతాలు నీరు నిలిచిపోయింది. మునగపాకలో చిరుజల్లులకే పరిమితమైంది. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో భారీగానే వర్షం పడింది. ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో 20మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు వరినాట్లు వేసుకునేందుకు అవకాశం ఉందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. అలాగే చెరకు, కూరగాయల పంటలకు బాగా కలిసివస్తుందని చెపుతున్నారు. అయితే వర్షం కారణంగా పనులు లేక కూలీలు ఇబ్బందులు పడ్డారు.


చిత్తడిగా మారిన
పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్

ఏజెన్సీవ్యాప్తంగా ఒకటే వానలు

పాడేరు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏజెన్సీ వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి ముసురు వాతావరణం ఏర్పడింది. రోజంతా కొన్నిచోట్ల చినుకులు, మరికొన్నిచోట్ల వర్షం కురుస్తుండడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. ఈ కారణంగా హుకుంపేట, ముంచంగిపుట్టు వారపు సంతలకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుత వాతావరణంతో పాడేరు పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. ముంచంగిపుట్టు, పెదబయలు, జీకేవీధి, డుంబ్రిగుడ ప్రాంతాల్లో వర్షం ఒక మోస్తరుగా కురవగా, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట ప్రాంతాల్లో చినుకులు పడ్డాయి.

అన్నదాతల్లో చిగురించిన ఆశలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ వరికి ఊతంగా ఉంటాయని గిరి రైతులు చెపుతున్నారు. గత నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పాటు, ఎండలు తీవ్రంగా కాయడంతో వరి నారు, వరి నాట్లు సైతం ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందారు. ఈ తరుణంలో వర్షాలు పడుతుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.

పాయకరావుపేటలో 20 మిమీ వర్షం పాతం



పాయకరావుపేట : ఈ నియోజకవర్గంలో శనివారం భారీ వర్షం కురిసింది. పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో కురిసిన వర్షాలతో రైతులు ఊరటచెందారు. వ్యవసాయానికి ఈ వర్షం అనుకూలమని పలువురు రైతులు తెలిపారు. మెట్టు భూముల్లో ఎండుతున్న వరి నారుకు ఈ వర్షం ఊపిరి పోసినట్లయిందని రైతులు పేర్కొంటున్నారు. నక్కపల్లిలో 20 మిమీ వర్షం పాతం నమోదైంది.

ఇప్పటికే ఖాళీ.. ఆపై మళ్లీ నిర్మాణాలా..?

- ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్సు పైభాగంలో కొత్తగా నిర్మాణాలు
- పనులను చూసి అంతా ఆశ్చర్యం
- అసలేం జరుగుతుందోనని చర్చ

అనకాపల్లి : పట్టణంలోని ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్సు పరిస్థితి అయోమయంగా మారింది. ముందు నిర్మించిన షాపులను వినియోగంలోకి తేకుండానే మరో రూ.50 లక్షలు వెచ్చించి వాటిపై మరో షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. ఇదంతా చూసిన వారికి అసలు ఇక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జీవీఎంసీకి రూ.కోటిన్నర అద్దె బకాయిలు!

రెండేళ్ల క్రితం కాంప్లెక్సుకు ఉత్తరభాగంలో ఉన్న 11 షాపులను వేలం ద్వారా అద్దెకు ఇచ్చారు. అయితే ఆ షాపులకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఒకరిద్దరు మినహా మిగిలిన వారెవ్వరూ వ్యాపారాలు ప్రారంభించలేదు. అద్దెలు కూడా చెల్లించలేదు. ఈ కారణంగా సుమారు కోటిన్నర రూపాయలు జీవీఎంసీకి అద్దె బకాయిల రూపంలో నష్టం వాటిల్లింది. తూర్పు భాగంలో ఉన్న షాపులను ఇప్పటికీ అద్దెకు ఇవ్వలేకపోతున్నారు. ఆ షాపులను కూడా స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ ఉండడంతో వారంతా మంత్రి గంటా శ్రీనివాసరావును ఆశ్రయించారు. ఇద్దరికి ఒక షాపు చొప్పున ఇవ్వాలని మంత్రి గంటా ఆదేశాలు జారీ చేశారు. అయితే నిబంధనల ప్రకారం ఆక్షన్ లేకుండా షాపులు అద్దెకు ఇవ్వరాదు.

దీంతో జీవీఎంసీ కమిషనర్ ఆక్షన్ లేకుండా షాపులు అద్దెలకు ఇచ్చే విధంగా అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి ఆ విధంగా అనుమతి రాలేదు. ఇదిలావుండగా, జీవీఎంసీ సాధారణ నిధులు రూ.50 లక్షలతో ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్సుపై మరో షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. దీనిపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. .


అద్దెకు ఇవ్వని షాపులు

'దాడి' హయాంలో శంకుస్థాపన..'గంటా' హయంలో ప్రారంభోత్సవం!

2000 సంవత్సరంలో ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు హయాంలో రూ.30 లక్షల ఐడీఎస్ఎంటీ నిధులతో ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనేక అవాంతరాల నడుమ మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ హయాంలో నిర్మాణం ప్రారంభమైంది. అప్పటి మంత్రి గంటా శ్రీనివాసరావు హయాంలో ప్రారంభోత్సవం జరిగింది. అయితే ఈ షాపింగ్ కాంప్లెక్సును గతంలో అక్కడ చిరువ్యాపారాలు చేసుకున్న వారికి మాత్రమే ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. ఈ కారణంగా షాపులను ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అద్దెకు ఇవ్వలేకపోయారు.


ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్సుపై నిర్మాణం జరుగుతున్న దృశ్యం

షాపులు అద్దెకు ఇచ్చేలా చర్యలు

ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్సు అద్దెకు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. గతంలో ఇక్కడ ఉన్న చిరు వ్యాపారులకు ఇద్దరికి ఒక షాపు వంతున కేటాయిస్తాం. ముందు ఆక్షన్ నిర్వహించిన షాపుల అద్దె రూ.7,350. ఆ అద్దె ఆక్షన్ వేయలేని షాపులకూ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్

నియామకం

ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అపర్ణ

గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారిణి, గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ ప్రిన్సిపల్ సెక్రటరీ అపర్ణ ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అపర్ణ మూడేళ్ల ఈ పదవిలో కొనసాగుతారు. ప్రపంచ బ్యాంకులో భారత్, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక దేశాలకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా రాజీవ్ కుమార్



నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా ప్రముఖ ఆర్థికవేత్త రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. 2015 జనవరి నుంచి వైస్ చైర్మన్‌గా సేవలందించిన అరవింద్ పనగడియా రాజీనామా చేయడంతో రాజీవ్‌ను ఆ స్థానంలో నియమించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన రాజీవ్ వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఫిక్కీ సెక్రటరీ జనరల్‌గా, సీఐఐ ముఖ్య ఆర్థిక సలహాదారుగా సేవలందించారు. పరిశ్రమలు, ఆర్థిక మంత్రిత్వశాఖల్లో, ఆసియా అభివృద్ధి బ్యాంకులో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2006 నుంచి 2008 మధ్య నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. రాజీవ్ కుమార్‌తో పాటు ఎయిమ్స్ వైద్యుడు వినోద్ పాల్‌ను కూడా నీతి ఆయోగ్ సభ్యుడిగా కేంద్రం నియమించింది.

45వ సీజేగా దీపక్ మిశ్రా

సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దీపక్ మిశ్రా నియమితులయ్యారు. ప్రస్తుత సీజే జస్టిస్ జగదీష్ ఖేహర్ ఆగస్టు 27న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో దీపక్ మిశ్రా బాధ్యతలు చేపడతారు. మిశ్రా 2018 అక్టోబరు 3 వరకు పదవిలో ఉంటారు. 1990-91లో సుప్రీంకోర్టు 21వ ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించిన రంగనాథ్ మిశ్రా మేనల్లుడే దీపక్ మిశ్రా. దీపక్ గతంలో పట్నా, ఢిల్లీ హైకోర్టు సీజేగా సేవలందించారు.

ఉపరాష్ట్రపతిగా వెంకయ్య ప్రమాణం

భారత 13వ ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆగస్టు 11న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లోని దర్బార్‌హాల్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఆగస్టు 6న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీపై వెంకయ్య విజయం సాధించారు. ఏపీ నుంచి ఉపరాష్ట్రపతి పదవి అలంకరించిన మూడో వ్యక్తి వెంకయ్యనాయుడు. గతంలో సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరి ఉపరాష్ట్రపతిగా ఎన్నికై రాష్ట్రపతి అయ్యారు.

కరెంట్ అఫైర్స్



రామచంద్రారెడ్డి ఉప్పుల

తొలి ప్రైవేట్ క్షిపణి తయారీ

దేశంలోనే తొలిసారిగా ప్రైవేట్ రంగంలో క్షిపణి విడిభాగాల తయారీ సంస్థ 'కళ్యాణి-రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్'ను ఆగస్టు 3న హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్‌కు చెందిన కళ్యాణి గ్రూప్, ఇజ్రాయెల్‌కి చెందిన రఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ సంయుక్తంగా ఈ పరిశ్రమను హార్డ్‌వేర్ పార్కులో ఏర్పాటు చేశాయి. రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులకు అనుమతి లభించడంతో కళ్యాణి గ్రూప్ 51 శాతం, రఫెల్ 49 శాతం వాటాతో ఈ ప్రాజెక్టు చేపట్టాయి. ఈ కర్మాగారంలో రిమోట్ ఆయుధ ధాలను, యాంటీ ట్యాంక్ మిస్సైల్స్‌ను, అత్యాధునిక క్షిపణి వ్యవస్థ పరికరాలను తయారు చేయనున్నారు.

అవార్డులు

గోరటి వెంకన్న, సుద్దాలకు 'జాలాది'

సినీ రచయిత జాలాది జయంతిని పురస్కరించుకొని విశాఖలో ఆగస్టు 9న జాలాది జాతీయ పురస్కారాలను అందజేశారు. ప్రజాకవి గోరటి వెంకన్నకు జాలాది జీవితకాల సాఫల్య పురస్కారం, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు జాలాది జాతీయ పురస్కారం అందించారు. ఏపీ మంత్రి గంటా శ్రీనివాసరావు అవార్డులను అందజేశారు. జాలాది రాజారావు 1500కి పైగా సినీ గేయాలు రాశారు. గుడివాడలో జన్మించిన జాలాది ఎక్కువగా జానపద గేయాలను రచించారు.

భారత డిజిటల్ గ్రంథాలయ యాప్‌కి 'గ్లోబల్'

జాతీయ డిజిటల్ గ్రంథాలయ యాప్‌కు 'ఎంబిలియంత్ దక్షిణాసియా-2017' అవార్డు దక్కింది. అధ్యయనం, విద్య విభాగంలో విద్య సంబంధ అభివృద్ధిలో మొబైల్ యాప్ ఆధారిత ఆవిష్కరణకుగాను ఈ అవార్డు లభించింది. ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ యాప్‌ను రూపొందించగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆమోదించింది. దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం భారతీయ భాషల్లో విద్య విషయ, బోధన అంశాలు అందరికీ అందుబాటులో ఉంచాలన్నదే ఈ డిజిటల్ గ్రంథాలయం ప్రధాన లక్ష్యం. ఈ డిజిటల్ గ్రంథాలయ యాప్‌లో కోటికి పైగా విషయాంశాలు 200 భాషల్లో అందుబాటులో ఉన్నాయి.

దేవ్ పటేల్‌కి 'ఏషియన్ గేమ్ చేంజర్స్'



స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్ర నటుడు దేవ్ పటేల్ 'ఏషియన్ గేమ్ చేంజర్స్ అవార్డు-2017'కి ఎంపికయ్యారు. దేవ్ లయన్ హార్ట్ ప్రచారం ద్వారా దేశంలోని ఇల్లులేని చిన్నారుల కోసం 2.5 లక్షల డాలర్ల నిధులను సేకరించారు. పేద పిల్లల సంక్షేమం కోసం దేవ్ చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది. ఆగాఖాన్‌కు లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు లభించింది. తదాషి యనాయ్, సుర్వేష్, సొనిటా అలిజాదేలకు కూడా గేమ్‌చేంజర్స్ అవార్డు దక్కింది. 2017 నవంబరు 1న ఐక్యరాజ్య సమితి వీరికి అవార్డులను ప్రదానం చేస్తుంది.

క్రీడలు

పరుగుకు బోల్ట్ వీడ్కోలు



దిగ్గజ అథ్లెట్ ఉసేన్ బోల్ట్ తన చివరి వంద మీటర్ల పరుగును కాంస్యంతో ముగించాడు. లండన్‌లో జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో బోల్ట్ 9.95 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికాకు చెందిన జస్టిన్ గాట్లిన్ 9.92 సెకన్లతో రేసు పూర్తిచేసి స్వర్ణం గెలుచుకున్నాడు. మరో అథ్లెట్ కోల్‌మన్ 9.94 సెకన్లతో రజతం సాధించాడు. 100మీ. 9.58 సెకన్లు, 200మీ. 19.19 సెకన్లతో బోల్టు రికార్డులను నెలకొల్పాడు. 2008, 2012, 2016లో వరుసగా మూడు సార్లు 100మీ., 200మీ. పరుగులో స్వర్ణాలు గెలిచిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 8 ఒలింపిక్ పసిడి పతకాలను సొంతం చేసుకున్నాడు. 11 సార్లు ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచాడు.

టెస్టుల్లో నెంబర్‌వన్ బౌలర్ జడేజా

ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో భారత బౌలర్ రవీంద్ర జడేజా బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచాడు. శ్రీలంకతో జరిగిన టెస్టు మ్యాచుల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన జడేజా ఆల్‌రౌండర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన షకీబుల్ హసన్‌ను వెనక్కు నెట్టి నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. బౌలింగ్‌లో కూడా జడేజా నెంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. బ్యాటింగ్‌లో పుజారా 3, కోహ్లీ 5, రహానే 6వ స్థానంలో నిలిచారు. బౌలింగ్‌లో అశ్విన్ మూడో స్థానానికి పడిపోయారు.

ముంబై అథ్లెట్ సరికొత్త రికార్డు

ముంబైకి చెందిన అథ్లెట్ సమీర్‌సింగ్ 100 రోజుల్లో 9964 కి.మీ. పరిగెత్తి సరికొత్త రికార్డు సృష్టించాడు. రన్నింగ్ కోచ్ అయిన సమీర్ 100 రోజుల్లో 10 వేల కి.మీ. పరిగెత్తే లక్ష్యంతో ఏప్రిల్ 29న పరుగు మొదలు పెట్టాడు. 100వ రోజు ఆగస్టు 6న 150 కి.మీ. పరిగెత్తాల్సి ఉండగా 114 కి.మీ.కే పరుగు ముగించాడు. సమీర్ మూడు నెలల మారథాన్ అంతా ముంబై ములికివాడలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో సాగింది.

విజేందర్ జైత్రయాత్ర

భారత ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ మరోసారి తన సత్తా చాటాడు. ఆగస్టు 5న ముంబైలో జరిగిన ఆసియా పసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ పోరులో చైనా బాక్సర్ జుల్పికర్ మైమైటియాలిని ఓడించి టైటిల్ సాధించాడు. విజేందర్‌కు వరుసగా ఇది తొమ్మిదో బౌట్ విజయం, ప్రొఫెషనల్ కెరీర్‌లో అడుగు పెట్టిన నాటి నుంచి విజేందర్ ఓటమిని ఎరుగక విజయాలు సాధిస్తున్నాడు.

స్వయం ఉపాధి



మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

దుస్తులను ఉతకడానికి సబ్బు, పొడి రూపంలో డిటర్జెంట్లను ఉపయోగించడం మనందరికీ తెలిసిందే. నాణ్యత ఆధారంగా పలు ధరల్లో రకరకాల డిటర్జెంట్లు అన్ని వర్గాలవారికి ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయి. ఫ్యాబ్రిక్ కేర్ మీద పెరుగుతున్న అవగాహన వల్ల సువాసన భరితమైన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. మన దేశంలో మొత్తం డిటర్జెంట్స్ మార్కెట్ 2015కిగాను రూ.16184 కోట్లు ఉందని అంచనా వేశారు. ఇది 2019 నాటికి 19 శాతం వరకు వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు కేవలం నగరాలు, పట్టణాలకే పరిమితమైన డిటర్జెంట్స్ వినియోగం నేడు గ్రామాలకు, చిన్న చిన్న పల్లెలకు విస్తరించింది.

లిక్విడ్ డిటర్జెంట్స్



తక్కువగా ఉన్న తలసరి వినియోగం: అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో డిటర్జెంట్స్ తలసరి వినియోగం చాలా తక్కువగా ఉంది. మన దేశంలో ఏడాదికి 2.7 కేజీలు మాత్రమే ఉంది. ఫిలిప్పీన్స్, మలేషియా దేశాల్లో 3.7 కిలోలు, అమెరికాలో 10 కిలోలు ఉండటం గమనార్హం. అయితే ఇటీవల మన దేశంలో కూడా వీటి వినియోగం చెప్పుకోదగిన రీతిలో పెరుగుతుందని మార్కెటింగ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ద్రవరూప డిటర్జెంట్స్: మనదేశంలో డిటర్జెంట్ ఉత్పత్తుల్ని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి డిటర్జెంట్ పొడి, డిటర్జెంట్ సబ్బు. వీటిని మళ్లీ రెండు రకాలుగా విభజించవచ్చు.

పాపులర్ / ఎకానమి ఉత్పత్తులు: ఇవి తక్కువ ధరలో లభిస్తాయి. వీటిని పేద, దిగువ మధ్యతరగతి వారికోసం ఉద్దేశించారు.

మధ్యస్థ ధర ఉత్పత్తులు: వీటిని మధ్య తరగతి కుటుంబాలకు ప్రత్యేకించారు.

ప్రీమియం ఉత్పత్తులు: వీటిని ధనిక, సంపన్న వర్గాలకోసం కేటాయించారు.

నాణ్యత ఆధారంగా ధరలను సమతుల్యం చేస్తూ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే సర్వసాధారణమైనప్పటికీ మనదేశంలో మాత్రం ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న 'లిక్విడ్ డిటర్జెంట్. బార్ సబ్బులు, లిక్విడ్ & పొడి రూప డిటర్జెంట్ల కంటే సమర్థంగా పనిచేయకపోవడం, వినియోగదారుల చేతులకు హానికారకంగా మారడం వల్ల వాటి వినియోగం క్రమంగా తగ్గుతూ వచ్చింది. మనదేశంలో కూడా సబ్బులకు బదులుగా ద్రవరూప డిటర్జెంట్స్ వాడకం ప్రారంభమైందనే చెప్పాలి.

లిక్విడ్ డిటర్జెంట్స్ వినియోగం: ఇతర డిటర్జెంట్స్ లాగే ద్రవరూప డిటర్జెంట్స్‌ను కూడా బకెట్ వాషింగ్‌లో, టాప్ లోడ్& ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషిన్లలో సైతం ఉపయోగించవచ్చు. 2008లో భారతదేశ లిక్విడ్ డిటర్జెంట్స్ మార్కెట్ రూ.60 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.350 కోట్ల స్థాయికి వృద్ధి పొందినట్లు అంచనా. అంటే ఏటా 35 శాతం వరకు పెరుగుతున్నట్లు చెప్పవచ్చు.

యంత్ర పరికరాలు:
- స్టెయిన్‌లెస్ స్టీల్ కెటిల్ మిక్సర్ ● వాటర్ పెజ్ ● లిక్విడ్ పంప్ ● వాటర్ చిల్లర్ ● ఎయిర్ కంప్రెషర్ ● వాటర్ హీటింగ్ సిస్టం ● సెమి ఆటోమేటిక్ బాటిల్ ఫిల్లింగ్ యంత్రం ● ష్రింక్ ర్యాపింగ్ ప్యాకింగ్ యంత్రం ● ఇతర పరికరాలు

ముడి పదార్థాలు
- పాలిమర్ ● ఎఎస్ ● యాసిడ్ స్లరి ● ఎస్ఎల్ఈఎస్ ● ఎస్ఎల్ఇఎస్ ● యూరియా ● ఫైన్ సాల్ట్ ● కాస్టిక్ సోడా ● పర్ఫ్యూమ్స్ ● కలర్స్

తయారీ విధానం: ముందుగా నిర్ణయించిన వివిధ ముడి పదార్థాలను నిర్ణీత నిష్పత్తుల్లో కెటిల్ మిక్సర్‌లో వేడిచేసి బాగా కలుపుతారు. ఎటువంటి ముక్కలు లేకుండా బాగా కలిపి చిల్లర్ ద్వారా చల్లబరుస్తారు. చల్లని లిక్విడ్ డిటర్జెంట్‌ను 100మిలీ, 250 మిలీ, 500 మిలీ, 1 లీ బాటిల్స్‌లో నింపి ప్యాకింగ్ చేసి మార్కెటింగ్‌కు పంపుతారు. బల్క్ వినియోగదారుల కోసం 5 లీ, 10 లీ ప్లాస్టిక్ క్యాన్లలో ప్యాక్ చేసి మార్కెటింగ్ కోసం పంపుతారు.

మార్కెటింగ్: లిక్విడ్ డిటర్జెంట్ క్రమేణా ప్రాచుర్యం పొందుతోంది కాబట్టి నగరాలు, పట్టణాల్లోని సూపర్ మార్కెట్లు, కిరాణాషాపుల ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్రత్యక్ష/ పరోక్ష మార్కెటింగ్ విధానాలను అనుసరించవచ్చు.

పరిశ్రమ వివరాలు:
ఉత్పత్తి సామర్థ్యం: 400 లీ/ రోజుకు(ఒక షిఫ్ట్‌లో)
పరిశ్రమ వ్యయం: రూ.45 లక్షలు

గణనీయంగా తగ్గిన పత్తి సాగు

- గొలుగొండ మండలంలో వెయ్యి హెక్టార్ల నుంచి 30 హెక్టార్లకు పడిపోయిన విస్తీర్ణం
- పెరిగిన పెట్టుబడులు, పంటకు తెగుళ్ల బెడద
- గొర్రె తోక చందంగా పత్తి ధరలు
- గిట్టుబాటుకాక సరుగుడు తోటలు వేసుకుంటున్న రైతులు

గొలుగొండ: ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలి రేట్లు పెరగడం, మరోవైపు తెగుళ్ల బెడద అధికం కావడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర అంతంతమాత్రంగానే వుండడంతో మండలంలో పత్తి సాగును రైతులు విరమించుకుంటున్నారు. ఐదారేళ్ల క్రితం వరకు వెయ్యి హెక్టార్లలో పత్తి పంటను వేసేవారు. తరువాత ఏటేటా తగ్గుతూ, ఈ ఏడాది 30 హెక్టార్లకు తగ్గిపోయింది. గతంలో పత్తి పండించిన భూముల్లో ఇప్పుడు సరుగుడు తోటలు కనిపిస్తున్నాయి.

గొలుగొండ మండలంలో పాతమల్లంపేట, కొత్తపాలెం, సాలికమల్లవరం, పాకలపాడు, కె.మల్లంపేట, పప్పుశెట్టి పాలెం, కె.యల్లవరం, కరక, కశిమి, రావణాపల్లి, పుత్తడిగ్గె రంపేట, చోద్యం, ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, లింగం పేట గ్రామాల్లో చాలా ఏళ్లుగా పత్తి పంటను సాగు చేస్తున్నారు.



పాతమల్లంపేటలో కొద్ది విస్తీర్ణంలో వేసిన పత్తి పంట. పక్కపొలంలో సరుగుడు తోట



పాతమల్లంపేటలో గతంలో పత్తి సాగు చేసిన భూముల్లో ప్రస్తుతం సరుగుడు మొక్కలు

ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం, ఖర్చులు పోను ఆదాయం బాగానే వుండడం ఐదారేళ్ల క్రితం వరకు సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంటను విడవకుండా సాగు చేసేవారు. అయితే ఖర్చులు పెరిగిపోవడం, పంటకు తెగుళ్లు అధికం కావడం, పత్తి ధరలు ఒడిదుడుకులకు లోనవుతుండడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడుతున్నది. దీనికితోడు కోతుల బెడద. ఇతర పంటలు వేసినా ఇదే పరిస్థితి వుండడంతో సరుగుడు తోటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఏటేటా పత్తి సాగు విస్తీర్ణం తగ్గిపోతున్నది. 2015లో ఆయా గ్రామాల్లో 200 హెక్టార్లకు పడిపోయింది. గత ఏడాది 100 హెక్టార్లలో పత్తి వేయగా, ఈ ఏడాది కేవలం 30 హెక్టారుల్లో మాత్రమే వేశారు. తెగుళ్ల కారణంగా పత్తి పంట దిగుబడులు తగ్గిపోయాయని, ఇదే సమయంలో ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలి రేట్లు బాగా పెరిగిపోయాయని, దీంతో పెట్టుబడులు రాకపోగా చేతి చమురు వదులుతున్నదని, అందుకే పత్తి బదులు సరుగుడు తోటలు వేసుకుంటున్నామని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడులు కూడా రావడంలేదు

సుర్ల నూకరాజు, ద్వారకానగరం



గతంలో నును ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేసేవాడిని. పెట్టుబడి పోను ఎకరాకు రూ.20 వేల వరకు మిగిలేవి. కానీ మూడేళ్ల నుంచి వాతావరణం అనుకూలించడంలేదు. తెగుళ్ల బెడద పెరిగింది. ఎరువులు, పురుగు మందుల ధరలతోపాటు కూలి రేట్లు కూడా పెరిగాయి. దీంతో పెట్టుబడులు కూడా రావడం లేదు అందుకే పత్తి సాగు మానేశాను.

తెగుళ్ల బెడద పెరిగింది

పండా తాతాజీ, గొలుగొండ



పత్తిసాగుతో ఆదాయం బాగుండేది. శ్రమ కూడా తక్కువే. కానీ రెండు మూడేళ్ల నుంచి వాతావరణం అనూకూలించడంలేదు. తెగుళ్ల బెడద అధికమైంది. దిగుబడి తగ్గిపోయింది. ఖర్చులు మాత్రం పెరిగాయి. పత్తి సాగు తగ్గించి సరుగుడు తోటలు వేశాను.

అగనంపూడి టోల్‌గేటు దోపిడీ

- రోజుకు రూ.16 లక్షలు
- ప్రభుత్వం డీనోటిఫై చేసినా కొనసాగింపు
- ఎంపీ ప్రయత్నాలకు మోకాలడ్డు
- హైకోర్టులో గాజువాక బార్ అసోసియేషన్ కేసు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

అగనంపూడి టోల్‌గేటు ద్వారా జాతీయ రహదారుల సంస్థ విశాఖ ప్రజలను దోచుకుంటోంది. జాతీయ రహదారి విస్తరణ జరిగిన వెంటనే ఇక్కడ టోల్‌గేట్ ఏర్పాటు చేసి రుసుములు వసూలు చేయడం ప్రారంభించారు. సుమారుగా 19 ఏళ్లు కావస్తోంది. అప్పట్లో రహదారి నిర్మాణానికి రూ.60 కోట్లు వ్యయం కాగా, ఇప్పటివరకు ఫీజుల ద్వారా రూ.200 కోట్లు వసూలు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఎప్పుడో దీనిని తొలగించాలి. కానీ రోజుకు రూ.14 నుంచి రూ.16 లక్షల ఆదాయం వస్తుండడంతో అధికారులు, రాజకీయ నేతలు కలిసి దీనిని కొనసాగిస్తున్నారు.





అగనంపూడి టోల్‌గేటు, ధరల పట్టిక

ఎప్పటి నుంచో ఆందోళన

టోల్‌గేట్‌లను మున్సిపాల్టీల పరిధిలో ఏర్పాటు చేయకూడదు. కనీసం 10 కి.మీ. దూరంలో వుండాలి. అగనంపూడిలో టోల్‌గేట్ ఏర్పాటు చేసినపుడు జీవీఎంసీ పరిధి విస్తరించలేదు. ఆ తరువాత అనకాపల్లి వరకు పెరిగింది. కొత్త నిబంధనలను ఏ సంస్థ అయినా విస్మరించడానికి వీల్లేదు. వాటిని అమలు చేయాల్సిందే. జీవీఎంసీ పరిధి పెరిగినందున టోల్‌గేటును అగనంపూడి నుంచి మరో ప్రాంతానికి మార్చాలి. కానీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఆ పని చేయలేదు. దాంతో టోల్‌గేటు పరిధిలోని అగనంపూడి, శివాజీనగర్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాలనీ ప్రజలు, ఫార్మాసిటీకి వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. నగర పరిధిలో టోల్‌గేటు పెడితే స్థానికులకు ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలి. కానీ అధికారులు దాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఎవరైనా సరే టోల్ ఫీజు కట్టాల్సిందేనని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. దీంతో ఈ సమస్య తీవ్రమైంది.

ఎంపీ ఆదేశాలు తెచ్చినా ప్రయోజనం లేదు

ఈ సమస్య పరిష్కారం కోసం విశాఖపట్నం ఎంపీ హరిబాబు తీవ్రంగా ప్రయత్నించారు. టోల్‌గేటును అగనంపూడి నుంచి దూరంగా తరలించాలని ఆదేశాలు తీసుకొచ్చారు. ఆ మేరకు లంకెలపాలెం దగ్గర పెట్టాలని ప్రయత్నించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దీనిని వ్యతిరేకించారు. తన నియోజకవర్గం పరిధిలో పెడితే స్థానికులు ఇబ్బంది పడతారని అడ్డుకున్నారు. దాంతో టోల్‌గేటు మారలేదు.

అసలు టోల్‌గేట్ అవసరమే లేదు

అనకాపల్లి నుంచి వస్తున్న భారీ వాహనాలు విశాఖ నగరం మీదుగా వస్తుంటే ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయని, బైపాస్ ఏర్పాటు చేయాలని విశాఖ ఎంపీగా పురందేశ్వరి ప్రయత్నించారు. అప్పట్లోనే అనకాపల్లి-ఆనందపురం మార్గం జాతీయ రహదారిగా మారుస్తామని ప్రకటించారు. ఏడాదిన్నర కిత్రం ప్రభుత్వం పెందుర్తి-సబ్బవరం-అనకాపల్లి-ఆనందపురం మార్గాన్ని జాతీయ రహదారి-16గా ప్రకటించింది. అంటే అనకాపల్లి-విశాఖపట్నం-ఆనందపురం మార్గం జాతీయ రహదారుల జాబితా నుంచి ఉపసంహరించినట్టే లెక్క. జాతీయ రహదారి కాకపోతే టోల్‌గేటు, ఫీజులు వసూలు చేయకూడదు. అయినా రోజుకు లక్షల రూపాయల ఆదాయం వస్తుండడంతో అంతా కుమ్మక్కై కొనసాగిస్తున్నారు.

మద్యం దుకాణాల వివాదంతో స్పష్టత

ఇటీవల న్యాయస్థానం జాతీయ రహదారులను ఆనుకొని మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వవద్దని, వున్నవాటిని తొలగించాలని ఆదేశించింది. దాంతో విశాఖపట్నంలో ఎక్సైజ్ అధికారులు అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు జాతీయ రహదారిని ఆనుకొని వున్నవాటిని తొలగించారు. దీనిపై మద్యం వ్యాపారులు కోర్టుకు వెళ్లారు. కేంద్రం పెందుర్తి-ఆనందపురం మార్గాన్ని జాతీయ రహదారిగా మారిస్తే ఇక ఇది జాతీయ రహదారి ఎలా అవుతుందో చెప్పాలని వారు కేసు వేశారు. వారి వాదనను హైకోర్టు సమర్థించింది. దుకాణాలు పెట్టుకోవడానికి అనుమతించాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించింది. అంతా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి అనుకూలంగా వుండేలా ఈ మార్గాన్ని రాష్ట్ర రహదారిగా ప్రకటించింది. వీటన్నింటి నేపథ్యంలో అగనంపూడి వద్ద టోల్‌గేటు నిర్వహించడానికి, ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదు.

కోర్టులో కేసు ద్వారా పోరాటం

పల్లా శ్రీనివాస్, గాజువాక ఎమ్మెల్యే

గాజువాక నియోజకవర్గం పరిధిలో వచ్చే అగనంపూడి టోల్‌గేటుపై ఎమ్మెల్యే శ్రీనివాసరావు కూడా పోరాటం చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే గాజువాక బార్ అసోసియేషన్ తరఫున రెండు వారాల క్రితమే హైకోర్టులో కేసు వేయించారు.

ఇదీ ఆదాయం

ఈ టోల్‌గేటును 1998లో ప్రారంభించారు. ఆ ఏడాది కాంట్రాక్టర్ రూ.3.65 కోట్లకు పాడుకున్నాడు. ఆ మొత్తం అలా పెరుగుతూ వచ్చింది. 2016-17లో ఈ మొత్తం రూ.36.37 కోట్లకు చేరింది. త్వరలోనే మళ్లీ బిడ్స్ ఆహ్వానించనున్నారు. ఈసారి బిడ్ లేకుండా ఏకంగా గేటునే ఎత్తివేయిస్తామని రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఎంతవరకు ఫలితం వస్తుందో చూడాలి.





కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, అధ్యాపకులు, విద్యార్థులు... ప్రసంగిస్తున్న గీతం విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి

'గీతం'కు అంతర్జాతీయ ఖ్యాతి లక్ష్యం

బోధన, పరిశోధనలతో గుర్తింపు తెస్తాం: గీతం విశ్వవిద్యాలయ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి

విశాఖపట్నం: గీతం విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని గీతం అధ్యక్షులు డాక్టర్ ఎంవీవీఎస్.మూర్తి అన్నారు. గీతం విశ్వవిద్యాలయం 37వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. యూనివర్శిటీలోని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో గల యల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు, నగర ప్రముఖులు తరలి వచ్చారు. ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్ర పరిశోధకుడు, నోబెల్ బహుమతి గ్రహీత, టోక్యో విశ్వవిద్యాలయం కాస్మిక్ రే రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ టకాకి కజితకు ఈ సందర్భంగా గీతం ఫౌండేషన్ అవార్డు సత్కరించి రూ.10 లక్షల మొత్తాన్ని డాక్టర్ మూర్తి అందదేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బోధన, పరిశోధనలతో గీతం విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ స్థాఇ గుర్తింపు తీసుకు వస్తామని చెప్పారు. నోబెల్ బహుమతి గ్రహీతను సత్కరించడం గీతం విశ్వవిద్యాలయానికి లభించిన గౌరవంగా డాక్టర్ మూర్తి అభిప్రాయపడ్డారు.

సన్మాన గ్రహీత డాక్టర్ టకాకి కజిత భౌతిక శాస్త్రంలో జరుగుతున్న పరిశోధనలను, వివిధ గ్రహాలపై పదార్థ విజ్ఞానం అంశంపై జరుగుతున్న అధ్యయనాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో ఆసక్తికరంగా వివరించారు. ఈ ప్రజెంటేషన్ శాస్త్ర విజ్ఞానానికి గల ప్రాధాన్యతను ఆలోచింపజేసింది.



నోబెల్ గ్రహీత కజితతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మూర్తి

స్వదేశీ భావనను పెంపొందిస్తాం: గీతం ఛాన్సలర్ కె.రామకృష్ణారావు

గీతంలో విద్యనభ్యసిస్తున్న వారిలో స్వదేశీ భావన పెంపొందిచడానికి గాంధీ మార్గాన్ని అనుసరిస్తున్నామని గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామకృష్ణారావు తెలిపారు. మేక్ ఇన్ ఇండియా నినాదం కంటే స్వదేశీ నినాదమే సరైనదిగా ఆయన పేర్కొన్నారు. యువతరం స్వదేశీ భావనను అర్థం చేసుకుని అనుసరించాలని సూచించారు. శాస్త్ర విజ్ఞానంలో పరిశోధనల ద్వారా భారతదేశానికి నోబెల్ బహుమతులను యువత అందించడం ద్వారా దేశభక్తి చాటుకోవాలని ఆయన కోరారు.

దేశ విద్యా రంగంపై గీతం ముద్ర వీసీ ప్రొఫెసర్ ప్రసాదరావు

దేశ విద్యా రంగంపై గీతం విశ్వవిద్యాలయం తనదైన ముద్రను వేసిందని గీతం వీసీ ప్రొఫెసర్ ఎం.ఎస్.ప్రసాదరావు పేర్కొన్నారు. రానున్న కాలంలో సైన్స్, ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో సంయుక్త పరిశోధనలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించాలనేది తమ లక్ష్యమని చెప్పారు. గీతంలో వృత్తి విద్యలు అభ్యసించే ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా పారిశ్రామిక శిక్షణ పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాతీయ భావాన్ని పెంపొందించే విధంగా బృంద గానాలతో పాటు శాస్త్రీయ సంగీతాన్ని విద్యార్థులు వీనుల విందుగా వినిపించారు. రిథమ్‌కు తగ్గట్టు నృత్యం చేస్తూ ఆహూతులను ఆకట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.గంగాధరరావు, గీతం విశ్వవిద్యాలయం ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.శివరామకృష్ణ, ప్రొఫెసర్లు ఎన్.శివప్రసాద్, పీవీ శివపుల్లయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, యూజీసీ వ్యవహారాల డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ రామకృష్ణ, గీతం కార్యదర్శి బీవీ మోహన్‌రావు, పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తెనుగుపూడి విద్యార్థులు

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు తెనుగుపూడి గురుకుల కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కెవి.రమణ తెలిపారు. ఈ నెల 5న విశాఖలోని బుల్లయ్య కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు జి.ఆనంద్, ఎం.శ్రీను అండర్-16 విభాగంలో షార్ట్‌పుట్, ఎం.శ్రీను 200 మీటర్ల పరుగు పందెంలో విజేతలుగా నిలిచారన్నారు. అలాగే అండర్-18 విభాగంలో 300 మీటర్ల పరుగు పందెం పోటీలో వి.మురళి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. అలాగే 7న అనకాపల్లిలో జరిగిన టెన్నికాయిట్‌లో అండర్-14 విభాగంలో ఎ.గణేష్, బి.చైతన్య ప్రతిభ కనబరిచి అనంతపూర్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. వీరికి తర్ఫీదునిచ్చిన పీడీ విద్యాసాగర్, పీఈటీ వివేకానంద్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.35
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.35
వంకాయలు(నల్లవి)	రూ.35
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.40
దొండకాయలు	రూ.25
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.25
బీన్స్	రూ.70
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.15
బీట్‌రూట్	రూ.40
మిర్చి	రూ.50
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.40
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.40
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.40
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పుదినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనెధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	357
విజయనగరం	361
శ్రీకాకుళం	361

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	91.00	87.00
విత్ స్కిన్	127.00	144.00
స్కిన్ లెస్	150.00	154.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ఠ	గరిష్ఠ
మొదటి రకం	3450	3990
రెండో రకం	3250	3550
మూడో రకం	2790	3240

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 3, 4

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో నిదానం అవసరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): సినీరాజకీయ రంగాల వారు పట్టుదలతో పనులు పూర్తి చేస్తారు. కుటుంబ వ్యవహారాలపై దృష్టి పెడతారు. దూరంలో ఉన్న కుటుంబ సభ్యులు ఇల్లు చేరతారు. మనసు ఏదో వెలితి బాధిస్తుంది.

మిథునరాశి: (మే21-జూన్21): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సమావేశాలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. పెట్టబడులకు సంబంధించిన సమాచారం కలవరం కలిగిస్తుంది.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. పెద్దలు, పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. బంధు మిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. కొత్త పనుల ప్రారంభం విషయంలో ఆచితూచి ముందడుగు వేయాలి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. విందు వినోదాల కోసం ఖర్చులు అధికం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్పెక్యులేషన్లు, పందాలు పోటీల్లో నిదానం అవసరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఖర్చులు అంచనాలు మించుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విందు వినోదాల్లో పాల్గొంటారు. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): చిన్నారులు, ప్రియతముల అంశాలపై దృష్టి పెడతారు. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. పొదుపు పథకాలకు సంబంధించిన సమాచారం అందుకుంటారు. పెట్టుబడుల్లో అంచనాలు తప్పే అవకాశం ఉంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఆర్థిక లావాదేవీలు కొలిక్కి వస్తాయి. ఇంటికి సంబంధించి విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. మనశ్శాంతి లోపిస్తుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సోదరీసోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు, సమావేశాల్లో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. ప్రియతములకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. చర్చల్లో తొందరపాటు తగదు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక అంశాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. విందు వినోదాల కోసం ఖర్చులు అధికం.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ



టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.

ఔనా!

హమ్మింగ్ బర్డ్ గుండె నిమిషానికి 1260 సార్లు కొట్టుకుంటుంది!



సూక్తి

శత్రువులు ద్రోహ ం చేసినా.. ఆశలు ఆవిరైనా.. గూడు చెదిరినా.. సంకల్పం వీడరాదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి.. అప్పుడే విజయం సాధిస్తారు.

రంగులు వేయండి



కాంక్రీట్ నగరాల్లో పిల్లలు ఆడుకోవడానికి స్థలమే దొరకడం లేదు. అక్కడక్కడా ఉన్న పార్కులే వారికి ఆట స్థలాలవుతున్నాయి. సెలవులొస్తే చాలు పార్కులన్నీ పిల్లల ఆటలతో సందడిగా ఉంటాయి. అలాంటి పార్కులను కూడా ప్రభుత్వం కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తే..! పిల్లలు సైతం ఆ నిర్ణయాన్ని అడ్డుకుంటారు. ఇందుకు మంచి ఉదాహరణ ఢిల్లీకి చెందిన ఏడేళ్ల పాప నవ్యాసింగ్. తన ఇంటి దగ్గరున్న పార్క్‌ను అధికారులు తొలగించాలని చూస్తే 'మా సంతోషాన్ని దూరం చేస్తారా?' అంటూ కోర్టుకెళ్లి మరీ ప్రభుత్వ ప్రయత్నాన్ని అడ్డుకుంది.

పార్క్ కోసం పాప పోరాటం



పార్కులు పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు కాసేపు సేదతీరడానికి ఏర్పాటు చేసినవి. పార్కులో ఆడుకునే ఆ గంటసేపే పిల్లలకు ఎంతో సంతోషాన్నిస్తుంది. ఆ సంతోషాన్ని దూరం చేయాలని ప్రయత్నిస్తే పిల్లలు పులిలా మారి తిరగబడతారు. అలా తిరగబడి పార్కును తొలగించే ప్రయత్నాలు అడ్డుకుంది. ఢిల్లీకి చెందిన ఏడేళ్ల బాలిక నవ్యాసింగ్. తను రోజూ సాయంత్రం ఇంటి సమీపంలో ఉన్న పార్కులో తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటుంది. రోహిణి సెక్టార్ 8లో ఉన్న ఆ 'హనుమాన్ మందిర్' పార్క్ 30 ఏళ్లుగా కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఉన్నట్టుండి ఒకరోజు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు పార్కును తొలగిస్తున్నట్లు కాలనీవాసులకు చెప్పారు. కారణమేంటని అడిగితే పార్కును తొలగించి కమ్యూనిటీ హాల్ కడతామని సమాధానమిచ్చారు. ఎంతోమందికి ఆహ్లాదాన్ని పంచుతోన్న పార్కును తొలగించడమేంటని అడిగితే అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. పార్కును తొలగిస్తున్న విషయం పిల్లల చెవిన పడింది. దాంతో నవ్యాసింగ్ 'ప్రభుత్వ నిర్ణయాన్ని ఆపడానికి ఏమీ చేయలేమా?' అని తండ్రిని ప్రశ్నించింది. నవ్యాసింగ్ తండ్రి ధీరజ్‌కుమార్ న్యాయవాది. కూతురు వేసిన ప్రశ్నతో ఆ తండ్రి ఆలోచనలో పడ్డాడు. తన కూతురు పార్కును కాపాడాలని ప్రయత్నిస్తున్న విషయం అర్థమయింది. 'కోర్టులో కేసు వేయడం ద్వారా అడ్డుకోవచ్చ'ని చెప్పాడు. అయితే 'నేను కేసు వేస్తాను' అని తండ్రి సహాయంతో కోర్టులో కేసు వేసింది. 'ఇప్పటికే కొంత పార్కు స్థలం ఆక్రమణకు గురయింది. పిల్లలు ఆడుకునే వస్తువులను తొలగించి మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేయడానికి అధికారులు అనుమతినిచ్చారు. పార్కులు లేకుండా పోతే కాలనీవాసులపై, ముఖ్యంగా పిల్లలపై ఎక్కువ ప్రభావం పడుతుంది' అని పిటిషన్‌లో పేర్కొంది.



ప్రజల డబ్బు దుర్వినియోగం

నవ్యాసింగ్ వేసిన కేసుపై చీఫ్ జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి.హరిశంకర్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు బెంచ్ విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత ప్రజలు చెల్లిస్తున్న ట్యాక్స్‌తో ఆటలు ఆడుకోవడం సరికాదని అభిప్రాయపడింది. ప్రజలు డబ్బును వృథా చేయడం సరికాదని చెబుతూ, పార్కును కమ్యునిటీహాల్‌గా మార్చడంపై స్టే విధించింది. పార్కులను పార్కులుగానే ఉంచాలని, కమ్యూనిటీ సెంటర్లుగా మార్చకూడదని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. 'కమ్యూనిటీ సెంటర్ నిర్మాణానికి పార్కు స్థలం తప్ప మరో స్థలం లేదా అని ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులను బెంచ్ ప్రశ్నించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని అదేశిస్తూ కేసును సెప్టెంబర్ 18కి వాయిదా వేసింది. పార్కు తొలగించడాన్ని కోర్టు నిలువరించడంతో కాలనీవాసుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కేసు వేసి పార్కును కాపాడిన నవ్యాసింగ్‌ను కాలనీవాసులతో పాటు, టీచర్లు, తోటివిద్యార్థులు శభాష్ అంటూ అభినందించారు.

జంతర్‌మంతర్

1. కాప్రారం ▸..............................
2. ఆయంల ▸..............................
3. కరంర్పూ ▸..............................

జంబ్లింగ్ వర్డ్స్

1. OWOL ▸....................
2. YRAE ▸....................
3. TECU ▸....................

పదాలు కనుక్కోండి




APRIL
WORD SEARCH


a	d	x	a	l	i	p	c	w	a	i
y	i	g	b	e	e	d	u	j	n	s
k	a	a	i	o	l	a	v	t	h	s
u	m	e	o	h	o	f	d	u	o	e
f	b	z	i	i	u	f	h	l	i	m
a	n	c	k	j	a	o	i	i	i	y
h	d	b	n	g	r	d	o	p	u	i
a	e	e	e	l	b	i	i	o	j	v
m	a	g	f	o	o	l	u	d	p	a
e	a	s	t	e	r	v	i	k	e	x
p	s	a	l	m	e	o	i	o	u	a
b	v	t	o	u	u	n	c	t	o	t
c	u	n	d	e	r	g	r	a	d	s
p	a	s	s	o	v	e	r	u	u	e
e	s	h	o	w	e	r	s	r	y	i
d	a	t	a	b	f	e	d	u	r	n
v	b	l	o	o	m	q	f	s	a	i
e	s	h	p	f	g	z	v	w	x	a

WORDS
showers
underground
daffodil
tulip
bloom
taurus
diamond
earth
easter
passover
fool

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



చెప్పగలరా?

విసుగులో ఉన్నా కానీ ముసుగులో లేను
లోతులో ఉన్నా కానీ బాతులో లేను
మందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?


నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మనకు స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో చెప్పమంటే అలా ఆలోచిస్తున్నావేమిటి?

బంటి : తెలివైన వాడు ఆలోచించి మాట్లాడతారని చెప్పారు కదా టీచర్. అందుకే ఆలోచిస్తున్నాను.

టీచర్ : !!!!!!!!

చుక్కలు కలపండి



జవాబులు

చెప్పగలరా?: విలోమం జంతర్‌మంతర్: 1. ప్రాకారం 2. ఆలయం 3. కర్పూరం జంబ్లింగ్ వర్డ్స్: 1. WOOL 2. YAER 3. CUTE




తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 8 నుంచి డిసెంబర్ 3 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 28 నుంచి నవంబర్ 30 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 5,19, 23, 27, అక్టోబర్ 7 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : డిసెంబర్ 12వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు,
ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం

APSRTC



అనకాపల్లి ఎంక్వైరీ	77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ	94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం)	73829 14859



నృత్యాలతో అలరిస్తున్న దృశ్యం

శాంతిస్థాపనలో యువతే కీలకం

• జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ • ఘనంగా యువజనోత్సవం

విశాఖపట్నం: శాంతిస్థాపనలో యువతే కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం సిరిపురంలోని వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజనోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవవనరుల అభివృద్ధి యువత చేతుల్లో ఉందన్నారు. క్రమశిక్షణ, విద్య, సేవాగుణం ఉన్న యువతకు ఉన్నత భవిష్యత్తు చేకూరుతుందన్నారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అభ్యసించిననాడే దేశ ప్రగతి సాధ్యమన్నారు. జాయింట్ కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ శాంతి దూతలుగా యువతను చూడాలనేదే అంతర్జాతీయ యువజన దినోత్సవ ప్రధాన ఆంశమన్నారు. యువత హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటూ విజ్ఞాన పరిధిని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ అధికారి డాక్టర్ సిరి, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి.రమణమూర్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి సత్యసాయిశ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్. జిల్లా కోఆర్డినేటర్ ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ఏయూ ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.ఎ.డి.పాల్ పాల్గొన్నారు. యువజనోత్సవాల సందర్భంగా వివిధ ఆంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు

ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప హాజరు

విశాఖపట్నం, ఆగుస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15న పోలీసు పెరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్యక్షతన జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఆయనతో పాటు జిల్లా మంత్రులు అయ్యన్న, గంటా శ్రీనివాసరావు ఉత్సవాలకు హాజరుకానున్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, పిరమిడ్ ప్రదర్శనలు, సంప్రదాయ నృత్యాల ఏర్పాటుపై సంబంధిత అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ పథకాలపై ప్రగతి శకటాలను సిద్ధం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యవసాయ, విద్య, ఆరోగ్యం, ఉద్యాన, గిరిజన సంక్షేమ, గృహనిర్మాణ, నీటియాజమాన్య సంస్థ, అటవీశాఖల తరుపున ప్రగతి శకటాలు స్వాతంత్ర్య దినోత్సవాల్లో ప్రదర్శించనున్నారు. ఈసారి జిల్లాలో ఉత్తమ సేవలందించిన సుమారు 400 మందికిపైగా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారాలు అందించేందుకు కసరత్తు జరుగుతోంది. ఆయా శాఖల అధికారుల ద్వారా ఉద్యోగుల సేవల వివరాలను సేకరిస్తున్నారు. పోలీసు శాఖ సాహస ప్రదర్శనలు, బైక్ విన్యాసాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

'శ్రీప్రకాష్'లో చిన్ని కృష్ణుల సందడి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



శ్రీప్రకాష్‌లో చిన్నారి గోపికల మధ్య అలరిస్తున్న శ్రీకృష్ణుడు

పాయకరావుపేట : శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఎల్‌కేజీ నుంచి రెండో తరగతి వరకు చదువుతున్న పలువురు చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడిచేశారు. వెన్న కోసం వీరంతా ఉట్టి కొట్టే సన్నివేశం సరదాగా సాగింది. అనంతరం చిన్నారులు కోలాటం, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా శ్రీప్రకాష్ నర్సరీ హెచ్‌ఎం ఎ.ఉషారాణి, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు సంప్రదాయం పండగలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉట్టి కొట్టేందుకు సిద్ధంగా ఉన్న చిన్ని కృష్ణులు

డైట్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



బీటెక్ పట్టాలు పొందిన విద్యార్థులతో ముఖ్య అతిథులు



విద్యార్థులకు పట్టాలు ప్రదానం

అనకాపల్లి టౌన్ : డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పట్టాల ప్రదానోత్సవం ఆనందోత్సాహాల నడుమ సాగింది. 2013-2017 విద్యా సంవత్సరాలకు సంబంధించిన బీటెక్ విద్యార్థులకు ముఖ్య అతిథి ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ప్రసాద్‌రెడ్డి, గ్లోబల్ డైరెక్టర్ పి.రమణమూర్తిలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యనభ్యసించడంలో చూపే శ్రద్ధ నూతన ఆలోచనా శైలిపై కూడా చూపాలన్నారు. రాబోయే కాలంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అధిగమించడమే కాకుండా దేశ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దేశీయ వనరులను అందిపుచ్చుకుంటే భారత్ ప్రపంచదేశాల సరసన ముందు వరుసలో నిలుస్తుందని పేర్కొన్నారు. మరో అతిథి గ్లోబల్ డైరెక్టర్ పి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో కూడిన ప్రయత్నాలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థి పాత్ర దేశాభివృద్ధికి ముడిపడి ఉంటుందని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ భారతీయ ఇంజనీర్ల మేధస్సు ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే అంతర్జాతీయ కంపెనీలకు అవసరమవుతుందన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులు సీహెచ్‌హెచ్ శివకుమార్‌రెడ్డి, అంబటి జగన్‌కుమార్ (సివిల్), ఎన్.ఉదయ్‌కుమార్ (ఈఈఈ), ఆడారి శ్రీవాణి (ఈసీఈ), విల్లూరి జ్యోత్స్న (సీఎస్‌ఈ)లకు ముఖ్య అతిథులు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమరేంద్రతో పాటు ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేయి చేతుల గణపతి విగ్రహం పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏకో ఫ్రెండ్లీ వేయి చేతుల భారీ మట్టి గణపతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాఖేష్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన వేయి చేతుల వినాయక విగ్రహ పోసర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాఖేష్ మాట్లాడుతూ దేవరాపల్లిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వవహిస్తున్నామన్నారు. పర్యావరణ సహిత మట్టి విగ్రహం రూపొందిస్తున్నామన్నారు. ఏపీఎన్‌జీజీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రణలో ప్రతి ఒక్కర్ని భాగస్వామ్యం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. దీనిని పురస్కరించుకుని 29వ తేదీ సాయంత్రం 7గంటల నుంచి 8గంట వరకు ప్రజలందరూ విద్యుత్ వాడకం నిలిపి వేసి సహకరించాలని పిలుపునిచ్చారు.

నేడు రాజేంద్రపాలెంలో వైద్య శిబిరం

కొయ్యూరు: రాజేంద్రపాలెం వారపు సంతలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రాఘవేంద్ర ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు రమేష్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరానికి విశాఖకు చెందిన క్వీన్స్ ఎన్ఆర్ఐ, రాఘవేంద్ర ఆస్పత్రుల నుంచి వైద్య నిపుణులు హాజరవుతారని చెప్పారు. క్యాన్సర్, గుండె, మూత్రపిండాలు, నరాలు, ఎముకలు, మూత్రం తదితర వ్యాధులకు చికిత్సలు చేయనున్నట్టు ఆయన తెలిపారు.


స్టేడియం నిర్మాణానికి స్థలం చదును చేస్తున్న దృశ్యం

ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభం

చింతపల్లి: ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శనివారం పనులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం చింతపల్లిలో ఇండోర్ స్టేడియం కోసం రూ.80 లక్షలు మంజూరు చేసింది. దీని నిర్మాణ పనుల బాధ్యతలను గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించింది. స్టేడియం నిర్మాణానికి రెవెన్యూ శాఖ ఎకరం స్థలం కేటాయించింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. నిర్మాణ పనులను సొంతం చేసుకున్న కాంట్రాక్టర్ శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించాడు.

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన


రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధికారులు

చింతపల్లి: విజ్ఞాన అభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని సీనియర్ లైబ్రేరియన్ త్రిమూర్తులు అన్నారు. శనివారం గ్రంథాలయ దినోత్సవాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం త్రిమూర్తులు మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో అన్ని రకాల పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. ఈ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు రాజుబాబు, కన్నబాబు, లక్ష్మణరావు, సూర్యనారాయణరావు, జిల్లా కోఫోకాన్ ముఖ్య శిక్షకుడు బాకూరు పాండురాజు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలి


వ్యాధితో ఉన్న పశువులను చూస్తున్న రాజారావు

పెదబయలు: పెదకోడాపల్లి, కిముడుపల్లి పంచాయతీల్లో వారం రోజుల వ్యవధిలో వ్యాధులతో 300 పశువులు మృతిచెందాయని, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి.రాజారావు అన్నారు. మెట్టవీధి గ్రామంలో రామ్మూర్తి దొరకు చెందిన 14 మేకలు, చిమలమామిడి, అడ్డితర గ్రామాల్లోను, కిముడుపల్లి పంచాయతీ మిచ్చుపల్లి, ఎర్రగుప్ప, చవడిమామిడి, పులగొంది, గ్రామాల్లో వివిధ వ్యాధులతో వారం రోజుల్లో సుమారు 300 పశువులు, మేకలు మృతి చెందడం విచారకరమని ఆయన వాపోయారు.

అత్యవసర వాహనం... పోలీసు స్టేషన్‌లో మకాం!

చింతపల్లి:
అత్యవసర సేవలు అందించాల్సిన అంబులెన్స్ పోలీసు స్టేషన్‌లో మూలుగుతున్నది. చేయని నేరానికి ఏడాది కాలంగా శిక్ష అనుభవిస్తున్నది. నిందితుడు బెయిలుపై వచ్చి స్వేచ్ఛగా తిరుగుతుంటే, విడిపించే నాధులే లేక స్టేషన్ నుంచి బయటకు రాలేకపోతోంది. దీంతో లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన రోగులకు సేవలు అందించలేకపోతోంది. వివరాల్లోకి వెళ్తే...

పది నెలల క్రితం లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబులెన్స్‌లో డ్రైవర్ రాజు గంజాయిని తరలిస్తూ మర్రిపాలెం అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద నర్సీపట్నం ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో ఎక్సైజ్ పోలీసులు అంబులెన్స్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేశారు. దీంతో డ్రైవర్‌ను ఐటీడీఏ అధికారులు విధుల నుంచి తొలగించారు. ప్రస్తుతం డ్రైవర్ బెయిల్‌పై వచ్చేశాడు. అయితే ఏ పాపం చేయని అంబులెన్స్‌కు బెయిల్ పెట్టే దిక్కు లేకుండా పోయింది.

డ్రైవర్ చేసిన నేరానికి ఏడాదిగా శిక్ష
బెయిలుతో దర్జాగా తిరుగుతున్న నిందితుడు
బెయిలు పెట్టే వారు లేక బయటకురాని దుస్థితి
గిరిజన రోగులకు తప్పని అగచాట్లు

గంజాయితో పట్టుబడితే బెయిలు తప్పనిసరి

గంజాయితో పట్టుబడిన వాహనం బయటకు రావాలంటే, దానికి కూడా బెయిల్ పెట్టాల్సిందే. అయితే లంబసింగి అంబులెన్స్ విడిపించేందుకు వైద్యాధికారులు కొంత వరకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. తదనంతరం పట్టించుకొనే నాధుడే లేకపోయారు. ఈ నేపథ్యంలో అంబులెన్స్ విడుదల ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా లంబసింగి ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజనులు అంబులెన్స్ సేవలకు దూరమైపోయారు.


నర్సీపట్నం పోలీసు స్టేషన్‌లో ఉన్న లంబసింగి అంబులెన్స్

అత్యవసర సమయాల్లో వారు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు, లంబసింగి వైద్యులు స్పందించి అంబులెన్స్‌ను విడుదల చేసి, రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు... వైద్య సేవల కోసం క్యూ కట్టిన విద్యార్థులు, గిరిజనులు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

కొయ్యూరు: మండలంలోని శింగవరం గ్రామంలో జలుమూరి వర్ధంతిని పురస్కరించి ఆయన కుటుంబీకులు శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం మైక్యూర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు

1500 మందికి సేవలు

సుమారు 1500 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. సుమారు 20 మంది గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, స్త్రీ సంబంధ వ్యాధుల బారిన పడిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని వైద్యులు తెలిపారు. జలుమూరి అప్పారావు కుమారులు నాగేశ్వరరావు, చంద్రశేఖర్, గణబాబు, గిరి, గోవింద్, మైక్యూర్ హాస్పిటల్స్ పిడియాట్రిక్‌లు అనిత, తిరుపతి, గైనిక్ రాధిక, జనరల్ కృష్ణనాయక్, కార్డియాలజీకి శంకర్‌నారాయణ, ఆర్ఎంపీ పార్థసారథి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మినుములూరు పీహెచ్‌సీలో శ్రమదానం

పాడేరు: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో శనివారం శ్రమదానం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రత లోపించడంతో పరిసరాలు శుభ్రం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామని గిరిజన సంఘం మండల కమిటీ అధ్యక్షుడు ఎల్.సుందరరావు చెప్పారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు గత 22 రోజులుగా భోజనాలు సమకూర్చడంతో వారికి సౌకర్యవంతంగా ఉందన్నారు. అలాగే ఏజెన్సీలోని పీహెచ్‌సీల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు పాలికి లక్కు, స్థానిక నాయకులు జి.కొండబాబు, సెల్వరాజు, డి.వసంత, నాని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డీఆర్ డిపో భవనం


ప్రారంభానికి నోచుకోని భవనం ఇదే..

సీలేరు: సీలేరులో లక్షలాది రూపాయలతో నిర్మించిన డీఆర్ డిపో భవనం నిరుపయోగం ఉంది. దీంతో ఇక్కడ రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. రామాలయం పక్కనే ఉన్న జీసీసీ స్టోర్ చిన్నదిగా ఉండటంతో ప్రభుత్వం 2010లో రూ.4.5 లక్షలతో మరో భవనాన్ని నిర్మించింది. ఏడేళ్లు దాటిపోయినా ఈ భవనం వినియోగంలోకి రాలేదు. ఈ భవనానికి వెళ్లడానికి పాత జీసీసీ స్టోర్ లోపలి భాగం నుంచి ఒక ద్వారాన్ని అమర్చితే ఆ భవనం వినియోగించడానికి వీలుపడుతుందని జీసీసీ సిబ్బంది ఎన్నో పర్యాయాలు గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహాపై కేసులు పెట్టాలి

గిరిజన సంఘం నాయకుల డిమాండ్

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో పింఛను సొమ్ము రూ.20.64 లక్షలు స్వాహా చేసిన వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులను, ఉపాధి హామీ పథకం నిధులు కొత విధించిన పోస్టల్ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.సన్నిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 2016-2017 సంవత్సరంలో సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేయగా వృద్ధులు, వితంతు పింఛన్లు, మృతిచెందిన వారి పేరిట తీసుకున్న సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. పోస్టల్ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కాజేసిన సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.శరభన్న, బి.గంగాధరం పాల్గొన్నారు.

బొర్రాలో అక్రమ కట్టడాలు


అటవీశాఖ క్వార్టర్ పక్కనే నిర్మిస్తున్న గృహం

అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు సమీపంలో అటవీశాఖ వసతి గృహం పక్కనే ఓ ప్రైవేట్ కట్టడం నిర్మిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. అసలే పర్యాటక కేంద్రాల్లో ముఖ్యమైనది కావడంతో ఈప్రాంతంలో స్థలాలపై స్థానికులకు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు అక్రమ కట్టడాలకు సిద్ధ మవుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ) లై	
పూర్ణ	నక్షత్రం

రెండు రోజుల్లో బూత్ కమిటీలు వేయాలి



టీడీపీ మండల కార్యకర్తల సమావేశంలో రామానాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

దేవరాపల్లి: రెండు రోజుల్లో గ్రామాల్లో బూత్ కమిటీలు ఎంపిక చేసి నివేదికలు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మండల నాయకులను కోరారు. మండలంలోని తిమిరాంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ గురించి పనిచేసిన వారిని కమిటీ సభ్యులుగా నియమించాలని, కమిటీ సభ్యులు గ్రామంలో పార్టీ కార్యకలాపాలు చూసుకునే విధంగా ఉండాలని అన్నారు. కమిటీలే వేసేటప్పుడు అందరూ ఆలోచించి కమిటీలు వేయాలని అన్నారు. గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు చేసి పార్టీ పరువు తీయవద్దని, నాయకులు చూపించే పౌరుషాలు వచ్చే ఎన్నికల్లో చూపించాలని అన్నారు.

మండలంలోని కాశీపురం, తిమిరాం, ఎం.అలమండ తదితర గ్రామాల్లో పార్టీ కార్యకర్తలకు సరియైన కోఆర్డినేషన్ లేక రెండు వర్గాలుగా రాజకీయాలు చేస్తు పార్టీ నాశనానికి పాల్పడుతున్నారని, అటువంటి గ్రామాల్లో ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మిలు వెళ్లి సమావేశాలు పెట్టి కార్యకర్తల్లో ఎటువంటి ద్వేషాలు లేకుండా చేయాలని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 1నుంచి 20వరకూ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. అన్ని పంచాయతీల్లో ఇప్పటి వరకూ పార్టీ తరపున చేసిన అభివృద్ధి కార్యక్రమాలు జాబితాలు తయారు చేయాలని, గ్రామాల్లో అత్యవసరమయ్యే పనులు, సమస్యలు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలోపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బండారు రామారావు, శరభాన సూర్యనారాయణ, బొడ్డు పెరినాయుడు, పూడి సింహాచలనాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కొప్పాక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తప్పిదాలకు కూలీలకు ఇబ్బందులు : సీపీఎం



విలేఖరులతో మాట్లాడుతున్న వెంకన్న

దేవరాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలకు ఉపాధి కూలీలను ఇబ్బందులు తప్పడం లేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ 1 నుంచి పనిచేసిన ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని అన్నారు. జిల్లాలో రూ.11.33 కోట్ల మేరకు కూలి బకాయిలు ఉన్నాయని అన్నారు. మన రాష్ట్రం బిల్లులు విడుదల చేయకపోవడానికి లోపాలు ఎత్తిచూపుతూ కేంద్ర అభివృద్ధి సంయుక్త కార్యదర్శి జూలై 31న సుదీర్ఘమైన లేఖ రాశారని అన్నారు. ఎంబుక్‌లో సంతకాలు సక్రమంగా ఉండడం లేదని, కూలీలకు ఎవరికి ఎంత కూలీ వస్తుందో పేస్లిప్‌లు ఇవ్వాలని, పాత పనులు ఉపాధి కూలీలు చేసిన చోట యంత్రాలతో పనులు చేయించి నిధులు దిగమింగుతున్నారని, రూ.25లక్షలు వరకూ ఖర్చు చేశారని, ఉపాధి కూలీల చేత మస్టర్లు వేసుకుంటున్నారని వారు ఆరోపించారు. 15 రోజులకు ఒకసారి ఉపాధి బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో ఎంపీడీవో సంబంధిత అధికారులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

హార్టీ సెట్‌లో అలేఖ్యకు ఏడో ర్యాంకు



మాడుగుల రూరల్ : హార్టీసెట్‌లో(హార్టికల్చర్ బీఎస్సీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) కజేపురం గ్రామానికి చెందిన బుద్ద అలేఖ్య రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు సాధించింది. జూలై 18న పశ్చిమగోదావరి జిల్లా ఉద్యానవన యూనివర్సిటీలో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు నూజివీడు, రామచంద్రాపురం, మడకశిర , కలికిరి ప్రాంతాలకు చెందిన హార్టీకల్చర్ డిప్లమో చేసిన విద్యార్థులు హాజరయ్యారు. 2015-17లో నూజివీడులో అలేఖ్య హార్టీకల్చర్ డిప్లమో పూర్తి చేసింది. కేజేపురం గ్రామానికి చెందిన బుద్దాల జగ్గారావు, మణెమ్మల పెద్ద కుమార్తె అలేఖ్య. చిన్నకుమార్తె బుద్ద మౌనిక ఐశ్వర్య. ఐశ్వర్య కూడా ఇటీవల పదో తరగతిలో పదికి పది శాతం మార్కులతో మండలస్థాయిలో ప్రథమంగా నిలిచింది.

వాకపల్లి పాఠశాలలో సరస్వతిదేవి ఆలయం ప్రారంభం



సరస్వతిదేవికి పూజలు చేస్తున్న గ్రామపెద్దలు

దేవరాపల్లి: గ్రామంలో అందరూ ఒకటిగా అయితే దేనినైనా సాధించవచ్చునని మండలంలోని వాకపల్లి ప్రజలు నిరూపించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.3.20లక్షలతో సరస్వతిదేవి ఆలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులంతా పార్టీలతో ప్రమేయం లేకుండా ఒకటిగా కలిసి నిధులు సేకరించి పాఠశాలలో సరస్వతిదేవి ఆలయాన్ని నిర్మించడం మండలంలోనే ప్రథమం.

ప్రత్యేక పూజలు, హోమాలు జరిపి గ్రామంలో ఉన్న వారి అందరికీ ప్రసాదాలు అందజేశారు. ఈ ఆలయాన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని గ్రామాల్లో అందరూ కలిసికట్టుగా అభివృద్ధి చేసుకుంటే గ్రామాల అభివృద్ధి చెందుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు చంద్రమౌళి నాగేశ్వరశర్మ, పాఠశాల స్థలం దానం ఇచ్చిన సబ్బవరపు నూకనాయుడు, ఎస్ఎంసీ ఛైర్మన్ దారపురెడ్డి శ్రీను, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల రామునాయుడు, చందనవేలి యాజమాన్యం నల్లభనేని లీలాబాబు, జి.మనోజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సరస్వతిదేవిని దర్శించుకున్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

మాడుగుల రూరల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ వర్గాల వారికి రుణాల మంజూరుకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మాడుగుల ఇండియన్ బ్యాంకు, ఆంధ్రాబ్యాంకు, గ్రామీణ వికాస బ్యాంకు, డీసీసీబీ కేజేపురం గ్రామీణ వికాస బ్యాంకు, వడ్డాది స్టేట్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్లు, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్, ఎంపీపీ ఒండ్రు గంగమ్మ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయి. 700మందికి పైగా దరఖాస్తుదారులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బాగుపడిన బోరు



చీడికాడ: మండలంలోని కోనాం సంతబయలు వద్ద ఉన్న బోరును బాగుచేశారు. ఈ బోరు చేయరూ.. అన్న శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు దీనికి మరమ్మతులు చేశారు.

గ్రామసభల ద్వారా 1966 మంది ఎంపిక : ఏఈ రమణమూర్తి



చీడికాడ: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 8 నుంచి 11 వరకూ నిర్వహించిన గ్రామసభల ద్వారా 1966 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక అందించామని గృహనిర్మాణశాఖ ఏఈ ఎస్‌వీ. రమణమూర్తి తెలిపారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాసాధికారిత సర్వేలో 3355మందికి ఇంతవరకూ పక్కా గృహాలు లేవని తేలడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించామని అన్నారు. ఆయా గ్రామాల్లో 1966మందిని ఎంపిక చేశామన్నారు ఇవి కాకుండా మరో 350మంది తమ పేర్లు జాబితాలో లేవని పేర్కొంటూ దరఖాస్తు అందజేశారన్నారు. వీరి పేర్లను కూడా ప్రభుత్వానికి నివేదించామన్నారు.

నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం : రాము

కె.కోటపాడు: నంద్యాల ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు జూరెడ్డి రాము అన్నారు. శనివారం కోటపాడులో విలేఖరులతో మాట్లాడారు. అభివృద్ధి చేస్తున్న తెలుగు దేశం పార్టీకే నంద్యాల ప్రజలు పట్టం కడతారన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైసీపీ అధినేత జగన్ నంద్యాలలో ఎన్ని శిబిరాలు నిర్వహించి, ప్రచారాలు చేపట్టిన ప్రజలు విశ్వసించరని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ చేస్తున్న విమర్శలు సరికాదన్నారు. ఇకపై ఇటువంటి వ్యాఖ్యానాలు చేస్తే ప్రజలే ఆయనకు తగిన బుద్ధి చెబుతారన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయాలు

- భయం గొల్పుతున్న కేజే పురం, వీరనారాయణం, పోతనపూడి భవనాలు
- పెచ్చులూడి పడుతున్న శ్లాబ్‌లు
- గత్యంతరం లేక సిబ్బంది వాటిలోనే విధులు



వీరనారాయణం పంచాయతీ కార్యాలయం

మాడుగుల రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ వనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వాటిలోనే కార్యదర్శులు, ఇతర ఇబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు పడుతూనే ప్రజాప్రతినిధులు సమావేశాలు జరుపుతున్నారు. చాలా ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు పాతబడిపోయాయి. శ్లాబ్‌ల పెచ్చులూడి పడుతున్నాయి. భవనాలు ఏ క్షణాన కూలిపోతాయో తెలియని పరిస్థితుల్లో ఉన్నాయి. దీంతో అక్కడ పనిచేసే సిబ్బందితో పాటు పలు పనులు నిమిత్తం కార్యాలయాలకు వచ్చే గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. మండలంలోని కేజేపురం, వీరనారాయణం, పోతనపూడి గ్రామాల్లో గల పంచాయతీ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గోడలు బీటలు వారి శ్లాబ్ పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం కురిస్తే నీరంతా గదుల్లోకి చేరిపోయి గోడలు చెమ్మగిల్లుతున్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా పింఛన్‌లు తీసుకునేందుకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు వస్తుంటారు. పింఛన్‌లు ఇచ్చేంత వరకూ ఆ శిథిల భవనాల వద్దే వేచి ఉంటారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	నక్షత్రం

ముదురుతున్న కల్యాణ మండపం వివాదం

- టీడీపీ, వైసీపీల మధ్య వార్
- ఎంపీ విజయసాయి నిధులు ఇక్కడ కేటాయించలేం...
- అడ్డుకట్ట వేసిన జిల్లా అధికారులు
- రూ.20లక్షలు కేటాయించిన ఎమ్మెల్యే రాజు
- వైసీపీ నేతల వినతిని తోసిపుచ్చిన పంచాయతీ అధికారులు



అన్నవరంలో వివాదానికి కారణమైన కల్యాణ మండపం స్థలం ఇదే

చోడవరం: నియోజకవర్గ కేంద్రమైన చోడవరం మేజర్ పంచాయతీ శివారు అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణంపై అధికార తెలుగుదేశం ప్రతిపక్ష వైసీపీల మధ్య తలెత్తిన వివాదం ముదిరింది. కల్యాణ మండపం నిర్మాణానికి వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో రూ.18లక్షలు మంజూరు చేయించిన స్థానిక వైసీపీ నాయకులు అన్నవరంలోని ఓ స్థలంలో ఈ నెల 5న మార్కింగ్ ఇవ్వడం ఇరుపార్టీల మధ్య వివాదానికి దారి తీసింది. పంచాయతీ అనుమతి లేకుండా పంచాయతీకి చెందిన స్థలంలో మార్కింగ్ ఎందుకు ఇచ్చారని, పంచాయతీ అనుమతి లేకుండా ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌తో పాటు, ఈవో పి ఆర్‌డీ, పంచాయతీ ఈవో చంద్రశేఖర్, ఎస్‌ఐ మల్లేశ్వరరావులు స్థానిక వైసీపీ నాయకులను హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ దశలో ఎంపీ విజయసాయిరెడ్డి నిధులను ఇక్కడ అభివృద్ధి పనులకు కేటాయించలేమని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు కల్యాణ మండప నిర్మాణానికి వైసీపీ నేతలు కోరిన అనుమతిని పంచాయతీ అధికారులు నిరాకరించారు.

అనుమతి ఇవ్వలేం

తేల్చి చెప్పిన పంచాయతీ అధికారులు

కాగా అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణం కోసం పంచాయతీ ఎవరికీ అనుమతి ఇవ్వదని పంచాయతీ ఈవో చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మండపం నిర్మాణం కోసం అనుమతి కోరుతూ స్థానిక వైసీపీ నాయకులతోపాటు యువజన సంఘం, డ్వాక్రా మహిళలు దరఖాస్తు చేసిన నేపథ్యంలో ఈ స్థలంలో కళ్యాణ మండపం నిర్మాణానికి గత ఏడాది జూన్ 26న పంచాయతీ తీర్మానం ఇచ్చినందున, ఆ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి కొత్తగా ఎవరికీ అనుమతి ఇవ్వబోమని దరఖాస్తుదారులకు తేల్చిచెప్పారు.

రూ.15 లక్షలు కేటాయించిన ఎమ్మెల్యే రాజు

వివాదం తలెత్తిన నేపథ్యంలో అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణానికి గతంలో కేటాయించిన రూ.5 లక్షలకు అదనంగా మరో రూ.15 లక్షలను ఎమెల్యే రాజు తాజాగా ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి విడుదల చేశారు. మొత్తం రూ.20లక్షలతో మండపం నిర్మించనున్నట్లు స్థానిక సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స, టీడీపీ నాయకులు ఇదివరకే పేర్కొన్నారు. కాగా అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు రూ.20 లక్షలు విడుదల చేసిన నేపథ్యంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన రూ.18 లక్షలను ఇక్కడి పనులకు కేటాయించలేమని డీఆర్‌డీఏ పీడీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఆయన విజయసాయిరెడ్డికి లేఖ ద్వారా తెలియజేశారు.

నగదు లేక మూతపడిన ఏటీఎం



మూతబడిన ఆంధ్రాబ్యాంకు ఏటీఎం

రావికమతం: మండల కేంద్రంలోని ఆంధ్రాబ్యాంకు ఏటీఎం రెండు రోజులుగా పని చేయక ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం నుంచి మంగళవారం వరకూ బ్యాంకులకు సెలువులు కావడంతో ఖాతాదారులకు ఇదే ఆధారం, ఇది కూడా రెండు రోజుల నుంచి పనిచేయక నగదు కోసం ఇక్కట్లు పడుతున్నారు. బ్యాంకులకు సెలవులు అయినపుడు కనీసం ఏటీఎంలైనా సక్రమంగా పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన టీడీపీ శిక్షణ



ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అప్పలనాయుడు, ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామితో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు

రావికమతం: నాయకత్వ లక్షణాలపై ఈ నెల 10 నుంచి 12వరకూ విజయనగరంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ శిక్షణ ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మండల, గ్రామ దేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శులకు మూడు రోజులపాటు శిక్షణ నిర్వహించారు. రావికమతం మండలం నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, మరో 15 గ్రామాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ అభివృద్ధి డైరెక్టర్ కె.అప్పలనాయుడు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చారని కొండనాయుడు తెలిపారు.

సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలి

రైతులకు ఏవో విజేత సూచన

రోలుగుంట : రైతులు లైనింగ్ పద్ధతిలో వరినాట్లు వేయడం ద్వారా సాగులో వాటి దుబ్బులు గుబురుగా ఎదిగి తేమశాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా కొండపాలెంలో వరి నాట్లు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పించారు.

కిటకిటలాడిన గిరిజాంబ గిరి

స్వామి వారిని దర్శించుకున్న శ్రీకాకుళం డీఎస్పీ శ్రీనివాసరావు



బుచ్చెయ్యపేట : వడ్డాది గిరిజాంబ గిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీకాకుళం ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. తహసీల్దార్ కేవీవీ శివ తదితరులు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి దేవాలయ వ్యవస్థాపక ఛైర్మన్ దొండా కన్నబాబు స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు నరసింగాచారి ఆశీర్వచనాలు అందజేశారు.

చిన్నారి కృష్ణులు





చలపతి, ఉషోదయ స్కూళ్లలో ఘనంగా జన్మాష్టమి

చలపతి స్కూల్‌లో శ్రీకృష్ణుని వేషధారణలో చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకల్లో ఉషోదయ విద్యార్థులు

చోడవరం: పట్టణంలోని చలపతి, ఉషోదయ పాఠశాలల విద్యార్థులు చిన్ని కృష్ణుల వేషధారణల్లో అలరించారు. ఆయా పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి ప్రాధాన్యతను చలపతి స్కూల్ డైరెకర్ మధుసూదనరెడ్డి విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులతో ఉటి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ వేదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉషోదయలో......

పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టడం, చిటికెల భజనలు, కోలాటాలతో పిల్లలు కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి గొప్పతనాన్ని ఉషోదయ విద్యాసంస్థల ఛైర్మన్ జెర్రిపోతుల రమణాజీ వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ ఎస్‌వీ వాసు, హెచ్‌ఎం సూర్య తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు శ్రీకారం

ఉత్సవ రాట పాతిన ఎమ్మెల్యే



ఉత్సవ రాట వేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయం వద్ద ఎమ్మెల్యే కేఎస్‌ఎన్ఎస్ రాజు ఉత్సవ రాటను వేశారు. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు సెప్టెంబర్ నెల 2వరన ముగుస్తాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ చేకూరి రాజు, దేవాదాయశాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి గణేష్, జట్పీటీసీ సభ్యుడు మత్స్యరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఎస్‌వీ మధు, అలమండ బ్గంగారయ్య. వాణి బాబు, ముడుసు గోవింద సకల సూరిబాబు, బాలగణపతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

బుచ్చెయ్యపేట : స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని 15న వడ్డాది కేసీడీ జడ్పీ హైస్కూల్‌లో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ సభ్యులు శనివారం వడ్డాదిలో ప్లకార్డులను ప్రదర్శించారు.

నారుమళ్లకు ఊపిరి పోసిన వర్షం

బుచ్చెయ్యపేట : వర్షాభావంతో ఎండిపోతున్న నారుమళ్లకు కురుస్తున్న వర్షాలు ఊపిరిపోశాయి. పెద్దేరు, బొడ్డేరు, తాచేరు నదీ పరీవాహక ప్రాంతాల్లో నీను చేరింది. దీంతో వడ్డాది, విజయరామరాజు పేట, కుముదాంపేట, మంగళాపురం, చిన అప్పన్నపాలెం రెవెన్యూ పరిధిలో వరినాట్లు జోరందుకున్నాయి.

నేడు చోడవరంలో వైసీపీ కార్యాలయం ప్రారంభం

చోడవరం: పట్టణంలో వైసీపీ కార్యాలయాన్నిఆదివారం ప్రారంభిస్తున్నట ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లింగబాబు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీమంత్రి బలిరెడ్డి సత్యారావు తదితరులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

కుండపోత

వర్షంతో జలమయమైన నర్సీపట్నం

నర్సీపట్నం టౌన్: పట్టణంలో భారీ వర్షం కురిసింది. గడిచిన వారం రోజులుగా ఎండలు మండిపోతుండగా శనివారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై 11 గంటల నుంచి సాయంత్రం వరకు వర్షం ఎడతెరిపి లేకుండా పడింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. శారదానగర్, కొత్తవీధి తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలలో భారీగా వరదనీరు వచ్చి చేరింది. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, ఎస్సీకాలనీ, బీసీకాలనీ తదితర ప్రాంతాల్లో రహదారులన్నీ బురదమయంగా మారాయి. పెద్ద చెరువులో నీరు పుష్కలంగా చేరింది. వరి నారుమడులకు నీరు సైతం పుష్కలంగా అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా పట్టణంలోని మెయిన్‌రోడ్లు, డ్రైనేజీలలో వర్షపు నీరు పొంగి ప్రవహించింది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణ బయట నుంచి చెరువును తలపించే రహదారులు తయారయ్యాయి. దుకాణాల ముందు ఉంచి ద్విచక్ర వాహనాలు మునిగిపోయాయి. వర్షం కారణంగా జనం తడిచి ముద్దయ్యారు. రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం ఎదురుచూస్తున్న రైతులకు వర్షం ఊరటనిచ్చింది. దీంతో రైతులు దమ్ములు చేసి నాట్లు వేసి పనిలో నిమగ్నమయ్యారు.

రైతుల్లో ఆనందం

మాకవరపాలెం:
మండలంలో శనివారం భారీ వర్షం కురవడంతో రైతులు సంబరపడ్డారు. ఉదయం నుంచి ఎండ విపరీతంగా ఉండడంతో ఉపాధి కూలీలు సైతం ఇంటిబాట పట్టారు. దీనికితోడు ఉక్కపోత ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఇంత వరకు వర్షం లేకపోవడంతో మండలంలో 40శాతం వరకు మాత్రమే వరినాట్లు వేశారు. శనివారం కురిసిన వర్షంతో ఆదివారం భారీగా దమ్ములు పట్టేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు చెరువుల నీటితోని, వ్యవసాయ బోర్లుల నీటితోని వరినార్లు ఎండిపోకుండా కాపాడుకున్నారు. భారీ వర్షంతో రైతులకు కష్టాలు తప్పినట్టేయైంది. ఇప్పటికైతే మల్లవరం, నారాయణరాజుపేట, గిడుతూరు, వజ్రగడ గ్రామాల్లో వరినాట్లు పూర్తి చేశారు. కొంత మంది రైతులు అయితే శనివారం మధ్యాహ్నం నాడే మాకవరపాలెం, తామరం, పైడిపాల, పెద్దిపాలెం గ్రామాల్లో దమ్ముల పనులు చేపట్టారు.


పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో కురుస్తున్న వర్షం


కొత్తవీధిలో డ్రైనేజీలు నిండిపోవడంతో రోడ్డుపైకి వచ్చిన వచ్చిన మురికినీరు

కస్తూర్బా పాఠశాలకు రూ.పది వేలు వితరణ


కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారికి నగదు అందజేస్తున్న ఆకాంక్ష ఫౌండేషన్ ప్రతినిధి

మాకవరపాలెం:
కస్తూర్బా పాఠశాల అభివృద్ధికి ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ రూ.పది వేల నగదును సంస్థ సభ్యుడు రవితేజ పాఠశాల ప్రత్యేకాధికారి సరితాదేవికి శనివారం అందజేశారు. అవంతి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యుడు రవితేజ మాట్లాడుతూ ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాదెళ్ల హర్ష జ్ఞాపకార్థం కసూర్బా పాఠశాల అభివృద్ధికి రూ.పది వేల నగదును పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో పాఠశాల ఆవరణ చుట్టూ పూర్తిగా చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కె.రామకృష్ణ, సురేష్, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జింక్ సల్ఫేట్ పంపిణీ


యరకన్నపాలెంలో రైతులకు జింక్ సల్ఫేట్‌ను అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం రూరల్:
మండలంలోని యరకన్నపాలెంలో చంద్రన్న రైతు క్షేత్రంలో రైతులకు నూరుశాతం రాయితీపై జింక్ సల్ఫేట్‌ను మండల వ్యవసాయాధికారిణి కె.ఝాన్సీలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు జింక్‌సల్ఫేట్ వాడటం వలన ఎకరానికి రెండు నుంచి మూడు బస్తాల దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ప్రతిఒక్క రైతు దమ్ములో జింక్ సల్ఫేట్‌ను విధిగా వాడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

21న మండల సమావేశం

గొలుగొండ: ఈనెల 21వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎంవీ సువర్ణరాజు తెలిపారు. ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సాంకేతిక పద్ధతులను అలవర్చుకోవాలి

రోలుగుంట : రైతులు లైనింగ్ పద్ధతిలో వరినాట్లు వేయడం ద్వారా సాగులో వాటి దుబ్బులు గుబురుగా ఎదిగి తేమశాతం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా కొండపాలెంలో వరి నాట్లు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలి

రూరల్ సీఐ రేవతమ్మ

నర్సీపట్నం టౌన్: లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉంటేనే దొంగతనాల నివారణ సాధ్యపడుతుందని నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రేవతమ్మ, పట్టణ ఎస్ఐ జీఎన్‌అప్పన్న అన్నారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులు, కౌన్సిలర్లు, వ్యాపారులకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పెరుగుతున్న దొంగతనాలతో పోలీసు ఉన్నతాధికారులు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈవిధానం అందుబాటులో ఉండడం వలన పట్టణ భద్రత ఉంటుందన్నారు. జిల్లాలోనే ప్రథమంగా నర్సీపట్నం పోలీస్‌స్టేషన్‌లో దీనిని ప్రారంభించనున్నామన్నారు. త్వరలోనే మిగిలిన నర్సీపట్నం సబ్ డివిజన్‌లోని అన్ని పీఎస్‌లకు ఈ విధానం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతి అండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకుంటే ఒటీపీ నంబర్‌తో యూసర్‌ఐడీ వస్తుందని, ప్రజలు ఊర్లు, యాత్రలకు వెళ్లినపుడు యాప్ ద్వారా సమాచారం ఇస్తే వారు ఊరి నుంచి తిరిగొచ్చేవరకు ఆ ఇంటిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. తద్వారా దొంగతనాల నివారణ సాధ్యపడుతుందన్నారు. అనంతరం పలువురు యాప్‌నకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ రేవతమ్మ

ఘనంగా నగర సంకీర్తన

మాకవరపాలెం:
తామరం వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. తెల్లవారు జామున ఆర్‌టీసీ బస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన రామాలయంలో భజనలు చేసి అనంతరం తామరం వేంకటేశ్వరస్వామి గుడి వద్దకు చేరుకున్నారు. మాకవరపాలెం, నర్సీపట్నం భజన బృందాలు భజనపాటలు పాడారు. అనంతరం గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని నర్సీపట్నంకి చెందిన వ్యాపారవేత్త నరసింహమూర్తి దంపతులు సమకూర్చారు.


ర్యాలీగా వెళ్లుతున్న భక్తులు

చురుగ్గా రిజర్వాయర్‌లో పూడిక పనులు

మాకవరపాలెం:
పాపయ్యపాలెం రిజర్వాయర్‌లో పూడిక పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రిజర్వాయర్ అభివృద్ధికి మంత్రి అయ్యన్నపాత్రుడు రూ.20లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే రిజర్వాయర్‌లో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగిస్తున్నట్టు రిజర్వాయర్ నీటి సంఘం అధ్యక్షురాలు రుత్తల రమణమ్మ తెలిపారు. మరో పది రోజుల్లో పనులు పూర్తవుతాయని ఆమె తెలిపారు.


పాపయ్యపాలెం రిజర్వాయర్‌లో పూడిక తీస్తున్న దృశ్యం

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	:	08854 254044
ఎంపీడీవో కార్యాలయం	:	9441953611
తహసీల్దార్ కార్యాలయం	:	9441836336
వెలుగు ఏపీఎం	:	9866074067

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మి (ఏసీ) : ఫిదా

ఊరటనిచ్చిన వర్షం

- అరగంట సేపు ఏకధాటిగా కురిసిన వర్షాలు
- మెట్ట భూముల్లో ఎండుతున్న వరి నారుకు ఊపిరి

పాయకరావుపేట : కొద్ది రోజులుగా వేసవిని తలపించే విధంగా ఎండలు మండుతున్నాయి. శనివారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం రైతులకు ఊరటనిచ్చింది. ఎన్నో రోజులుగా వర్షం కోసం రైతాంగం ఎదురు చూస్తోంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం నల్లని మేఘాలు అలుముకుని అరగంట సేపు భారీ వర్షం పడింది. ఆ తరువాత నుంచి చెదురుమదురుగా సాయంత్రం వరకు వర్షం పడింది. దీంతో వాతావరణం కూడా చల్లబడింది. వరి నాట్లు పూర్తయిన చోట్ల పంటకు మేలు చేస్తుందని మండల వ్యవసాయశాఖ ఏఓ తెలిపారు.

కోటవురట్లలో తేలికపాటి వర్షం

కోటవురట్ల: కోటవురట్ల మండలంలోని పలుగ్రామాల్లో ముసురుతోకూడిన వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఆకాశం మేఘవృతమై వర్షం కురిసింది. ఈ వర్షం మెట్ట ప్రాంతంలో ఎండిపోతున్న వరినారుకు ఊపిరి పోసిందని రైతులు అన్నారు. దీంతో ఈ వర్షం ఇలాగే కొనసాగితే నారుమడులు దుక్కులకు, నాట్లు వేసేందుకు ఉపయోకరంగా ఉంటుందని రైతులు అభిప్రాయం పడుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి వారపు సంతలో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఈ నెల రెండోసారి కురిసిన ఒక మాదిరిగా వర్షం కురిసింది. కురుస్తున్న వర్షాలు సరుగుడు, చెరకు, నువ్వుపంటలకు మేలు చేస్తాయని రైతులు అంటున్నారు. భారీ వర్షానికి రోడ్లు జలయమయ్యాయి. దీంతో వాహన రాకపోకలు ఇబ్బందులు ఎదురయ్యాయి.



నక్కపల్లిలో కురుస్తున్న వర్షం

నక్కపల్లిలో 20 మి.మీ. వర్షపాతం

నక్కపల్లి : నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో శనివారం భారీ వర్షం పడింది. మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత వున్నప్పటికీ ఆ తరువాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. సుమారు గంటసేపు కుండపోతగా పడింది. వరి ఆకుమడులు, వరి నాట్లు ఎండిపోతాయనుకున్న తరుణంలో పడిన ఈ వర్షం వల్ల మేలు జరుగుతుందని రైతులు అన్నారు. నక్కపల్లిలో 20 మి.మీ వర్షపాతం నమోదైంది. పంటపొలాల్లో నీరు చేరింది. ఎస్.రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో కూడా వర్షం కురిసింది.



కోటవురట్లలో కురుస్తున్న వర్షం



పాయకరావుపేటలో....

ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన అవసరం

నర్సీపట్నం టౌన్: ఔషధ మొక్కల పెంపకంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అమరావతి నాచిరోలత్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ పి.మాధవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పెంపకంపై ఎన్జీవోలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అలువెరా, అశ్వగంధ, తులసీ పంటలను పండించే విధానం, కొనుగోలు ఒప్పందం తదితర విషయాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం ఎడమ కాలువ పనులు

వి.ప్రసాద్, సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఇంటర్వ్యూ



పాయకరావుపేట : పోలవరం ఎడమ కాలువ 6వ ప్యాకేజీ పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పోలవరం ప్రాజెక్ట్ పాయకరావుపేట సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.ప్రసాద్ తెలిపారు. ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూ....

ప్ర : పోలవరం ఎడమ కాలువ 6వ ప్యాకేజీ పనులు ఎక్కడ నుంచి ఎక్కడి వరకు చేస్తున్నారు ?

డీఈఈ : 6వ ప్యాకేజి పనులు పాయకరావుపేట వద్ద 111 కి.మీ. నుంచి ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరులోని 136 కి.మీ. వరకు జరుగుతున్నాయి.

ప్ర : పనుల విలువ ఎంత ? ఇప్పటి వరకు ఎంత పని జరిగింది ? ఎంత పేమెంట్ చేశారు ?

డీఈఈ : 6వ ప్యాకేజీ పనుల విలువ రూ.196 కోట్లు, ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తవగా రూ.112 కోట్లు బిల్లులు చెల్లించాం.

ప్ర : 2007లో పూర్తవ్వాల్సిన పనులు పదేళ్ళుగా ఎందుకు కొనసాగుతున్నాయి ?

డీఈఈ : పాయకరావుపేట వద్ద కొండలను బ్లాస్టింగ్‌కి అనుమతులు రాక రెండు కిలో మీటర్ల కాలువ పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా కాలువపై నిర్మాణం చేపట్టే పలు స్టక్చర్లకు సంబంధించి డిజైన్ల మార్పు చేయాల్సి రావడం. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చేసేందుకు నిబంధనలు మార్పు చేయాల్సి ఉన్నందున కాంట్రాక్టర్ ఆలస్యం చేశారు.

ప్ర : ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయా ?

డీఈఈ : కొండను ఆనుకుని నివాస ప్రాంతాలున్నందున కంట్రోల్ బ్లాస్టింగ్‌కి అనుమతులు వచ్చాయి. అదేవిధంగా ప్రభుత్వం జీఓ నం.22, 63లు విడుదల చేసి నిబంధనలు సడలించడం వల్ల మిగిలిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు.

ప్ర : 6వ ప్యాకేజీలో సేకరణకు సంబంధించి సమస్య ఉందా ?

డీఈఈ : 6వ ప్యాకేజి కోసం మొత్తం 1,326 ఎకరాలు సేకరించగా, వీటిలో 1,111 ఎకరాల పట్టా భూములకు పూర్తిగా పరిహారం చెల్లించడమైంది. పి.ఎల్.పురంలో 15.54 ఎకరాల భూమికి సంబంధించి రైతులు కోర్టును ఆశ్రయించినందున అప్పట్లోనే నష్టపరిహారం కోర్టులో జమ చేశాం.

ప్ర : పోలవరం కాలువ మట్టి తరలిపోతున్న దానిపై చర్యలు తీసుకుంటున్నారా ?

డీఈఈ : కాలువ మట్టి తరలిపోకుండా మట్టి గట్టుల వద్ద త్వరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఇక నుంచి రెవెన్యూ పోలీసులు, మైన్స్ ఆధ్వర్యంలో దాడులు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మట్టి తరలిపోకుండా చూడాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పైనా ఉన్నందున కంపెనీకి కూడా నోటీసులు జారీ చేస్తున్నాం.

నత్తనడకన గిడుతూరు వంతెన పనులు

ఎనిమిది నెలల క్రితం నిలిచిన నిర్మాణం... కనిపించని కాంట్రాక్టర్ .. ఆందోళనలో రైతులు... పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం: గిడుతూరు వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వరహానదిపై గిడుతూరు వద్ద వంతెన నిర్మాణానికి 2014వ సంవత్సరంలో ప్రభుత్వం రూ.88 లక్షలు మంజూరు చేసింది. వెంటనే పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ నిధులు చాలవంటూ మధ్యలోనే ఆపేశారు. అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో మంత్రి అయ్యన్నపాత్రుడు వద్ద రైతులు తమ గోడుని విన్నవించుకున్నారు. దీంతో కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడారు. తర్వాత ఈ అంశంపై పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి అయ్యన్న చర్చించారు. అయితే కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టి పిల్లర్లు వేసి సగం వరకు శ్లాబ్ వేశారు. అనంతరం వర్షాలు పడడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. ఎనిమిది నెలల నుంచి పనులు సాగడం లేదు. ఇప్పటికీ కాంట్రాక్టరు కనపడలేదు, పనులు ప్రారంభం కాలేదు. దీంతో మళ్లీ కష్టాలు మొదటకే వచ్చాయని రైతులు అంటున్నారు. వరహానది అవతల వైపు అధికశాతం భూములు ఉండడంతో వంతెన అవసరం ఉందని రైతులు అంటున్నారు. పండిన పంటను ఇంటికి తీసుకురావాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. వర్షాలు పడితే నది పొంగి అవతలకు వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి వంతెన పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నిలిచిన వంతెన నిర్మాణం పనులు

వైద్యశిబిరానికి విశేష స్పందన

200 మందికి వైద్యపరీక్షలు

నర్సీపట్నం టౌన్: పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) ఆధ్వర్యంలో శనివారం ఐదు రోడ్ల జంక్షన్‌లోని జడ్పీ హైస్కూల్(మెయిన్)లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం సెవెన్ హిల్స్ ఆస్పత్రి నుంచి గుండె సంబంధిత నిపుణులు ఎంఎన్ రాజు, కీళ్ల వైద్యనిపుణులు ఎ.నరేంద్రనాథ్, జనరల్ ఫిజిషియన్ డీకేరావు, అంబరీష్‌లు హాజరై సుమారు 200 మందికి ఉపాధ్యాయులకు, వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈసందర్భంగా ఈసీజీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోపీనాథ్, మండల అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు, ప్రధాన కార్యదర్శి జీవీ రమేష్, కేవీ.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి
తులసీ చిత్రమందిర్ - నిన్నుకోరి
పరమేశ్వరి - పటేల్...సార్

రంగులతో ఆకర్షణీయంగా నూతన భవనాలు
గోడలపై పలు చిత్రాలు
పిల్లల బోధనలో మారుతున్న తీరు

అందమైన అంగన్‌వాడీలు


ములకలాపల్లిలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అంగన్‌వాడీ భవనం


ఎలమంచిలి రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయి. నూతన భవనాలను పిల్లల మనస్సు ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. ఎలమంచిలి మండలంలో కొత్తగా 18 అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నారు. అందులో 14 నిర్మాణాలు పూర్తి కాగా మరో రెండింటి పనులు చివరి దశలో, మరో రెండు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. నూతనంగా నిర్మించిన కేంద్రాల్లో లోపల, బయట గోడలపై రంగులతో అందమైన పలు చిత్రాలు గీయిస్తున్నారు. అందులో పలు జంతువులు, పక్షుల బొమ్మలతో పాటు స్వచ్ఛ భారత్ నినాదాన్ని తెలుపుతూ వేసిన చిత్రాలు, కూరగాయలు, పండ్లు చిత్రాలు ఎంతో ఆకర్షనీయంగా ఉన్నాయి. అంతేకాదు కేంద్రాలకు వచ్చే పిల్లలకు పాఠాలు సులభంగా అర్థమయ్యేలా గోడలపై తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలు, అంకెలు కూడా రాయించారు. దీనివల్ల పిల్ల లకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించేందుకు అవకాశం ఉంటుంది. బోధనలో ఇదో కొత్త ఒరవడి. అంగన్‌వాడీల్లో చదివే పిల్లలకు కార్పొరేట్ స్థాయి చదువులు అందించేందుకు ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టింది. నూతన భవనాల్లో రంగులతో వేసిన బొమ్మలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

స్వచ్ఛభారత్ నినాదంతో బొమ్మలు





గోడపై అందంగా వేసిన నెమలి, జంతువులు బొమ్మలు



గోడలపై వేసిన రంగులతో ఉన్న అక్షరాలు, అంకెలు


బయ్యవరంలో అందంగా నిర్మించిన అంగనవాడీ భవనం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

అచ్యుతాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందిస్తోందని ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన తిమ్మరాజుపేట, పెదపాడు, మడుతూరు గ్రామాల్లో ఎస్సీ మహిళలకు వెలుగు ద్వారా వచ్చిన ఆవులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పలు రాయితీలు అందజేస్తువదన్నారు.ఈ మేరకు రూ.60 వేలు విలువ చేసే ఆవులను కేవలం రూ. 15 వేలకే ఇస్తున్నట్టు తెలిపారు. పశుసంవర్థక శాఖ ఏడీ రామచంద్రరావు మాట్లాడుతూ పశువులకు ఎటువంటి వ్యాధులు రాకుండా సిబ్బంది సూచనలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దాసరి పద్మ, సర్పంచులు శనివాడ జువ్వాలనాయుడు, పశువైద్యాధికారులు సౌజన్య, ప్రియాంక, పాల్గొన్నారు.

హామీల అమలులో టీడీపీ విఫలం

వైసీపీ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్


నియామక పత్రాలు అందజేస్తున్న బొడ్డేడ ప్రసాద్

అచ్యుతాపురం రూరల్ : టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో విఫలమైందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. శనివారం హరిపాలెంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు కేవలం అధికార పార్టీ కార్యకర్తలకే అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. చోడిపల్లి అప్పారావును వైఎస్‌ఆర్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా, చేపల వెంకటరమణను వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, నర్మాల రామకృష్ణను జిల్లా కార్యదర్శి, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా గిలకంశెటట్టి కాంతారవు, బిల్లా ప్రకాశరావును నియామించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మారిశెట్టి సూర్యనారాయణ, లాలం రాంబాబు, గండిబోయిన వెంకట్ పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం జరగనున్నట్టు బ్రాండిక్స్ కంపెనీ ఇండియన్ పార్టనర్ దొరైస్వామి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిమిలిలో పోస్టాఫీసు మార్పు

రాంబిల్లి : పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరావు అన్నారు. శనివారం దిమిలిలో ఉన్న ప్రస్తుత బ్రాంచ్ కార్యాలయాన్ని ఎస్‌బీఐ వీధిలోకి మార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న పోస్టల్ కార్యాలయాన్ని ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. తపాళా సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

నేడు వైసీపీ మండల సమావేశం

రాంబిల్లి : రాంబిల్లిలో ఆదివారం వైసీపీ మండల కార్యకర్తల సమావేశం జరగనున్నట్టు ఆ పార్టీ నాయకుడు, వాడనర్సాపురం సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎన్. సాయివరప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు విధిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

శరవేగంగా విద్యుత్ నిర్వాహణ పనులు

ఎలమంచిలి : పట్టణంలోని విద్యుత్ సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఆ శాఖాధికారులు శనివారం ప్రీమాన్‌సూన్ పనులు చేపట్టారు.ఈ మేరకు ఉదయం8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేశారు. చెట్ల కొమ్మల వల్లతరచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుండడంతో తీగలపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించారు.

వివాదాస్పదంగా చెత్త డంపింగ్

మునగపాక : మండలంలోని గణపర్తిలో మురుగు కాలువల నుంచి తీసిన పూడిక, చెత్తను జనావాసాల మధ్య వేయడం వివాదాస్పదంగా మారింది. పంచాయతీ పరిధిలో మురుగు కాలువల నుంచి తీసిన చెత్తను శనివారం స్థానిక శివాలయం, పశువైద్యాలయం పక్కన వేయడంతో సమీపంలోని కాండ్రేగలు సీతారాం, కాండ్రేగుల గోవింద తదితరులు గ్రామ టీడీపీ నాయకుడు కర్రి రామనాగేశ్వరరావుతో ఘర్షణకు దిగారు. చెత్తను జనావాసాల మధ్య వేయడంతోవచ్చే వర్షాకాలంలో ఇళ్ల మధ్యకు అదంతా చేరి, రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీంతో రామనాగేశ్వరరావు పోలీసులను తీసుకువచ్చి చెత్తను ఆ ప్రాంతంలోనే వేసి నెరిపి వేయడంతో స్థానికులు ఆయన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామనాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఏ పని చేపట్టినా.. కొంతమంది అభ్యంతరం చెబుతున్నారని, గ్రామం శివారున లోతట్టుగా ఉన్న ఈ ప్రాంతంలో చెత్తను వేసి దానిపై మట్టి వేసి పూడ్చే పనిని కూడా అడ్డగించడం అన్యాయమన్నారు.

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు

రవీంద్రభారతి, శ్రీచైతన్య పాఠశాలల్లో
అలరించిన చిన్నారుల వేషధారణలు

ఎలమంచిలి : పట్టణంలోని రవీంద్రభారతి, శ్రీ చైతన్య పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. పిల్లలు ఉట్టి కొట్టే సంబరం అందరినీ కడుపుబ్బ నవ్వించేలా సాగింది. ఈ సందర్భంగా రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ వసంత విద్యార్థులకు కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు.


శ్రీ చైతన్య పాఠశాలలో చిన్నారుల సందడి


రవీంద్రభారతి పాఠశాలలో చిన్ని కృష్ణులు, గోపికలు


శ్రీ చైతన్యలో ఉట్టి కొట్టే సన్నివేశం

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

అనకాపల్లి : గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ గ్రంథాలయ అధికారులు బూడిద నాగేశ్వరరావు, కోదండ ఎర్రయ్యలను సన్మానించారు. వివేకానంద చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ కేవీ సత్యవతి, ఎల్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- నిన్నుకోరి
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - లై
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : జయ జానకి నాయక

ఏఎంఏఏలో ఘనంగా రీ యూనియన్ వేడుకలు



మృతిచెందిన స్నేహితుని కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయం



1991-92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొత్తూరు : విద్య నేర్పిన గురువును, చదువుకున్న పాఠశాలను ఎన్నడూ విస్మరించరాదని ఏఎంఏఏ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంగుపాం నాగేశ్వరరావు అన్నారు. కొత్తూరు ఏఎంఏఏ హైస్కూల్‌లో 1991-92లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా రీ యూనియన్ పేరిట పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పూర్వ విద్యార్థులంతా ఈ స్థాయిలో కార్యక్రమం నిర్వహించడం గొప్పవిషయమన్నారు. అంతేకాకుండా పాఠశాలకు రూ.50 వేల విలువైన పరికరాలు అందించినట్టు చెప్పారు. అనంతరం నాటి ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కారించారు. సహచర విద్యార్థి కాండ్రేగుల శ్రీకాంత్ మృతిపై పూర్వ విద్యార్థులంతా సంతాపం తెలుపుతూ, ఆయన కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమ నిర్వాహకులు మళ్ళ సురేంద్ర, డాక్టర్ సందీప్, బొగ్గారపు రామారావు, శరగడం జగదీశ్, కేజీ నాయుడు, కొణతాల శ్రీను, రామసుధ, పద్మ, నీలిమ, వనజ, సాయిలక్ష్మిలతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడినవారంతా పాల్గొన్నారు.

గురువులను కలవడం ఆనందంగా ఉంది



మాకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను 25 ఏళ్ల తరువాత కలిసి సత్కరించడం చాలా ఆనందంగా ఉంది. పాఠశాలలో అడుగుపెట్టగానే నాటి మధురజ్ఞాపకాలు ఒక్కసారిగా గుర్తుకువచ్చాయి.

- బుద్ద సందీప్, ప్రముఖ వైద్యుడు, లండన్

ఈ రోజు మరువలేను



ఆ రోజుల్లో నేను, నా స్నేహితులు చాలా సరదాగా ఉండేవారం. ఈ పాఠశాలలోకి అడుగుపెట్టగానే అవన్నీ గుర్తుకువచ్చాయి. ఇలా మళ్లీ అందరం కలుస్తామనుకోలేదు. ఏది ఏమైనా ఈ రోజు మర్చిపోలేను

- ఎన్.నీలిమ, విజయవాడ

స్నేహితులందరిదీ ఒకటే మాట



మేమంతా ఈ స్కూల్‌లో చదువుకుని 25 ఏళ్లు గడచిన సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. స్నేహాన్ని అంతా గుర్తుంచుకుని ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ కలుసుకున్నాం. ఇదంతా మా స్నేహ బలమేనని నేను నమ్ముతున్నారు.

- మళ్ళ సురేంద్ర, పూర్వ విద్యార్థి, అనకాపల్లి

బర్మా కాలనీలో త్వరలో నీటి సమస్యకు మోక్షం

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని నరసింగరావుపేటకు ఆనుకుని ఉన్న బర్మా కాలనీవాసుల తాగునీటి కష్టాలు త్వరలో తీరనున్నాయి. నరసింగరావుపేటకు జీవీఎంసీ అధికారులు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే దీనికి అనుకుని ఉన్న బర్మాకాలనీకి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ పబ్లిక్ హెల్త్ అధికారులు చేపట్టిన పనులను త్వరలో నిలిపివేశారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించడంతో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ తాగునీటి విభాగం అధికారులు స్పందించి ఆరు లక్షల రూపాయలతో నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉడ్‌పేట నుంచి నరసింగరావుపేట మీదుగా రోడ్డును తవ్వి గొట్టాలు వేసే పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు.



గొట్టాలు వేసేందుకు గోతులు తవ్వుతున్న కార్మికులు

దివ్యాంగురాలికి సీఎం సహాయ నిధి అందజేత

కశింకోట రూరల్ : బయ్యవరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆరు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శనివారం బాధితురాలు గొల్లవిల్లి ప్రియాంకకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనకాపల్లి నియోజకవర్గంలో 6.30కోట్ల రూపాయలు వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయించానన్నారు. అలాగే ఎంపీ నిధుల నుంచి కూడా పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రెండున్నర లక్షల రూపాయలు విడుదల కోరుతూ ప్రతిపాదనలు ఎంపీ కార్యాలయం నుంచి పంపారన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళి, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే బాబర్, మాజీ ఎంపీపీ పెంటకోట సుబ్బలక్ష్మి, టీడీపీ నాయకులు పంచదార్ల సూరిబాబు వేగి గోపీకృష్ణ, నిమ్మదల త్రినాథరావు, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, గొల్లవిల్లి సన్యాసిరావు, శీరం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో వర్షం కురుస్తున్న దృశ్యం

ముసురుతో రహదారులు చిత్తడి

అనకాపల్లి టౌన్/ కశింకోట రూరల్ : అనకాపల్లి, కశింకోట మండలాల్లో శనివారం ముసురు వాతావరణం పట్టింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి చినుకులు ప్రారంభం కావడంతో అన్నిప్రాంతాలు చిత్తడిగా మారాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై అనకాపల్లి పట్టణానికి వచ్చినవారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుభకార్యాలు అధికంగా ఉండడంతో చాలామంది తడుసుకుని వేడుకలకు హాజరయ్యారు. ఈ చినుకులు కారణంగా నిత్యం రద్దీగా ఉండే నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డు, మెయిన్‌రోడ్డు, చిననాలుగు రోడ్ల జంక్షన్, ఎన్టీఆర్ మార్కెట్ రోడ్లు బోసిపోయాయి.



అనకాపల్లికి గొడుగుసాయంతో వస్తున్న మహిళ

కశింకోట జాతీయరహదారిలో..



ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులో..



సత్యసాయి మందిరం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం



నెహ్రూచౌక్ : ఆర్టీసీ కాంప్లెక్సు వద్దగల సత్యమందిరం మార్గంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో సిమెంట్ రోడ్లు, కాలువలు లేకపోవడంతో నిత్యం స్థానికులు, వాహన చోదకులు అవస్థలు పడేవారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక కాలువలేకపోవడంతో మురుగునీరు రహదారిపై ప్రవహించేది. ఈ పనులు చేపట్టడంతో ఈ కష్టాలు తీరుతాయని ఆనందిస్తున్నారు.

మన్యంలో ముసురు వాతావరణం

చింతపల్లి, జీకే వీధిల్లో భారీ వర్షం

పాడేరులో చినుకులతో ఉపశమనం

పాడేరు: ఏజెన్సీ ప్రాంతంలో శనివారం ముసురు వాతావరణం ఏర్పడింది. రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా, శనివారం ఉదయం ఎండకాసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చినుకులు పడ్డాయి. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తున్న నేపథ్యంలో శనివారం వర్షం కురవడంతో జనం ఉపశమనం పొందారు. అయితే వర్షం పెద్దగా కాకుండా చినుకులు పడుతుండటంతో జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. తాజా వాతావరణం వల్ల బయట ప్రదేశంలో సంచారానికి వీలు కాని పరిస్థితి కొనసాగుతోంది. వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే స్థానిక అంబేడ్కర్ కూడలి, మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా మారాయి. వర్షానికి పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. వానచినుకులు పడుతుండడంతో గొడుగులు లేకుండా బయటకు రాలేని పరిస్థితి. అలాగే ఏజెన్సీలోని పాడేరుతో పాటు మిగిలిన మండలాల్లోనూ అల్పపీడన ప్రభావంతో జల్లులు పడుతున్నాయి.





పాడేరులో వర్షానికి గొడుగులు వేసుకున్న యువకులు.. గూడెంకొత్తవీధిలో కురుస్తున్న భారీ వర్షం

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలం కేంద్రంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. దీంతో మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే తిరిగి గ్రామాలకు చేరుకునే వారు గెడ్డలు దాటేందుకు అవస్థలు పడ్డారు. అయితే వ్యవసాయ పనులు చేపడుతున్న రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు పేర్కొన్నారు. మరికొన్ని రోజులు వర్షం కురిస్తే బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు.

చింతపల్లి, జీకే వీధిల్లో...

గూడెంకొత్తవీధి/చింతపల్లి: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చిరు జల్లులు పడ్డాయి. మధ్యాహ్నం తర్వాత ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి.



అలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న బాలరాజు

గ్రామాలకు సదుపాయాలు కల్పించాలి

డీసీసీ అధ్యక్షుడు బాలరాజు

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాలకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు డిమాండ్ చేశారు. ఆర్వీ నగర్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామానికి బడి, గుడి ,ఉండాలన్నారు. గ్రామస్థులు స్వచ్ఛందంగా ఆజనేయస్వామి ఆలయం నిర్మాణానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో నివసిస్తున్న వారికి మంచినీరు, విద్య, వైద్యం, రహదారులు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువపత్రాలపై చర్యలు

సీలేరు: సీలేరు ప్రాంతంలో నకిలీ కుల ధ్రువపత్రాలు ఎక్కువగా ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటామని గూడెంకొత్తవీధి తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. సీలేరు ప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు అధికంగా ఉన్నారన్నారు. వీరు దొంగ సర్టిఫికెట్లను సృష్టించి కింది స్థాయి సిబ్బందిని మభ్యపెట్టి నకిలీ కుల ధ్రువపత్రాలను పొందినట్టు తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. తాను ఇటీవలే ఇక్కడ బాధ్యతలను చేపట్టడంతో పూర్తిగా అవగాహన లేదని, దీనిపై పరిశీలన చేస్తానని చెప్పారు. అలాగే సీలేరు పరిసర ప్రాంతాల నుంచి కుల ధ్రువపత్రాలకు చేసుకున్న దరఖాస్తులపై విచారణ చేయించి, అన్నీ సక్రమంగా ఉంటేనే జారీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

నేడు కోడిపుంజువలసలో వైద్య శిబిరం

పాడేరు: అరకులోయ మండలం కోడిపుంజవలస గ్రామంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెనుమాక రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడిపుంజవలసతో పాటు పరిసర గ్రామాల్లోని గిరిజనులకు ఉపయోగపడాలనే లక్ష్యంతోనే ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

తలారిసింగి ఆశ్రమంలో

కలిసిన 1989-94 బ్యాచ్

పాడేరు: తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం శనివారం జరిగింది. 1989 నుంచి 1994 వరకు పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. అప్పట్లో ఇక్కడ చదివి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ జీవిస్తున్న వారంతా కలిశారు. ఈ సందర్భంగా అందరూ పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. అలాగే తమ కుటుంబ వివరాలను, గత స్మృతులను నెమరు వేసుకున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న రాజారావు, డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న అప్పలస్వామి, ఆశ్రమ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న అప్పలనాయుడు, బాలరాజు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. తమ ఆత్మీయ కలయికకు గుర్తుగా ఒకరికొకరు జ్ఞాపికలను అందించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కె.మత్స్యలింగం, ఒ.జ్ఞానప్రకాశ్, ఉపాధ్యాయులు, సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో కలుసుకున్న 1989-94 బ్యాచ్ విద్యార్థులు

కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

జి.మాడుగుల: ఏజెన్సీలో జీవనం సాగిస్తున్న కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్పించాలని సంఘం అధ్యక్షుడు జగ్గందొర జీనబంధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం కొండకుమ్మర్ల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొండకుమ్మర్లు ఏజెన్సీలోని ఎస్టీలతో కలిసి ఉంటూ, వారిలాగే కట్టుబాట్లు, సంప్రదాయాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. అయినప్పటికీ తమకు ఎస్టీ జాబితాలో చేర్చకపోవడం అన్యాయమని వాపోయారు. గత ఏడాది అరకులోయలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబునాయుడుకు కొండకుమ్మర్లను ఎస్టీ జాబితాలో చేర్పించాలని విన్నవించడంతో, దీనిపై పరిశీలిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల అరకులోయలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి వచ్చిన సీఎం దీనిపై కనీసం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు

800 లీటర్ల పులుపు ధ్వంసం

40 లీటర్ల సారా, సామగ్రి స్వాధీనం

కొయ్యూరు: మండలంలో పలు గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా దాడులు నిర్వహించింది. సురేంద్రపాలెం, బీడీపాలెం, రాజేంద్రపాలెం, కొత్తవీధి, దొడ్డవరం, రేవళ్ల గ్రామాల్లో ఎస్‌ఐ చక్రవర్తి బృందం ఈ దాడులు చేసింది. 800 లీటర్ల పులుపు ధ్వంసం చేయడంతో పాటు 40 లీటర్ల నాటుసారాను, సారా తయారీకి వినియోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, నాటుసారా నివారణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై ఉన్నతాధికారులు స్పందించారని చెప్పారు. వారి ఆదేశాల మేరకుప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామన్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. గతంలో నిర్వహించిన నవోదయం కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఇటీవల తిరిగి పాత పరిస్థితి నెలకొందన్నారు. అయినప్పటికీ నాటుసారా తయారీ, రవాణాను పూర్తి స్థాయిలో నివారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వైఎన్ఎస్.విజయ్ కుమార్, సిబ్బంది రాజశేఖర్, పూర్ణ చంద్రరావుతో పాటు అధిక సంఖ్యలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన సామగ్రిని జీపులో తరలిస్తున్న దృశ్యం


కిందుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


పశువులపాకను ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం, తీగలు

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు

కళ్లాల మధ్యలోనే విద్యుత్ స్తంభాలు
చాలాచోట్ల ఒరిగిపోయి
వేలాడుతున్న వైర్లు
ఆందోళన చెందుతున్న రైతులు

మాడుగుల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చాలాచోట్ల పంట కళ్లాల మధ్యనే వీటిని ఏర్పాటు చేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి వైర్లు కిందకు వేలాడుతున్నాయి. మరికొన్ని చోట్ల చాలా కిందుగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టూ రక్షణ కంచెలు లేవు. మండలంలోని ఎం. కోటపాడు శివారు ఆర్ అండ్ బీ రోడ్డుకు ఆనుకుని శానాపతి కళ్లాల వద్ద ఒకే చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈదురు గాలులు వీచిన పుడల్లా తీగలు ఒకదానికి ఒకటి తగులుకుని ఆ రాపిడికి నిప్పు రవ్వలు పడుతున్నాయి. వాటికి సమీపంలోనే పశువుల పాకలు ఉండడంతో ఏ క్షణంలో ఏం జరుగుతోందనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. జరుగుతోంది. ఇటీవల ఈ కళ్లంలో ఇలా తీగల రాపిడికి నిప్పు రవ్వలు పడి కిందనే ఉన్న గడ్డివామి, పశువుల పాక, అందులో ఉంచిన ధాన్యపు బస్తాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.లక్ష వరకూ ఆస్తినష్టం సంభవించింది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఓ పక్కకు ఒరిగిపోయి కళ్లాల్లోని పాకలపై దగ్గరా వైర్లు వేలాడుతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ విద్యుత్ సరఫ రాను ఆపేందుకు ఏపీ స్విచ్‌ను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం అది ఎందుకూ పనికిరాకుండా తుప్పల్లో పడి ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను, వేలాడుతున్న తీగలను సరి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


నిరుపయోగంగా పడి ఉన్న స్విచ్ పరికరం

అదికారులకు చెప్పినా ఫలితం శూన్యం



మా పంట కళ్లాల చుట్టూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేశారు. ఈదురుగాలులు వీచినపుడు తీగలు ఒకదానికి ఒకటి తగిలి ఆ రాపిడికి నిప్పు రవ్వలు పడుతున్నాయి. కళ్లాల్లోనే పశువుల పాకలు ఉన్నాయి. వైర్లు తగులుకుని ఎక్కడ ఆ పాకలపై నిప్పురవ్వలు పడతాయోనని ఆందోళనగా ఉంది. గతంలో విద్యుత్ సరఫరా ఆపేందుకు ఏర్పాటు చేసిన ఏపీ స్విచ్‌ను తరువాత తీసేశారు. సమస్యను ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పోతుబంది రాజుబాబు, రైతు. ఎం.కోటపాడు

పాకల చుట్టూ విద్యుత్ తీగలే



మా పంట కళ్లాల వద్ద వేసుకున్న పాకలు చుట్టూ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏడాది అంతా కష్టపడి పండించిన ఫలసాయాలను కళ్లాల వద్దే ఉంచుతున్నాం. దీంతో ఎలాంటి అగ్నిప్రమాదాలు జరిగినా నష్టపోతున్నాం. ముఖ్యంగా మా పాకల చుట్టూ ఉన్న విద్యుత్ తీగలు వల్ల భయాందోళనలు చెందుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

శానాపతి రాము రైతు, ఎంకోటపాడు

16న చలో విజయవాడ విజయవంతం చేయాలి

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం

చీడికాడ: ఏపీ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల సాధన కోసం ఈ నెల 16న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని కాంట్రాక్ట్ కార్మికులు విజయవంతం చేయాలని ఏపీ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుంపాల అచ్చింనాయుడు కోరారు.

శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తమ కనీస డిమాండ్‌లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకుని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, బిల్ కలెక్టర్‌కు పీస్‌రేటు రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షలు పరిహారం ఇస్తూ సంస్థలో ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రతి నెలా 1వ తేదిన బ్యాంకుల ద్వారా జీతాలు చెల్లించాలన్నారు.. ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

కె.కోటపాడులోనే కళాశాల ఏర్పాటుకు మంత్రి లోకేష్ హామీ

టీడీపీ నేతల వెల్లడి

కె.కోటపాడు: ప్రభుత్వ జూనియర్ కళాశాలను కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోనే ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని టీడీపీ మండల నాయకులు డోకల లక్ష్మీనరసింహమూర్తి తదితరులు తెలిపారు. శనివారం కోటపాడులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు సిఫారసు మేరకు మంత్రి లోకేష్ కళాశాల భవనాలను కోటపాడు హైస్కూల్ ఆవరణలో నిర్మించాలంటూ జిల్లా అధికార యంత్రాగానికి సూచించారన్నారు. ఇక్కడ కళాశాల కొనసాగింపునకు ఇటీవల భగత్ సింగ్ యువసేన ప్రతినిధులు చేపట్టిన దీక్షలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే రామానాయుడు ఆ విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. హైస్కూల్‌లో శిథిల భవనాలు తొలగించి, ఆ స్థానంలో కళాశాల భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకొచ్చారని చెప్పారు. టీడీపీ నాయకులు గాలి కోటేశ్వరరావు, యింజరపు బ్రహ్మాజీ, నంబారు అప్పారావు, గ్రామపెద్దలు వడ్డాది కోటేశ్వరరావు, రెడ్డి అప్పారావు, భగత్ సింగ్ యువసేన ప్రతినిధి సింగంపల్లి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న నేతలు

మాడుగులలో వర్షం

మాడుగుల రూరల్: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచే చిన్నపాటి చినుకులు ప్రారంభమయ్యి వర్షం పడింది. పదకొండు గంటల నుంచి ముసురుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో వ్యవసాయ పనులకు అనుకూలంగా మారడంతో రైతులు దమ్ములు చేయడం, గట్లు పటిష్ఠం చేయడం వంటి పనులు చేపట్టారు. ఇదే విధంగా వర్షం పడితే నారుమళ్లకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి : రామానాయుడు

దేవరాపల్లి: తెలుగేదశం పార్టీ ఆధ్వర్యంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని తిమిరాం గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ నిధులు రూ.10లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో గత ఏ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి గ్రామాల్లో చేశామని, పదవి లేకపోయినా నియోజకవర్గంకి రాని అభివృద్ధి నిధులు సేకరించి గ్రామాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా చేస్తున్నామని, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

రానున్న కాలంలో మరిన్ని నిధులు ప్రభుత్వం నుంచి తెచ్చి గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బండారు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, గోవాడ షుగర్స్ వైస్‌చైర్మన్ కొప్పాక వెంకటరమణ, పూడి సింహాచలంనాయుడు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రామానాయుడు



వర్షం వస్తే ఇదీ క్రీడామైదానం పరిస్థితి

మట్టి వేశారు...వదిలేశారు

అభివృద్ధి పేరుతో లక్షలు వృథా

చిత్తడిలా మారిన నిక్షేపంలాంటి మైదానం

ఆటల పోటీలకు దూరమైన కొత్తకోట జడ్పీహెచ్ విద్యార్థులు

చెరువు కాదు.. క్రీడామైదానం!



చిత్తడిగా మారిన పాఠశాల ఆవరణ

రావికమతం: అభివృద్ధి పేరుతో నిక్షేపంలా ఉన్న క్రీడా మైదానాన్ని చిత్తడి చేశారు. విద్యార్థుల ఉత్సాహాన్ని నీరుగార్చారు. ప్రతియేటా జెండా పండగకు నిర్వహించే ఆటల పోటీల్లో ఉల్లాసంగా పాల్గొనే ఆ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది ఆ అవకాశానికి దూరమయ్యారు.

మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు రకాల ఆటల పోటీలకు గాను క్రీడామైదానం అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.4.95లక్షలు మంజూరయ్యాయి.



మురుగునీటితో నిండిన గ్రౌండ్

ఈ నిధులతో రన్నింగ్ ట్రాక్, ఖోఖో, కబడ్డీ, వాలీ బాల్ కోర్టులను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. ఇందుకోసం ముందుగా అడుగులోతున మట్టిని తొలగించి ఆపై ఇటుక ముక్కలు వేసి అనంతరం గ్రావెల్‌తో పటిష్ఠ పర్చాలని నిర్ణయించారు. నెల రోజుల క్రితం అడుగు మేర మట్టి తొలగించి ఆపై చేయాల్సిన పనులు చేయకుండా వదిలేయడంతో ఈ ఆట స్థలం వర్షం పడితే చెరువును తలపిస్తోంది. తీసిన చోటే మట్టిని వదిలేయడంతో మొత్తం స్థలమంతా చిత్తడిగా మారి అడుగేస్తే జారిపడే పరిస్థితి నెలకొంది. మైదానంలో ఒక పక్క నీరు మరోపక్క బురదతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వాహించిన ఆటల పోటీలను నిర్వహించకపోవడంతో విద్యార్థులు నిరుత్సాహానికి లోనయ్యారు. మరో రెండు లక్షల రూపాయలతో ఇదే పాఠశాల ఆవరణలో లోలెవెల్ ప్రాంతాన్ని మట్టితో ఎత్తుచేసి దానిపై క్వారీ వేయాల్సి ఉండగా కేవలం మట్టి వేసి వదిలేయడంతో ఈ ప్రాంతం కూడా చిత్తడిగా తయారైంది. ఈ విషయమై ఉపాధి ఏపీవో వసంతకుమార్‌ని వివరణ కోరగా ఉపాధి నిధులతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించి కొంత వరకూ పనులు జరిపామని, ఈలోగా వర్షాలు పడుతుండడంతో పనులు జరగలేదని అన్నారు. త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.


నిక్షేపంలాంటి మైదానాన్ని బురద చేశారు



నిక్షేపంలా ఉన్న ఆట స్థలాన్ని అభివృద్ధి పేరుతో లక్షలు వెచ్చించి బురదమయంగా చేశారు. హైస్కూల్ గేటు దాటి లోపలికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఎంతో మంది ఈ బురదలో జారి పడుతున్నారు. ఈ ఏడాది ఆటల పోటీలు లేకుండాపోయాయి.

జి.దుర్గాప్రసాద్, విద్యార్థి

అడుగు తీసి అడుగు వేయలేని స్థితి



పచ్చని పచ్చికతో ఎంతో విశాలంగా ఉండే క్రీడామైదానం ఇప్పుడు మురుగు నీరు చేరి కంపుకొడుతోంది. నీరు ఎటువైపు వెళ్లక నీరంతా నిలిచి ఇబ్బందిగా మారింది. దీనికితోడు లోపల ఎక్కడ చూసినా బురదగా మారింది. అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

వై.వాసు, విద్యార్థి

ప్రయాణికులను జాగ్రత్తగా తీసుకెళ్లండి

ఆటోడ్రైవర్లకు అనకాపల్లి ఎంవీఐ వేడుకోలు

చోడవరంలో ఆటోడ్రైవర్లతో పోలీసుల సమావేశం



ఆటోడ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎ ఎంవీ ఐ సత్యనారాయణ



సమావేశంలో పాల్గొన్న ఆటోడ్రైవర్లు

చోడవరం: 'దయచేసి నా మాట వినండి. చేతులెత్తి మొక్కుతున్నా....ప్రయాణికుల ప్రాణాలు కాపాడండి. పరిమితికి మించి ఎక్కించుకోకండి. ముందు సీట్‌లో ఎవరినీ కూర్చోనీయకండి' అంటూ అనకాపల్లి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ ఆటో డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి మార్టూరు జంక్షన్ వద్ద రెండురోజుల క్రితం రెండు ఆటోలు ఢీకొని నలుగురు చనిపోయిన నేపథ్యంలో, శనివారం స్థానిక సీఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఆటోలలో డ్రైవర్ సీట్లో ప్రయాణికులను కూర్చోబెడుతుండడం, పరిమితికి మించి ఎక్కిస్తుండడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. మార్టూరు వద్ద జరిగిన ఆటో ప్రమాదానికి కారణం కేవలం డ్రైవ ర్ నిర్లక్ష్యమేనని, ముందుసీట్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో ఎదురుగా వచ్చిన ఆటో డ్రైవర్ మరణించారని, అలాగే ప్రమాదానికి కారకుడైన ఆటో డ్రైవర్ సొంత కూతురుతో పాటు మరో ఇద్దరు కూడా ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన ప్రయాణికుల ప్రాణాలు కాపాడవలసిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. వారిపై అనవసరంగా తామెలాంటి కేసులూ నమోదు చేయమని, ప్రతి డ్రైవర్ విధిగా లైసెన్స్‌తో పాటు, సీబుక్కు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఆటోడ్రైవర్లకు లైసెన్సుల మంజూరులో రవాణాశాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సీఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగమే ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఆటోలు నడిపితే ఎవరినీ ఇబ్బందికి గురిచేయబోమని స్పష్టం చేశారు. అలాగే తాగి ఆటోలు నడిపే డ్రైవర్లను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్షమించేది లేదని ఎక్కడైనా ఆలాంటి వారు తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పట్టణంలో ఆటోలు నిలుపుకునేందుకు స్థలాలు కేటాయిస్తామని, సీరియల్‌లో ఒక ఆటో మినహా మిగిలిన ఆటోలన్నీ స్టాండులోనే ఉండాలని సూచించారు. సీరియల్ పాటించకుండా రోడ్డుపై ఆటోలు పార్కు చేస్తే కేసులు పెడతామని స్పష్టం చేశారు. ఎస్ ఐ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినా పట్టించుకోరా?

ఎండీఎం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

చోడవరం: ప్రభుత్వ పాఠశాలలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసి విద్యార్థుల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి విమర్శించారు. శనివారం ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ చిన్న పొరపాటు జరిగితే నిర్వాహకులను నానా రకాలుగా వేధించి ఇబ్బంది పెట్టే అధికారులు విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తే కనీసం స్పందించకపోగా ఆ కాంట్రాక్టర్లను వెనకేసుకు రావడం అన్యాయమని అన్నారు. అలాగే పాఠశాలలకు సరఫరా అవుతున్న బియ్యంలోనూ విపరీతంగా రాళ్లు ఉంటున్నాయన్నారు.

రానున్న రోజుల్లో పథక నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే విద్యార్థులకు మరింత దారుణమైన ఆహారం అందే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాలలకు సరఫరా చేసే గుడ్లు, సరకుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, నాసిరకం సరకులు సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వరలక్ష్మి డిమాండ్ చేశారు.

కంప్యూటర్ కోర్సులతో ఉపాధి : ఎమ్మెల్యే రాజు



కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగులు కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కోరారు. శనివారం స్థానిక కొత్తూరు జంక్షన్‌లో స్థానిక యువకులు నెలకొల్పిన టెక్నోజెన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రాంత యువతకు మాత్రమే అందుబాటులో ఉండే కంప్యూటర్ కోర్సులు గ్రామీణ ప్రాంత యువకులకు అందుబాటులోకి తీసుకుని రావడం అభినందనీయమన్నారు. జట్పీటీసీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన గిడుతూరు వంతెన పనులు

ఎనిమిది నెలల క్రితం నిలిచిన నిర్మాణం... కనిపించని కాంట్రాక్టర్ .. ఆందోళనలో రైతులు... పట్టించుకోని అధికారులు

మాకవరపాలెం: గిడుతూరు వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వరహానదిపై గిడుతూరు వద్ద వంతెన నిర్మాణానికి 2014వ సంవత్సరంలో ప్రభుత్వం రూ.88 లక్షలు మంజూరు చేసింది. వెంటనే పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ నిధులు చాలవంటూ మధ్యలోనే ఆపేశారు. అనంతరం తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో మంత్రి అయ్యన్నపాత్రుడు వద్ద రైతులు తమ గోడుని విన్నవించుకున్నారు. దీంతో కాంట్రాక్టర్‌ను పిలిచి మాట్లాడారు. తర్వాత ఈ అంశంపై పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి అయ్యన్న చర్చించారు. అయితే కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టి పిల్లర్లు వేసి సగం



నిలిచిన వంతెన నిర్మాణం పనులు

వరకు శ్లాబ్ వేశారు. అనంతరం వర్షాలు పడడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. ఎనిమిది నెలల నుంచి పనులు సాగడం లేదు. ఇప్పటికీ కాంట్రాక్టరు కనపడలేదు, పనులు ప్రారంభం కాలేదు. దీంతో మళ్లీ కష్టాలు మొదటకే వచ్చాయని రైతులు అంటున్నారు. వరహానది అవతల వైపు అధికశాతం భూములు ఉండడంతో వంతెన అవసరం ఉందని రైతులు అంటున్నారు. పండిన పంటను ఇంటికి తీసుకురావాలంటే ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. వర్షాలు పడితే నది పొంగి అవతలకు వెళ్లలేకపోతున్నామని అంటున్నారు. అధికారులు స్పందించి వంతెన పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు.

శ్రీచైతన్యలో కృష్ణాష్టమి సందడి



శ్రీకృష్ణుడు, గోపీకల వేషధారణలో చిన్నారులు

నర్సీపట్నం టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. పాఠశాల ఆవరణలో గోవర్దన పర్వతాన్ని ఎత్తుతున్న శ్రీకృష్ణుడి బొమ్మను ఏర్పాటుచేశారు. చిన్నారులంతా శ్రీకృష్ణులు, గోపీకలు, బలరాముల వేషధారణల్లో అలరించారు. చిన్నారులు పిల్లనగ్రోవి వాయించి ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సూర్యనారాయణమూర్తి శ్రీకృష్ణజన్మష్టమి విశిష్టతను వివరించారు. అనంతరం శ్రీకృష్ణ లీలలు, కాళీయమర్ధనం, కోలాటం, తదితర కార్యక్రమాలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సంతోష్, ఇన్‌చార్జిలు సురేంద్ర, మైథిలీ, సత్యప్రభ పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



ఈసీజీ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

నర్సీపట్నం టౌన్: పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్ టీయూ) ఆధ్వర్యంలో శనివారం ఐదు రోడ్ల జంక్షన్ లోని జడ్పీ హైస్కూల్(మెయిన్)లో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి నుంచి గుండె సంబంధిత నిపుణులు ఎంఎన్ రాజు, కీళ్ల వైద్యనిపుణులు ఎ.నరేంద్రనాథ్, జనరల్ ఫిజిషియన్ డీకేరావు, అంబరీష్‌లు హాజరై సుమారు 200 మందికి ఉపాధ్యాయులకు, వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఈసీజీ పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోపీనాథ్, మండల అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు, ప్రధాన కార్యదర్శి జీవీ రమేష్, కేవీ.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన అవసరం

నర్సీపట్నం టౌన్: ఔషధ మొక్కల పెంపకంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అమరావతి నాచిరోలత్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ పి.మాధవరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో గిరిజన వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పెంపకంపై ఎన్జీవోలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అలువెరా, అశ్వగంధ, తులసీ పంటలను పండించే విధానం, కొనుగోలు ఒప్పందం తదితర విషయాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గిరిజన వికాస్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎం.బెన్నవరంలో కొళాయిలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాతవరం: మండలంలోని ఎం.బెన్నవరంలో తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు, ట్యాంక్ క్లీనింగ్ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఎం.బెన్నవరంలో తాగునీటి అవస్థలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి చినబాబు కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. అలాగే ఎగువన ఉన్న రెండు వీధులకు తాగునీరు అందేందుకు కొళాయిలకు మరమ్మతులు చేయిస్తున్నారు. తాగునీటి ట్యాంక్ పరిశుభ్రం



కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

చేయకపోవడంతో నాచు వస్తుందని గ్రామస్థులు చెప్పడంతో ఆ పనులు కూడా చేయించారు.

హెచ్‌ఎం ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

కృష్ణాదేవిపేట: లింగంపేట పాఠశాలకు హెచ్‌ఎం ప్రసాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని లింగంపేట సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు ఎ. మమత కొనియాడారు. పాఠశాలల్లో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై నాయుడుపాలెం హెచ్‌ఎంగా వెళ్లుతున్న ప్రసాద్‌ను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు ప్రసాద్ ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గండేపల్లి నాగేంద్రం, వైసీపీ మండల యూత్ అధ్యక్షుడు పరవాడ కవి, ఉపాధ్యాయులు ఎం.దేముడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న సర్పంచ్,అధికారులు

నూకాంబిక ఆలయాభివృద్ధికి కృషిచేయాలి

నూతన కమిటీకి ధర్మకర్త ప్రభాకర్ చౌదరి సూచన

నాతవరం: ఇక నుంచి జిల్లేడుపూడి నూకాంబిక ఆలయ అభివృద్ధికి నూతనంగా ఏర్పడిన పాలకమండలి సభ్యులంతా కృషిచేయాలని ఆలయ ధర్మకర్త ఎం.ప్రభాకర్ చౌదరి కోరారు. శనివారం 14 మందితో కూడిన జిల్లేడుపూడి నూకాంబిక ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 సంవత్సరాల నుంచి ఆలయ ధర్మకర్తగా వ్యవహరించి అమావాస్య ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నాన్నారు. ఎన్‌ఆర్‌ఐ వెంకటేశ్వరావు రూ.ఐదు లక్షలతో ఇక్కడ భక్తులకు ధర్మసత్రం నిర్మించగా, సినీ డైరెక్టర్ పరశురామ్ రూ.మూడు లక్షలతో కళామందిరం భవనాన్ని నిర్మించారన్నారు. తాను లక్షలాది రూపాయలతో అనేక ఆలయాలు ఇక్కడ నిర్మించినప్పటికీ పెరుగుతున్న భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతన పాలకమండలిలో రెండు గ్రామాల సర్పంచ్‌లతోపాటు సేవాభావం కల్గిన మరో 12 మందిని నియమించామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సన్యాసిదేముడు, జడ్పీటీసీ



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు, ప్రజాప్రతినిధులు

సభ్యుడు కరక సత్యనారాయణ, వైసీపీ నాయకులు అంకంరెడ్డి జమీలు, వి.సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు ఎన్.వెంకటరమణ, సర్పంచ్‌లు హాజరయ్యారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన నేడు

నర్సీపట్నం టౌన్: బలిఘట్టం సమీపంలోని ఉత్తర వాహిని శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి కోటి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు పెరివిల్లి భద్రాచలరామం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసం సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులంతా అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

ఫ్యూజ్‌బాక్స్ ఏర్పాటుచేయాలి

నాతవరం: మండలంలోని గుమ్మిడిగొండలో వినాయకుని ఆలయం వద్ద ఉన్న వీధి స్తంభానికి ఏర్పాటు చేసిన బోర్డుకు ఫ్యూజుబాక్సు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇక్కడున్న ఫ్యూజ్‌బాక్సు స్కూల్ పిల్లలకు అందేటట్టు ఉందని, ఈ బోర్డుకు రక్షణ బాక్సు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చేస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి ఫీజు బాక్స్ వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

మండలాధ్యక్షురాలు రుత్తల చిన్నయ్యమ్మ

మాకవరపాలెం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ తెలిపారు. శనివారం తామరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇళ్ల వద్ద కూడా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. తామరంలో 156 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెల్లారత్నం, ఎంపీటీసీ సభ్యురాలు రత్నం, పంచాయతీ కార్యదర్శి శివరామ్, వైసీపీ నాయకుడు హరిబాబు, టీడీపీ నేత నూకినాయుడు పాల్గొన్నారు.



తామరం పంచాయతీ భవనంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

అభివృద్ధికి నోచుకోని చినదొడ్డిగల్లు చెరువు

- ఆయకట్టుకు నీటి కరువు
- పశువులకు తాగునీటి కొరత

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి సమీపంలో ఉన్న తిరుపతిరాజు చెరువు అనేక ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువు కింద సుమారు 30 ఎకరాల ఆయకట్టు ఉంది. కనీసం ఒక్కసారి కూడా పూడికతీత చేపట్టకపోవడం వల్ల చెరువు గర్భం తుప్పలు, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఫలితంగా చెంతనే చెరువు ఉన్నా ఎందుకూ ఉపయోగపడకుండా పోతోంది. వర్షాలుపడినప్పుడు నీరు నిల్వవుండే అవకాశం కూడా లేదు. అదేవిధంగా ఈ చెరువు నుంచి సమీప ఆయకట్టు భూములకు నీరు ప్రవహించేలా కాలువ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. నాలుగు ఎకరాల చెరువు ప్రస్తుతం పది సెంట్ల చెరువులా కనబడుతుంది. పిచ్చిమొక్కలు, తుప్పలు ఏళ్ల తరబడి పెరిగిపోవడంతో ఈ చెరువు గర్భం కుచించుకుపోయిందనే చెప్పాలి. కనీసం వేసవిలోనైనా సరే పశు సంపదకు నీరు తాగేందుకు వీలుగా ఉపాధి హామీ పథకం ద్వారా ఈ చెరువు పూడికతీత, మరమ్మతు పనులు చేపడితే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.పైగా గ్రామానికి ప్రవేశమార్గంలో ఈ చెరువు వున్నందున పార్కులా తీర్చిదిద్దాలని కోరారు. ఈ చెరువులో నీరు లేకపోవడంతో పశువులకు తాగునీరు కొరతగా ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తిరుపతిరాజు చెరువును అభివృద్ధి చేస్తే ఇటు గ్రామానికి, అటు రైతులకు, పశుపక్ష్యాదులకు మేలు చేకూరుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.


తుప్పలతో నిండిన చెరువు గర్భం

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

నక్కపల్లి : నక్కపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల రెసిడెన్షియల్ కళాశాల(గురుకులం)లో శనివారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలభివృద్ధికి రంగనాథన్ చేసిన కృషిని ఆయన విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాల విశిష్టతలపై విద్యార్థులకు తెలియజేశారు. ఇందులో వైస్ ప్రిన్సిపల్ జీకే రత్నకుమారి, లైబ్రేరియన్ బీ వెంకటలక్ష్మి, గురుకులం అధ్యాపకులు శ్యామల, మైథిలీ, ఎన్‌వీఎస్ లక్ష్మి, లక్ష్మీ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నక్కపల్లి శాఖ గ్రంథాలయం ఆవరణలో గ్రంథాలయాధికారి కలగాన జనార్దనరావు ఆధ్వరంలో నిర్వహించారు.


రంగనాథన్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాజుగారిబీడులో పారిశుధ్య పనులు

పాయకరావుపేట : స్థానిక రాజుగారిబీడులో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ ఈఓ ఎం.వి.ఎస్.లవరాజు తెలిపారు. 'రాజుగారి కోటలో సమస్యల బందీ' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రాజుగారిబీడులో పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాలు, ఇళ్ళమధ్య నిలిచిన మురుగునీరుపై దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ మాట్లాడుతూ రాజుగారిబీడు త్వరలో సీసీ కాలువల నిర్మాణం జరుగనున్నందున ఇళ్ళముందు మురికి గుంతలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని యజమానులను కోరామని ఈఓ చెప్పారు. అదేవిధంగా ఇళ్ళమధ్య పేరుకుపోయిన మురుగు బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.


కాలువలు శుభ్రం చేస్తున్న కార్మికులు

అడ్డురోడ్డులో సీసీ కెమెరాలు

ఎస్.రాయవరం(నక్కపల్లి): ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు జాతీయ రహదారి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. హైవే రెండు వైపులా రెండు సీసీ కెమెరాలను శనివారం అమర్చారు. ఈ సీసీ కెమెరాలను అడ్డురోడ్డు జంక్షన్ సమీపాన వున్న సీఐ కార్యాలయానికి, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. అడ్డురోడ్డులో స్టాపర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు.



గ్రామీణులకు సకాలంలో అందని వైద్యసేవలు

- శిథిలావస్థకు చేరుతున్న సబ్‌సెంటర్ భవనాలు
- స్థానికంగా నివాసం ఉండని సిబ్బంది
- సంచి డాక్టర్లే దిక్కు

కోటవురట్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందక అవస్థలు పడుతున్నారు. మండలంలో 9 ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రతి 3500 జనాభాకు ఒక ఉప ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో అన్నవరం, తంగేడు, బీకేపల్లి, ఎండపల్లి, ధర్మసాగరం, కోటవురట్ల, కైలాసపట్నం, కొడవటిపూడి, గొట్టివాడ గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో అన్నవరం, కొడవటిపూడి, తంగేడు గ్రామాల్లో సబ్‌సెంటర్‌కు భవనాలు ఉన్నాయి. అయితే సిబ్బంది నివాసం ఉండకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుతున్నాయి. సబ్‌సెంటర్ పరిధిలో ఏఎన్‌ఎం నివాసం ఉండకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం లేదని విమర్శలు ఉన్నాయి. నర్సీపట్నం మాకవరపాలెం, ఎస్.రాయవరం మండలాల నుంచి ఏఎన్‌ఎంలు ఇక్కడకు రాకపోకలు సాగిస్తున్నారు. రికార్డుల్లో ఏఎన్‌ఎంలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని ఉంటుందని, అయితే వాస్తవంగా వెళ్లడం లేదని తెలిసింది. ఆరోగ్య ఉపకేంద్రాల ద్వారా సక్రమంగా వైద్యసేవలు అందకపోవడంతో సంచి డాక్టర్లను పలువురు ఆశ్రయిస్తున్నారు. అవగాహన లేని కొంతమంది ఆర్‌ఎంపీ వైద్యుల వల్ల రోగులు ప్రాణాల మీదకు తెచ్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి పల్లెల్లో వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయాన్ని డాక్టర్ ప్రశాంత్ కుమార్ వద్ద ప్రస్తావించగా కొందరు దూర ప్రాంతాల నుంచి తిరుగుతుండడం వాస్తవమేనని అన్నారు. కొందరు సబ్‌సెంటర్ భవనాలు లేక వారి సొంత ఖర్చులతో సబ్‌సెంటర్లు నిర్వహిస్తున్నారన్నారు.


తంగేడులో శిథిలావస్థకు చేరుకున్న సబ్‌సెంటర్ భవనం

శ్రీచైతన్య స్కూల్‌లో కృష్ణాష్టమి


కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఉట్టికొట్టడం, కోలాటం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ ఏజీఎం సురేష్, రీజినల్ ఇన్‌చార్జి గోపి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ కనకారావు, ఉపాధ్యాయులు ఎ.పి.విజయ్, ప్రైమరీ ఇన్‌చార్జి లావణ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, అవిద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కొండబాబు మృతి



కోటవురట్ల: స్థానిక పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు లాలం కొండబాబు(62) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడైన కొండబాబు మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షునిగా ఉన్నారు. గత కొన్ని నెలలుగా దీర్ఘకాలికవ్యాధితో బాధపడుతూ తెల్లవారు జామున మరణించారు. కొండబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కుటుంబీకులకు టీడీపీ, వైసీపీ నాయకులు పరామర్శించారు. మంత్రి అయ్యన్న సోదరుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు లాలంకాశీనాయుడు, సహకార సంఘం కార్యదర్శి బాబు, వారి సిబ్బంది ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హరికృష్ణ, పెన్షన్‌దారుల సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఫోన్ ద్వారా పరామర్శించారు.

రాజవరంలోనే రేషన్ ఇవ్వాలి


డీటీ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజవరం గ్రామస్థులు

పాయకరావుపేట : మండలంలోని రాజవరంలో రేషన్ ఇవ్వాలని ఆ గ్రామస్థులు కోరారు. శనివారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వేణగోపాల్‌కు రాజవరం గ్రామానికి చెందిన యజ్జల సత్యనారాయణ, కాకాడ కృష్ణ ఆధ్వర్యంలో పలువురు గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి పడుతున్న ఇబ్బందులను గ్రామస్థులు వివరించారు. గత నెల పోర్టబులిటీ ద్వారా కేశవరం రేషన్ డిపో నుంచి రేషన్ పంపిణీ చేసిన అధికారులు ఈ నెల కేశవరం డిపోలో స్టాకు లేనందున పెంటకోట రేషన్ డీలర్ నుంచి రేషన్ తీసుకోవాలని తెలియజేశారన్నారు. పెంటకోట వెళ్లాలంటే నాటు పడవలపై ఉపుటేరు దాటాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వై.రమణ, వై.అన్నవరం, సీహెచ్.జగన్నాధం, వై.దేముడు, కె.నాగేశ్వరరావు, కె.కాశిరావు, ఒ.దేముడు, సూర్యారావు, జి.కాసులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో వానందం

ఎలమంచిలి/రూరల్/రాంబిల్లి/మునగపాక/అచ్యుతాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ శనివారం భారీ వర్షం పడింది. దీంతో నాలుగు రోజులుగా ఎండ తీవ్రతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. రాంబిల్లిలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలోఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో జలమయమయ్యాయి. పంట పొలాల్లోనూ నీరు చేరింది. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎస్‌బీఐ వద్ద నీరు నిలిచిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అచ్యుతాపురంలోనూ భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మండలంలోని లోతట్టు పాంతాలు జలమయమయ్యాయి. పూడిమడకలో ఉప్పు గల్లీలు నీట మునిగాయి. ఎలమంచిలి పట్టణం, మండలంలో కురిసిన వర్షంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల వర్షాలు సకాలంలో పడకపోవడంతో కొన్ని గ్రామాల్లో నారుమళ్లు ఎండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పులపర్తి, క్రిష్ణాపురం, ఏటికొప్పాక, పోతిరెడ్డిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లలో నీరు చేరింది. మునగపాకలోని నాగులాపల్లి, ఒంపోలు గ్రామాల్లో కూడా భారీగా వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ఎలమంచిలి పట్టణంలో పడుతున్న వర్షం


పోలీస్‌స్టేషన్ జంక్షన్ వద్ద
పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డులో దుస్థితి


అచ్యుతాపురంలో భారీగా కురుస్తున్న వర్షం


రాంబిల్లి మండల పరిషత్ కార్యాలయం
ఎదుట నిలిచిన నీరు


పులపర్తిలోని ఆకు మడిలో చేరిన వర్షపు నీరు



నాగులాపల్లిలో వెంకన్నకు పూజలు

మునగపాక : నాగులాపల్లిలో వెంకటేశ్వరస్వామి పల్లకీ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా పాటిమీద వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఉయ్యాల సేవ ప్రారంభమైంది. ఆలయాభివృద్ధిలో భాగంగా బీశెట్టి భాస్కరరావు ఇత్తడి పల్లకిని, రెడ్డి ఈశ్వరరావు-మనీషా దంపతులు ఉయ్యాలను, పొలమరశెట్టి శ్రీనివాసరావు-బుజ్జి దంపతులు పల్లకి స్టాండ్‌ను బహూకరించారు. ప్రతి శనివారం గ్రామ పురవీధుల్లో పల్లకీ సేవ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు పంచాయతీ భవనం ప్రారంభం

మునగపాక : వాడ్రాపల్లిలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించనున్నారని సర్పంచ్ కాండ్రేగుల సత్యవతి, మాజీ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు.అలాగే మునగపాకలో పలు అభివృద్ధి కార్యక్రమాలకుఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు.

కృష్ణాపురంలో స్వచ్ఛభారత్

ఎలమంచిలి రూరల్ : మండలంలోని శనివారం ఉదయం క్రిష్ణాపురంలో ఉప సర్పంచ్ కొలగాని నాగేశ్వరరావు, కార్యదర్శి ఈశ్వరరావు ఆధ్వర్యంలో యువకులు పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధానంగా గ్రామంలోని ప్రధాన రోడ్డు రహదారికి ఇరువైపుల ఉన్న చెత్తను బ్లేడ్ ట్రాక్టర్‌తో తీయించి రోడ్లను శుభ్రం చేయించారు.అలాగే అన్నివీధుల్లోనూ తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్తులు వ్యక్తిగత మరుగుదొడ్లనే వాడాలని కోరారు. రోడ్లపై బహిరంగ మలవిసర్జన చేసినట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

మునగపాక : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నడిరోడ్డుపై ఉరితీస్తాం... నరికేస్తాం...అంటూ వ్యాఖ్యాలు చేసిన ప్రతిపక్షనేత జగన్‌పై రాష్ట్ర ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. చంద్రబాబుపై జగన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. మునగపాకలో జిల్లా తెలుగు యువత నాయకుడు ఆడారి కుమార్ చేపట్టిన నిరాహార దీక్ష శనివారంతో 48 గంటల కావడంతో ఎమ్మెల్యే ఆయనకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జగన్ వ్యాఖ్యలపై మండి పడుతున్న ప్రజాగ్రహం నేపథ్యంలో తెలుగు యువత నాయకుడు ప్రజాస్వామికంగా తమ ఆగ్రహాన్ని నిరాహారదీక్ష ద్వారా తెలియజేశారన్నారు. అయితే కుమార్ దీక్ష చేస్తున్న దృశ్యాన్ని పార్టీ అధిష్టానం పరిగణనలోకి తీసుకుని కేవలం వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడం కోసం ప్రతిపక్ష నేత ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అలాంటి ్యాఖ్యలు పట్టించుకుని కార్యకర్తల ఆరోగ్యం పాడు చేసుకోవడం మంచిదికాదని చెప్పడంతో దీక్ష విరమింపజేస్తున్నామని తెలిపారు. వైసీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా దీక్షకు సిద్ధపడిన కుమార్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆడారి మంజు, టీడీపీ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగబూషణం, దొడ్డి శ్రీనివాసరావు, మద్దాల వీరినాయుడు, డి. ముసిలినాయుడు, బొడ్డేడ రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు టెక్కలి పరశురాం, దాడి జమున, మళ్ల వరహానరసింగరావు, సర్పంచ్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.


కుమార్‌తో దీక్ష విరమింపజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

చురుగ్గా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

ఎలమంచిలి :పట్టణంలోని యర్రవరం వార్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు 6 లక్షల రూపాయలతో చేపడుతున్న ఈ పనులకు సంబంధించి జేసీబీ సహాయంతో లోతట్టు కాలువను తవ్వి కాంక్రీటు పనులు చేపడుతున్నారు. గతంలో చినుకు పడితే చాలు ఈ ప్రాంతమంతా ముంపునకు గురయ్యేది. దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. వర్షం వీధుల్లో రోజులు తరబడి నీరు నిలిచిపోయేది. దీంతో పాలకులు, అధికారులు ఇక్కడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు.


ఎర్రవరం వార్డులో జరుగుతున్న పనులు

శరవేగంగా చెత్తశుద్ధి కేంద్రాల పనులు

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని కాశీపాలెం, జంగుళూరు, హరిపాలెం గ్రామాల్లో చెత్తశుద్ధి కేంద్రాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చెత్త నుంచి సంపద తయారు చేయడానికి ప్రభుత్వం వీటిని ప్రతి పంచాయతీలోనూ ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే సెజ్ పునరావాస కాలనీ దిబ్బపాలెం పరిధిలో 10 లక్షల రూపాయలతో అధికారులు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సేకరించి, వాటిలో తడి, పొడి చెత్త వేరు చేస్తున్నారు. అలాగే వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ కేంద్రం ఏర్పాటు చేసి, వాటి ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూస్తున్నారు. ఈ మేరకు దిబ్బపాలెం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మండల పరిధిలో అన్ని గ్రామాల్లోనూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఈ మేరకు తొలి విడతగా కాశీపాలెం, జంగుళూరు, హరిపాలెం గ్రామాల్లో స్థలాలు ఎంపిక చేశారు. 3.5 లక్షలతో షెడ్‌లను ఏర్పాటు చేసి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి వల్ల గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడడంతో పాటుగా పంచాయతీకి ఆదాయం సమకూరనుంది.

'పోరాట యోధుల చరిత్ర తెలుసుకోవాలి'



నెహ్రూచౌక్ : ఎన్టీఆర్ స్టేడి యం సమీపంలోని డీవీఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమకారులపై క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ సత్యవతిలు మాట్లాడుతూ దేశంకోసం ప్రాణత్యాగం చేసిన నాయకుల చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. దేశం మనకేం చేసిందనేకన్నా దేశానికి మనం ఏం చేశామో గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి, అధ్యాపకులు శ్రీధర్, ఉషా, సంధ్యారాణి పాల్గొన్నారు.


చేతిబోరు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

కొందరి చర్యలతో అందరికీ అవస్థలు
అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యం
అరకొర నీటితో ఇబ్బందులు పడుతున్నామన్న మహిళలు
భట్లపూడిలో ఇదీ నిత్యతంతు

నోరున్న వాడిదే నీరు!


గ్రామంలో కుళాయి నుంచి పైపుతో నీటి చౌర్యం

అనకాపల్లి రూరల్ : భట్లపూడివాసులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కళ్లెదుటే నీటి వనరులున్నా ఈ సమస్య వీరికి తప్పడం లేదు. అనకాపల్లికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో సుమారు ఎనిమిది వందల ఇళ్లు ఉండగా, మూడువేల మంది వరకు నివాసం ఉంటున్నారు. లెక్కకు మించి కుళాయి కనెక్షన్లు ఉన్నా వాటి నుంచి వచ్చేనీరు అరకొరగానే ఉంటోంది.

చేతి బోరు నుంచి బురద నీరు



గ్రామంలో గతంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి ట్యాంకును నిర్మించారు. దీని ద్వారా కొంత కాలంపాటు అన్ని ప్రాంతాల వారికి అవసరమైన నీటిని పూర్తిస్థాయిలో అందించేవారు. కొన్నాళ్ల నుంచి ఇక్కడ నీటి కష్టాలు ఆరంభమయ్యాయి. గ్రామంలోని కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలావుండగా, గ్రామంలోని చేతి బోరు నుంచి నీరు పట్టుకుందామంటే బురద నీరు వస్తుందని వాపోతున్నారు. ఈ నీటిని తాగితే ఎక్కడ అంటురోగాలు ప్రబలుతాయోనని భయపడి తాగడం లేదని చెపుతున్నారు.

మా కష్టం ఎవరికీ పట్టడం లేదు




ఈ గ్రామంలో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. అయినప్పటికీ మౌలిక వసతులకు నోచుకోలేకపోయాం. కొందరి చర్యల ద్వారా నీటి కష్టాలను ఎదుర్కొంటున్నాం. మా ప్రాంతంలో కుళాయి కనెక్షన్లు ఉన్నా వాటి నుంచి సరిగా నీరు సరఫరా కావడం లేదు. ఉన్న చేతి బోర్ల నుంచి వచ్చే నీరు బురదగా ఉంటుండడంతో గొంతు తడుపుకో లేకపోతున్నాం.

- మునపర్తి లక్ష్మి, గ్రామస్థురాలు

నిర్భయంగా నీటి చౌర్యం!

గ్రామంలోని మంచి నీటి ట్యాంకు నుంచి నేరుగా మోటార్ల ద్వారా కొంత మంది తమ స్వప్రయోజనాల కోసం నీటిని మళ్లించుకుని చౌర్యానికి పాల్పడుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే లేనిపోని సమాధానాలు చెపుతున్నారని పలువురు వాపోతున్నారు. అలాగే ఇంకొంతమంది కుళాయిలకు పైపులు తగిలించి మరీ తమ కుటుంబం ఒక్కరికి మాత్రం నీరు అందేలా చూస్తున్నారని చెపుతున్నారు. దీంతో నీటికి చెప్పలేని అవస్థలు ఎదుర్కొంటున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


వాటర్ ట్యాంకు నుంచి మోటార్లతో నీటిని తోడుతున్న దృశ్యం

ఇష్టారాజ్యంగా నీటిని మళ్లిస్తున్నారు



గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకు వద్ద నుంచే కొంతమంది మోటార్ల సాయంతో నీటిని దర్జాగా మళ్లించుకుంటున్నారు. అలాగే కొంత మంది నీటిని చౌర్యం చేస్తున్నారు. దీంతో మా ప్రాంతంలో కుళాయి కనెక్షన్లు ఉన్నా ఎటువంటి ఫలితం లేకపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి చౌర్యాన్ని అరికట్టాలి.

- కరెడ్ల శ్రీనివాసరావు, గ్రామస్థుడు

'నవోదయ'లో గ్రీన్ గణేష్ ప్రచారం

అనకాపల్లి టౌన్ : గవరపాలెం నవోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం గ్రీన్ గణేష్ క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పర్యావరణ భాగస్వామ్య అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి హానికరంగా పేర్కొన్నారు. గణపతి పూజ అనంతరం విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు పర్యావరణాన్ని కలుషితం చేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహానే పూజించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ శరగడం నర్సమ్మ, కొయిలాడ శివాజీ తదితరులు పాల్గొన్నారు.


మట్టి విగ్రహాల ఆవశ్యకతను వివరిస్తున్న శ్రీధర్

వచ్చే నెల 30 నుంచి బాలికలకు కూచిపూడిలో శిక్షణ

అనకాపల్లి టౌన్ : కూచిపూడి నృత్యంపై బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు కూచిపూడి మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్టు కళ్యాణి నృత్య సంగీత అకాడమీ కరస్పాండెంట్ ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకాడమీ ఏర్పాటు చేసి పన్నెండేళ్లు పూర్తయిన సందర్భంగా సంప్రదాయ నృత్యమైన కూచిపూడిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నదే తన లక్ష్యమన్నారు. వచ్చే నెల 30న విజయ దశమి సందర్భంగా తరగతులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. సెప్టెంబర్ 10లోగా ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99595 77789 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

'పోరాట యోధుల చరిత్ర తెలుసుకోవాలి'

నెహ్రూచౌక్ : ఎన్టీఆర్ స్టేడియం సమీపంలోని డీవీఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వాతంత్ర్య ఉద్యమకారులపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ సత్యవతిలు మాట్లాడుతూ దేశంకోసం ప్రాణత్యాగం చేసిన నాయకుల చరిత్రను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. దేశం మనకేం చేసిందనేకన్నా దేశానికి మనం ఏం చేశామో గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి, అధ్యాపకులు శ్రీధర్, ఉషా, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు

అఖండ భారత దివస్ రేపు

అనకాపల్లి టౌన్ : వివేకానంద హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు అఖండ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఎం.సత్యనారాయణ, బి.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యవక్తగా పరిషత్ రాష్ట్ర సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తారని వివరించారు. పెద్ద సంఖ్యలో పట్టణవాసులు పాల్గొనాల్సిందిగా కోరారు.

అలరించిన చిన్నికృష్ణులు

నెహ్రూచౌక్ : ఉడ్‌పేటలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పిల్లలకు శనివారం వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. ఉట్టికొట్టే సంబరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



17 నుంచి దివ్యాంగుల క్రికెట్

అనకాపల్లి : ఆంధ్రరాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 19 వరకు విశాఖ ఉక్కు క్రీడా మైదానంలో నార్త్‌జోన్ దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి మధుసూధన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలకు 81848 22110 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.